అక్టోబర్ 2023
210
సంపుటి :19 సంచిక : 5
వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

అధ్యయనం లేకుండా మార్క్సిస్టుగా మనలేం
అధ్యయన పద్ధతుల్ని సంస్కరించుకొందాం
కలికాలం
శాస్త్రీయ దృక్పథం
ఎవరీ సావర్కర్?
ఉప ఎన్నికల ఫలితాలు: బిజెపి వ్యతిరేక సంకేతాలు
సుదూర కలగా మిగిలిన 'అనీమియా ముక్త్ భారత్'
అలెండీ..... బ్రతికే ఉన్నాడు

పోరాట స్ఫూర్తి

# అలెండీ... బ్రతికే ఉన్నాడు



రాజగోపాల శర్మ

ఎక్కడైతే నూతన సరళీకరణ ఆర్థిక విధానాలు మొదటిసారి పురుడుపోసు కున్నాయో... ఎక్కడైతే పెట్టుబడిదారి విధానం లాభాల వేట కోసం వెర్రితలలు వేసి, కుట్రలు చేసిందో... అక్కడ... ఆ గడ్డ ఇప్పుడు తన మొట్టమొదటి పోరాట యోధుడిని తలుచుకుంటోంది. కుట్రలు, కుతంత్రాలను ఎదుర్కొని ప్రజల కోసం చిట్టచివరి క్షణం వరకు నినదించిన ఆ గొంతు ఇప్పుడు జనం నోట ప్రతిధ్వ నిస్తోంది. ఆ గడ్డ చిలీ! ఆ పోరాట యోధుడు నాటి చిలీ అధ్యక్షుడు, వామపక్ష సోషలిస్టు పార్టీ వ్యవస్థాపకుడు సాల్వే డార్ అలెండీ! అవును... అలెండీకి చావులేదు! అమెరికా కుట్రతో జరిగిన తిరుగుబాటులో పోరాడుతూ ప్రాణాలు విడిచిన 50 ఏళ్ల తరువాత ఇప్పుడు చిలీ అలెండీ ఆశయాలను స్మరించుకుంటోంది. ఆయన చనిపోయిన, కాదు కాదు అమెరికా సామ్రాజ్యవాదులు, వారి చిలీ తాబేదారులు కలిసి చంపివేసిన గడ్డ మీద అర్ధ శతాబ్దం తరువాత మొదటిసారిగా వామ పక్ష ప్రభుత్వాన్ని చిలీ ప్రజలు ఎన్నుకున్నారు. చిలీ దేశపు నవ తరానికి, యువ తరానికి అలెండీ ఓ కథా నాయకుడు! ప్రజల కోసం ప్రాణాలర్పించిన ధీరోధాత్తుడు.

సెప్టెంబర్ 11 ... అమెరికాపై ఉగ్ర దాడి జరిగిన రోజుగా స్మరించుకున్నారు. కానీ అది అమెరికాపై దాడి జరిగిన రోజు మాత్రమే కాదు! అమెరికా దుర్మార్గానికి, రక్తదాహానికి, అది చేసే కుట్రలకు, కుతంత్రాలకు కూడా ఆ తేదీ ఒక చిహ్నం. అవును.. 1973 సెప్టెంబర్ 11 ... చిలీ చరిత్రలో రక్తాక్షరాలతో రాసిన దినం! ప్రజలు ఎన్నుకున్న కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కుట్రతో కూల్చివేసిన రోజు! సిఐఎ అండదండ లతో ఆ ప్రభుత్వాధినేతను బలిగొన్న రోజు! ముంచుకొస్తున్న మృత్యువును సవాల్ చేస్తూ ఊపిరి ఆగేంతవరకు పోరాటం చేసి కమ్యూ నిస్టుల స్ఫూర్తిని, ప్రజల పట్ల అంకిత భావాన్ని ప్రపంచానికి చాటిన రోజు! ఆ యోధుడే సాల్వెడార్ అలెండీ! శత్రువు దాడిలో ధ్వంసమైన రేడియో స్టేషన్ నుండే చివరి క్షణాల్లో ఆయన చేసిన ప్రసంగం 50 సంవత్సరాల తరువాత కూడా చిలీ ప్రజలను ఉ త్తేజపరుస్తోంది. సమతా సమాజం వైపు నడిపిస్తోంది. అందేకే అలెండీ అజేయుడు.. అజరా మరుడు!

### ఏం జరిగింది?

1908లో జన్మించిన అలెండీ చిలీ దేశపు వామపక్ష సోషలిస్టు పార్టీ వ్యవస్థా పకుడు. జీవితకాల మంతా ప్రజల కోసమే పనిచేశాడు. సమతా స్వప్నాన్ని శ్వాసించాడు. ఆ దిశలోనే ప్రజలను కదిలించాడు. 1937 -45 మధ్య డిప్యూటీగా బాధ్యతలు నిర్వహిం చాడు. 1938లో ఏర్పాటైన పాపులర్ ఫ్రంట్ ప్రభుత్వంలో కొంతకాలం ఆరోగ్యమంత్రిగా సేవలందించాడు. 1945-70 మధ్యకాలం లో సెనెటర్‌గా ఎన్నికయాడు. 1970 సెప్టెంబర్‌లో దేశాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. ఒక దేశంలో ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నికలు జరిగి. ప్రజలు కమ్యూనిస్టు పార్టీని ఎన్ను కోవడం అదే మొదటిసారి! ప్రజల్లో వచ్చిన ఈ చైతన్యం అమెరికాను కలవర పరిచింది. మరోవైపు దేశాధ్యక్షుడిగా ఎన్నికైన అలెండీ తన అజెండాను అమలు చేయడంతో పాటు, క్యూబా, సోవియట్ యూనియన్, చైనా తదితర కమ్యూనిస్టు ప్రభుత్వాలతో సంబంధాలు పెట్టుకోవడం ప్రారంభించాడు. ఇది అమెరికా ను మరింత ఆందోళనకు గురిచేసింది. ప్రజా చైతన్యానికి కారణమైన ప్రజా నేతను హతమార్చడానికి కుట్రలు ప్రారంభించింది.

(మిగతా 35వ పేజీలో)



ప్రజలిచ్చిన అధికారాన్ని కాపాడుకోడానికి ప్రాణాలున్నంతవరకు పోరాడతాను....... సాల్వడార్ అలెండీ

## ఈ సంచికలో...

1. అలెండీ.... బ్రతికే ఉన్నాడు
రాజగోపాల్ శర్మ.......2

2. అధ్యయనం లేకుండా ఉర్విస్టుగా మనలేం
సీతారామ్ ఏచూరి...........4

3. అధ్యయన పద్ధతుల్ని సంస్కరించుకొందాం
మావో జెడాంగ్ ...........7

4. ప్రభుత్వ హత్యలు
ఆకార్ పటేల్ ........12

5. కలి కాలం
ఎంవిఎస్ శర్మ..........14

6. శాస్త్రీయ దృక్పథం
ఎస్ వెంకట్రావు ......17

7. ఎవరీ సావర్కర్?
సుభాష్ గటాడే..........22

8. ఉప ఎన్నికల ఫలితాలు:
బిజెపి వ్యతిరేక సంకేతాలు
ఎస్వీయార్ ......29

9. సుదూర కలగా మిగిలిన
'అనీమియా ముక్త్ భారత్'
అనూషా పాల్......32

**సంపాదకుడు :**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం :**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visitcpi(m)site at:cpim.org

# కెనడా కయ్యం

**బం**డి చక్రం మీద వాలిన ఈగ తన వల్లే చక్రం తిరుగుతున్నదని భావించినట్లు వ్యవహరించిన ప్రధాని నరేంద్ర మోడీకీ, ఆయన ప్రభుత్వానికీ కెనడాతో కయ్యం మొదలైన తరువాతైనా తత్వం బోధపడుతుందా అంటే అనుమానమే. మామూలుగా ప్రతి ఏటా జరిగే జి20 సమావేశాన్ని ఒక ప్రత్యేక ఈవెంటుగా మార్చి ఇంకేముంది చూడండి భారత దేశ 'విశ్వగురు రూపం' అంటూ డబ్బా కొట్టుకున్న కాషాయ నేతలకు కొద్ది రోజుల్లోనే కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఆయన జి7 సహచరులు తమ సామ్రాజ్యవాద 'విశ్వరూపాన్ని' చూపించారు.

అనేక సంవత్సరాలుగా కెనడా భూభాగం ఖలిస్తాన్ వేర్పాటు వాదులకు నిలయంగా ఉన్న విషయం అందరికీ తెలిసిందే. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ వేర్పాటువాద కార్యకలాపాలు పంజాబ్‌లోనూ, ఇతర దేశాల్లోనూ ముఖ్యంగా కెనడాలో మరింత పెరిగాయి. అటువంటి కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా ఉన్న హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను కెనడాలోని సుర్రే నగరంలో ఈ ఏడాది జూన్ 18న గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. ఈ హత్య వెనుక భారత ప్రభుత్వ ఏజెంట్లు ఉన్నారని కెనడా ప్రధాని స్వయంగా ఆ దేశ పార్లమెంటులో ప్రకటించడంతో అది ఒక అంతర్జాతీయ సమస్యగా మారడమే కాకుండా భారత్-కెనడాల మధ్య తగవుగా పరిణమించింది. మరోవైపు ఈ ఘటన ప్రపంచ వ్యాపితంగా సామ్రాజ్యవాదుల కుట్రలు ఎలా ఉంటాయో బహిర్గతం చేస్తోంది.

తమ దేశంలోనే తమ దేశ పౌరుని ఇంకో దేశానికి చెందిన ఏజెంట్లు హతమార్చడం అంటే తమ దేశ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమేననీ, ఇది అంతర్జాతీయ నియమనిబంధనలకు వ్యతిరేకమనీ కెనడా ప్రధాని ప్రకటించడంతోనే అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర సామ్రాజ్యవాద దేశాలు దానికి వంత పలికాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని భారత దేశం దర్యాప్తుకు సహకరించాలని అమెరికాతో సహా జి7 కూటమిలోని ముఖ్య దేశాలన్నీ దౌత్యపరమైన డిమాండ్లు ప్రారంభించాయి. కెనడా ప్రధాని చేసిన ఆరోపణే అసంబద్ధమైనదని భారత్ చేస్తున్న వాదన వినిపించుకునే వారే లేరు.

ఒక దేశ సార్వభౌమాధికారాన్ని ధిక్కరించడం జరిగిందా లేదా, అమెరికా, దాని సామ్రాజ్యవాద మిత్రులు ఇటువంటి ఉల్లంఘనలకు ఎన్ని వందలు వేల సార్లు పాల్పడి ఉంటారు అన్న విషయాలను పక్కన పెడితే ట్రూడో తన వద్ద దీనికి సంబంధించి విశ్వసనీయ సమాచారం ఉందని చెబుతున్న అంశాన్ని గురించి చర్చించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే 5 కళ్లు (ఫైవ్ ఐస్) అనే పేరుతో ఏర్పాటైన సామ్రాజ్యవాద గూఢచారి వ్యవస్థ భారత దౌత్యవేత్తలపై వేసిన నిఘా ద్వారా కెనడాకు ఈ విషయం తెలిసిందని చెబుతున్నారు. అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లకు చెందిన దాదాపు 20 గూఢచారి సంస్థలు ప్రపంచంలోని అన్ని దేశాల మీదా, అన్ని దేశాల అధినేతలు, దౌత్యవేత్తలు, రాజకీయ నాయకులు, రక్షణ ఇతర రంగ అధికారుల మీద నిఘా నేత్రం వేస్తాయి. వారి మాటలు వింటాయి, కార్యకలాపాలను పసిగడతాయి. దాని కనుగుణంగా తమ సామ్రాజ్యవాద ఆధిపత్య ఎత్తుగడలను వేస్తుంటాయి. ఈ అయిదు నేత్రాల గూఢచారి యంత్రాంగమిచ్చిన సమాచారం తమ వద్ద ఉందనీ, అందువల్ల భారత దేశం తప్పు అంగీకరించాలనీ కెనడాతోపాటు అమెరికా, బ్రిటన్ తదితర దేశాలు భారత్‌పై ఒత్తిడి తెస్తున్నాయి.

విషయం ఏమిటంటే, ఇటీవలి దశాబ్దాల్లో భారత ప్రభుత్వాలు అమెరికా సామ్రాజ్యవాదుల శిబిరంలో దేశాన్ని చేర్చి సంబరపడిపోతున్నవి. చైనాను నిలువరించే పేరుతో ఇండో పసిఫిక్‌లో తన ఆధిపత్యాన్ని నిలుపుకోడానికీ, విస్తరించడానికీ అమెరికా పన్నిన వ్యూహంలో భారత దేశం మరింత లోతుగా కూరుకు పోయే విధానాలను బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్నది. అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కూడిన చతుర్ముఖ కూటమి (క్వాడ్)లో భారత దేశం చేరింది. అమెరికా నాయకత్వంలోని యుద్ధ కూటమి నాటోకు ఆహ్వానితురాలిగా హాజరవుతోంది. ఆ విధంగా మన దేశాన్ని సామ్రాజ్యవాదుల యుద్ధ కార్యకలాపాలకు నిలయంగా మార్చడం ఎంత ప్రమాదమో కెనడా ఉదంతం తెలియజేస్తోంది.

భారత దేశం ఇన్నాళ్లూ అనుసరిస్తూ వచ్చి స్వతంత్ర విదేశాంగ విధానాన్ని విడనాడి, సామ్రాజ్యవాద శిబిరం పంచన చేరితే దేశానికీ, ప్రజల ప్రయోజనాలకూ నష్టం అని వామపక్షాలు ఏ హెచ్చరికైతే చేస్తూ వచ్చాయో అదే ఇప్పుడు నిజమవుతోంది. సామ్రాజ్యవాదులతో స్నేహం కొరివితో తలగోక్కోవడమేనని పరిణామాలు తెలియజేస్తున్నాయి. భారత ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కోవాలి. అమెరికా దృతరాష్ట్ర కౌగిలినుండి బయటపడాలి.

ఇంటర్వ్యూ

# అధ్యయనం లేకుండా మార్క్సిస్టుగా మనలేం



రచయిత సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి

**సీతారామ్ ఏచూరి**

**("మార్క్స్ ఒక చోట 'ఆర్థిక న్యాయ సూత్రాలు సామాజిక పరిస్థితులకు అతీతంగా ఉండవు' (ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనమిక్ జస్టిస్ కెన్ నెవర్ రైజ్ అబౌ ది సోషల్ కండిషన్స్) అని చెపుతారు. ఈ వాక్యమే నన్ను సీరియస్ అధ్యయనానికి పురికొల్పింది" అన్నారు కామ్రేడ్ సీతారాం ఏచూరి. ఆయన సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి. సందేహమే అధ్యయనానికి నాంది అంటున్న ఏచూరి విప్లవకారునికి అధ్యయనం ఆవశ్యకతను గురించీ, దానిని కార్యాచరణకు ఉపయోగపెట్టుకోవలసిన విధానం గురించీ రెండు దశాబ్దాల క్రితం ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. అధ్యయనం ప్రాధాన్యతను నేటి యువత తెలుసుకోవలసిన అవసరం గతం కన్నా ఎక్కువ పెరిగింది గనుక ఆ ఇంటర్వ్యూను మార్క్సిస్టు పాఠకులకుఅందిస్తున్నాం.... సంపాదకుడు)**

**కామ్రేడ్, మార్క్సిస్టుకు అధ్యయనం ఆవశ్యకత ఎంత వరకూ ఉంది?**

మార్క్సిస్టు అంటేనే అధ్యయన శీలి. అధ్యయనం లేకుండా మార్క్సిస్టు ఎన్నటికీ మనలేడు. మార్క్సిస్టుకు అధ్యయనం అనేది స్వాభావికంగా ఉంటుంది. ఉండాలి. అది కమ్యూనిస్టులో అంతర్భాగంగా ఉండాలి. లెనిన్ చెప్పినట్టు "నిర్దిష్ట పరిస్థితిని నిర్దిష్టంగా విశ్లేషించడమే మార్క్సిజం". అధ్యయనం జీవితాంతం ఉండాలి. దీన్ని గుర్తించకపోతే దిగజారిపోవడం (డీజనరేషన్).. తద్వారా పెడధోరణులు (డీవియేషన్స్)కూ గురవుతాము. తప్పుదారి పడతాము. ఈ రెండింటినీ సరిచేసు కోవాలి. మరో వైపు ప్రజలంతా ఎందుకు మార్క్సిజం వైపు ఆకర్షితులవుతున్నారు అని చూస్తే ఇప్పటి వరకు ప్రపంచంలో మార్క్సిజం ఒక్కటే శాస్త్రీయం. లెనిన్ మాటలనే చూస్తే మార్క్సిజంలో రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి విప్లవకర స్వభావం. రెండు శాస్త్రీయత. ఈ రెండింటిలో ఏ ఒక్కటి లేకున్నా మార్క్సిజమే తప్పుదోవ పడుతుంది.

**శాస్త్రీయ అధ్యయనాన్ని ఎలా నిర్వచించవచ్చు? సమగ్ర అధ్యయనం ఎలా ఉండాలి?**

అధ్యయనానికి చదవడం మౌలిక అవసరమే కానీ, చదవడంతోనే అధ్యయనం పూర్తికాదు. అధ్యయనం అనుభవాల మీద కూడా ఆధారపడుతుంది. మార్క్సిస్టుకు అనుభవాలు ఉద్యమాల ద్వారా వస్తాయి. ఉద్యమాలంటే ప్రజానీకంతో కలసి ఉండటం, పోరాడటం, చదవడం, అధ్యయనం, ఉద్యమాలలో పని చేసిన అనుభవం..ఇవన్నీ కలుపుకుంటేనే సమగ్ర అధ్యయనం అవుతుంది. పుస్తక అధ్యయనం, సామాజిక అధ్యయనం, ఉద్యమాల అధ్యయనం మూడింటి కలయికే సమగ్ర అధ్యయనం.

**ఒక సామాన్య కార్యకర్త అధ్యయనాన్ని ఎక్కడ నుంచి ప్రారంభించాలి. మీ అనుభవాల నుంచి చెప్పండి?**

ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత అనుభవాలుంటాయి. వాటిని జనరలైజ్ చేయడం కష్టం. సాధ్యం కూడా కాదు. సామాజికంగా పరిస్థితులు ఏవి, ఎలా మారుతున్నాయి? ఈ విధంగా ఎందుకు జరుగుతోంది? అనే సందేహాలు వస్తాయి. ఆ ప్రశ్న నుంచే అధ్య యనం చేయాలన్న అవసరం, ఆసక్తి మొదలవుతాయి. మార్క్స్ కూడా 'ప్రతిదాన్నీ సందేహించు' (డౌట్ ఎవ్రీథింగ్) అన్నారు. జిజ్ఞాస, ప్రశ్న అధ్యయనానికి పురిగొల్పుతుంది. ఆ సందేహం ఎక్కడ నుంచి మొదలవుతుందో అక్కడి నుంచే అధ్యయనం ప్రారంభించాలి.

నేను ఎకనమిక్స్ గ్రాడ్యుయేషన్ చదువుతున్నప్పుడు అర్థశాస్త్రంలో మార్క్సిస్టు అవగాహన మొదట పరిచయమైంది. "మార్క్స్ ఒక చోట 'ఆర్థిక న్యాయ సూత్రాలు సామాజిక పరిస్థితులకు అతీతంగా ఉండవు' (ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనమిక్ జస్టిస్ కెన్ నెవర్ రైజ్ అబౌ ది సోషల్ కండిషన్స్) అని చెపుతారు. ఈ వాక్యమే నన్ను అధ్యయనానికి పురికొల్పింది. న్యాయం అనేది సామాజిక పరిస్థితులతో సంబంధం కలిగి ఉంటుంది. నేటి ఆధునిక నాగరిక సమాజంలో న్యాయం సాధ్యమా? న్యాయ మనేది సాపేక్షమైనది.. సామాజిక పరిస్థితులు మారుతుంటాయి (జస్టిస్ ఇట్ సెల్ఫ్ ఈజ్ ఏ రిలేటివ్ టర్మ్ అండ్ సోషల్ కండిషన్స్ , దెమ్ సెల్ఫ్ ఛేంజ్).

ఎకడమిక్ స్టడీలో నుంచి ఆసక్తి మొదలవడం ఒక భాగమైతే, రెండో వైపు నుంచి మన సామాజిక పరిస్థితులు కూడా కారణమయ్యాయి. నేను స్కూలు, కాలేజీ హైదరాబాద్‌లో చదివాను. 1967-68లో నక్సలైట్లు, ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణా ఉద్యమం చూశాను. ప్రత్యేక తెలంగాణా వల్ల హైదరాబాద్ వదిలి వెళ్ళాల్సి వచ్చింది.ఆ సమయంలో ఏడాది చదువు పోయింది. వీటన్నింటికీ కారణాలు ఏమిటి? ఎందుకు జరుగుతున్నాయి ఈ ఆందోళనలు? అని వాటి నుంచి కూడా ఆలోచించాను.

మన సమాజంలో పరిణామాలను విశ్లేషిస్తూ... వచ్చే సందేహాలన్నింటికీ పరిష్కార మేమిటి? అని ఆలోచించడం అలవర్చుకున్నాను. చుట్టూ పరిస్థితులు, పరిణామాలకు కారణాలేమిటి? వాటికి పరిష్కార మేమిటి?

అని విశ్లేషించు కుంటూ నేను వామపక్షం వైపు రావటం జరిగింది. కానీ అసలు అధ్యయనం మొదలెట్టాల్సింది ఒక పుస్తకం నుంచి కాదు అనుభావాల నుంచి.

**లెఫ్ట్ వైపు చూస్తున్న తొలి దశలో మీరు చదివిన పుస్తకాలేమిటి?**

అప్పటికి ప్రోగ్రెసివ్ లిటరేచర్ బాగా ఉండేది. రాబర్ట్ ఫ్రాస్ట్ పుస్తకాలు ఉండేవి. స్పార్టకస్, అమెరికాలో కార్మికోద్యమ ఎదుగుదలపై పుస్తకాలు వచ్చేవి. అవి చదివాను. మార్క్సిస్ట్ లిటరేచర్ ముఖ్యంగా చదవడం మొదలెట్టింది ఎకనమిక్స్ గ్రాడ్యుయేట్‌గా ఉన్నప్పుడే. ఆ పరిస్థితుల్లో క్యాపిటలిజం అంటే ఏమిటి ? అసలు దాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? అని తెలుసుకోవడం కోసమే మార్క్సిస్టు సాహిత్యం వైపు మళ్ళటం జరిగింది. లెనిన్ 'రాజ్యమూ, విప్లవం' (స్టేట్ అండ్ రివల్యూషన్' నేను సీరియస్ గా చదివిన తొలి పుస్తకం. అంతకుముందూ చదివే వాళ్ళం కానీ సీరియస్ గా చదివింది, ప్రభావితం చేసింది ఇదే. అపుడే సోషలిజం కోసం మనం చేసే పోరాటం ఏ విధంగా ఉండాలన్నది అర్థమయింది.

**మార్క్సిస్టు సాహిత్యం పరిచయమయ్యాక పూర్తిస్థాయి ప్రణాళికా బద్ధంగా చదవడం ఎప్పుడు ప్రారంభమైంది?**

ఒకసారి మొదలెట్టాక ఇక అది నిరంతర కార్యక్రమంగా కొనసాగింది. గ్రాడ్యుయేషన్ కాలమంతా ఇలా చదివినా, పరిణతి వచ్చిందనుకున్న దశ మాత్రం ఢిల్లీ జె.ఎన్.యు.లో ఉన్నప్పుడే. అక్కడ రెగ్యులర్‌గా స్టడీ గ్రూప్స్ నిర్వహించుకునే వాళ్ళం. ఒక గెస్ట్ ని పిలిచి లెక్చర్ ఇప్పించుకోవడం, పుస్తకాలపై స్టడీ గ్రూప్స్ నిర్వహించు కోవడం ఆరేడుగురం స్వచ్ఛందంగా చేసేవాళ్ళం. క్యాపిటల్ మూడు సంపుటాలూ అప్పుడే అలా చదివాం... ప్రతి శనివారం సాయంత్రం. మార్క్సిస్టు క్లాసిక్స్ ని అలా చదివేశాం.

**విద్యార్థి దశ కాబట్టి... చదవడం కోసం స్టడీగ్రూపులు నిర్వహించుకునే వాళ్ళా? స్టడీ గ్రూపు కోసం చదివే వాళ్లా?**

రెండూ కాదు... చదివింది అర్థం చేసుకోవడం కోసం నిర్వహించేవాళ్లం. చదివేది ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా అర్థమయ్యేది. స్టడీ గ్రూపులో ఇలా పంచుకున్న అవగాహన నుంచి ప్రామాణిక అవగాహనకొచ్చేవాళ్ళం.

**మార్క్సిస్టు సాహిత్యం చదవడానికి ముందు ఇతర సాహిత్యం చదివే అలవాటుండేదా? లేక నేరుగా ఇవే చదివారా?**

చిన్నప్పటి నుంచీ సాహిత్యం చదివే అలవాటుండేది. దానికి ముఖ్య కారణం మాతాతగారు (అమ్మతండ్రి). ఆయన హైకోర్టు జడ్జిగా ఉండేవారు. ఇల్లే పెద్ద లైబ్రరీగా ఉండేది. ఆయన ద్వారా చిన్నప్పటి నుంచీ చదవడం అలవడింది. ఆ అలవాటు తర్వాత కాలంలో చాలా ఉపయోగపడింది. అసలు చదవడానికి ఒక మేధో క్రమశిక్షణ (ఇంటలెక్చువల్ డిసిప్లిన్) అవసరం. అది ఎంత ముఖ్యమో ఇప్పటికీ అనిపిస్తుంటుంది. అనుభవంలో తెలుస్తుంటుంది. తరచూ ప్రయాణాల వల్ల చదవడం ఈ మధ్య సరిగ్గా సాగటం లేదు. కానీ ప్రయాణాలనే చదవ డానికి ఉపయోగించుకుంటాను.

❝ రామాయణంలో దక్షిణాది రాజులను ... రాముడి మిత్రులు, భక్తులు సైతం జంతువులుగా చిత్రించడం లోని అంతరార్థం ఏమిటి? ఎందువల్ల అలా అలా చిత్రీకరించారు? అనేది నా నందేహాలలో ఒకటి. రామాయణం కథ వచ్చిన రోజుల్లో ద్రావిడులపై ఆర్యుల అధికృత కారణంగా అలా రాశారని కొన్నేళ్ళ తరువాత అర్థమయింది. అప్పటి సోషల్ రియాలిటీ ఆ కథలో అలా ప్రతిబింబించింది. వీటిని అధ్యయనం చేయడాన్ని అభివృద్ధి నిరోధకంగా చూడకూడదు. ❞

**ఆకాలంలో ఏయే పుస్తకాలు చదివారు?**

ఆ రోజుల్లో కొత్తగా వస్తున్న భారతీయ ఆంగ్ల రచయితల పుస్తకాలు చదివేవాణ్ణి. ఆర్.కె.నారాయణన్ అప్పుడే పాపులర్ అవుతున్న రచయిత. భారత పరిస్థితుల్లోని వాస్తవికతను వీరు ఎలా అర్థం చేసుకుంటు న్నారు.. అని తెలుసుకోవడానికి కూడా చదివే వాణ్ణి.

మరోవైపు మరో తాతగారి (నాన్న తండ్రి)కి మత సంబంధ పురాణేతిహాసాల పట్ల ఆసక్తి ఉండేది. ఆయన మూలంగా రామాయణ, భారత, భాగవతాలు చదివాను. వాటిల్లో నుంచి కూడా చాలా నేర్చు కున్నాను. వాటిని నిరాకరించాల్సిన అవసరం లేదు. ఆ అభూతకల్పన నుండి రియాలిటీని గ్రహించడం కోసం అనేక ప్రశ్నలు తలెత్తేవి. అడుగుతూండే వాణ్ణి కాని ఆయన చెప్పగలిగేవారు కారు.

రామాయణంలో దక్షిణాది రాజులను ... రాముడి మిత్రులు, భక్తులు సైతం జంతువులుగా చిత్రించడం లోని అంతరార్థం ఏమిటి? ఎందువల్ల అలా అలా చిత్రీకరించారు? అనేది నా నందేహాలలో ఒకటి. రామాయణం కథ వచ్చిన రోజుల్లో ద్రావిడులపై ఆర్యుల అధికృత కారణంగా అలా రాశారని కొన్నేళ్ళ తరువాత అర్థమయింది. అప్పటి సోషల్ రియాలిటీ ఆ కథలో అలా ప్రతిబింబించింది. వీటిని అధ్యయనం చేయ డాన్ని అభివృద్ధి నిరోధకంగా చూడకూడదు. వాస్తవికతను అర్థం చేసుకోవడానికి వాటిని చదవాలి.... ఒకవైపు సమకాలీన సాహిత్యం, మరో వైపు పురాణాలు, 'స్పార్టకస్' లాంటి పుస్తకాల్లోని తిరుగుబాట్లు.. ఇవన్నీ అభ్యుదయ సాహిత్యం వైపు రావడానికి దోహదపడతాయి

**అభ్యుదయ సాహిత్యాన్ని ఎంచుకునే చదివేవారా?**

అసలు చదివితే గదా ఏది అభ్యుదయ సాహిత్యమో తెలిసేది. ఇది అభ్యుదయకరం (ప్రోగ్రెసివ్) ఇది అభివృద్ధి నిరోధకం (రియాక్షనరీ) అని ఎంచుకుని చదవాలను కుంటే.. అసలు చదవడం సాగదు.

**రాజకీయ పాఠశాలకు వెళ్లక ముందూ వెళ్ళిన తరువాత.. అవగాహనా, అధ్యయన వేగంలో ఏమైనా తేడా కనిపించిందా?**

తొలి రాజకీయ పాఠశాలకు 1978లో అనుకుంటా వెళ్ళాను. జలంధర్ పార్టీ కాంగ్రెస్ తరువాత ఆ పాఠశాల జరిగింది. రాజకీయ పాఠశాలలకు వెళ్ళడం చాలా ప్రధానం. నా వ్యక్తిగత అనుభవం ఏమిటంటే, వాటికి వెళ్లడం వల్ల చదవడం క్రమానుగతమైంది. స్టడీ గ్రూపులకు వెళ్ళడంకూడా. ఏయే అంశాల కోసం ఏ పుస్తకాలు చదవాలి అనేది క్రమబద్ధమైంది. వేటిని ఎంచుకుని చదవాలనే ప్రాధాన్యతా క్రమం తెలిసింది.

**ఆసక్తితో చదివేవి, అవసరాలకోసం చదివేవి ఉంటాయి. అధ్యయనంలో వీటిని ఎలా ప్లాన్ చేసుకోవాలి?**

ఈ రెంటి మధ్య వైరుధ్యం ఉందని నేననుకోను. ఆసక్తి ఉండే వాటిలో కూడా విషయాలు, రాజకీయాలు ఉంటాయి. రిలాక్స్ కోసం డిటెక్టివ్ నవలలు కూడా చదివేవాణ్ణి. పెట్టుబడి దారులు, ఆయుధ వ్యాపారులు యుద్ధాన్ని ఎందుకు కోరుకుంటారో, వారు

> **"ఎందుకు చదువుతున్నామనే స్పృహ మనకు ఉండాలి. మన జీవితంలోని అనుభవాలకంటే మించి ఇంకా అనేక అనుభవాలున్నాయి. వాటిని మనం అనుభ వించే అవకాశం లేదు. ఆ అనుభవాల్లోంచి.. మానవ సంబంధాలు.. అనుభూతులు ఎలా వుంటాయనేది చదవడం వల్లే తెలుసుకోగలం. అవసరమైతే చదివేప్పుడు నోట్సు తీసుకోవాలి. మననం చేసుకోవడం, రాసుకోవడం చేయాలి."**

యుద్ధాల వల్ల ఎలా లాభపడతారో మొదటి సారి ఒక డిటెక్టివ్ నవల ద్వారానే తెలిసింది. కాబట్టి చదివే వాటి ద్వారా మనం ఏమి గ్రహిస్తామనే దాని పైనే ఇది అధారపడి ఉ ంటుంది తప్ప ఆసక్తి ఉన్న విషయాలను చదవకూడదని కాదు. కానీ మార్క్సిస్టు మౌలిక క్లాసిక్స్ చదవకుండా వీటి నుంచే అన్ని అర్థం చేసుకుంటామనేది, చైతన్యం పొందుతామనేది తప్పు. అలాగే క్లాసిక్స్ చదివేసి.. అంతా అర్థమయిందను కోవడమూ సరి కాదు.

**అనేక పుస్తకాలు చదువుతాము కదా! అందులోంచి విషయాలను స్వీకరించడం గుర్తుంచుకోవడం, నిక్షిప్తం చేసుకోవడం మీరు ఎలా చేస్తారు?**

ఎందుకు చదువుతున్నామనే స్పృహ మనకు ఉండాలి. మన జీవితంలోని అనుభవాలకంటే మించి ఇంకా అనేక అనుభవాలున్నాయి. వాటిని మనం అనుభ వించే అవకాశం లేదు. ఆ అనుభవాల్లోంచి.. మానవ సంబంధాలు.. అనుభూతులు ఎలా వుంటాయనేది చదవడం వల్లే తెలుసుకోగలం. అవసరమైతే చదివేప్పుడు నోట్సు తీసుకోవాలి. మననం చేసుకోవడం, రాసుకోవడం చేయాలి. నా జేబులో ఎప్పుడూ చిన్న కాగితాలుంటాయి. ముఖ్య మైన విషయాలు తెలుసుకున్నా, చదివినా.. ఏ విధంగా గ్రహించినా వెంటనే రాసుకుంటాను.

ఆత్మవిమర్శతో చెప్పాలంటే..ఈ పనిని నేను కూడా చేయాల్సినంత చేయలేక పోతున్నాను. చదివినదీ తెలుసుకున్నదీ, నేర్చుకున్నవీ సహచరులతో పంచు కోవాలి. ఇది క్రమబద్ధంగా జరగాలి. అప్పుడే ఆ జ్ఞానం ఉపయోగపడుతుంది. కొందరు చాలా చదువుతారు. బాగా జ్ఞానం సంపాదిస్తారు. కానీ అది వారికే పరిమితం చేసుకుంటారు. ఇందువల్ల ఉద్యమాలకు లాభం జరగటంలేదు. ఇందుకోసం మానసిక క్రమశిక్షణ అవసరం. అలాగే, ఎంత సాధికారత ఉన్న అంశమైనా సభలు, పాఠశాలలకు వెళ్ళేప్పుడు ప్రిపరేషన్ ఉండాలి. ప్రిపరేషన్ ఉంటే విషయం, క్రమం, పద్ధతీ బాగా ఉంటాయి. చెప్పాలనుకున్నది అవతలి వారికి చేరుతుంది.

**అంత బిజీ షెడ్యూలులో అధ్యయనానికి సమయం ఎలా కేటాయిస్తున్నారు?**

దీనికి మానసిక క్రమశిక్షణ అవసరం. ఎక్కువగా ప్రయాణాల్లో గడుపుతూంటాను. చదవడం, రాయడం కూడా ప్రయాణాల్లోనే చేస్తుంటాను. సాంకేతిక అభివృద్ధి వల్ల రాసింది పంపించడమూ సాధ్యమవు తున్నది. ప్రాథమికంగా ప్రతిరోజూ కొంత సమయం అధ్యయనానికి కేటాయించడం అవసరం. కామ్రేడ్ ఇ.ఎం.ఎస్ నుంచి ఇది నేను నేర్చుకున్నాను. ఆయన రోజు ఉదయాన్నే రెండుమూడు గంటలు చదివేవారు. ఆ సమయానికి ఆటంకం ఏర్పడితే ఆ రోజులో ఏదో ఒక సమయాన్ని అందుకోసం సర్దుబాటు చేసుకునేవారు. నేనూ ఉదయాన్నే అలా కేటాయిస్తాను. ఆటంకం ఏర్పడితే సర్దుబాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తాను...

**మొదలుపెట్టిన పుస్తకం అనేక కారణాలతో మధ్య లోనే ఆపేస్తుంటారు. ఈ సమస్య మీరు ఎలా అధిగమిస్తుంటారు?**

ఏ పుస్తకమైన చదవాలని ఉండి పూర్తి చేయలేదంటే అది వ్యక్తిగత బలహీనతే. ఆ పుస్తకం పూర్తి చేయాలంటే అది పూర్తయ్యే వరకూ మనతోనే ఉంచుకోవాలి. దానిని పూర్తి చేయాలనే తపనా, ఆసక్తి ఉంటే అది సాధ్యమవుతుంది. భారతీయ రచయితల్లో మార్క్సిస్ట్ ఫిలాసఫర్‌గా చెప్పుకునే దేవీప్రసాద్ చటోపాధ్యాయ అముద్రిత రచనలను ఇటీవలే ముద్రించారు. వాటిని చదవడం రెండు నెలల క్రితం మొదలెట్టాను. పూర్తి చేయడం కోసం నా వెంటే ఉంచుకుంటున్నాను. ఆసక్తికరంగా ఉన్న పుస్తకం చదివేప్పుడు ఆకస్మికంగా వేరే పనులేవో తగిలితే స్వల్పంగా చికాకు కలుగుతుంది. నిభాయించుకుని తక్షణావశ్య మైన పనికి దిగుతుంటాను.

**అధ్యయనంలో అప్పటికీ.. ఇప్పటికీ తేడా? ఆ రోజులే బాగున్నాయి..ఈ రోజుల్లో చదవడానికి టైమ్ ఉండటం లేదు ' అనే ఫీలింగ్ వస్తుంటుందా?**

తేడా ఉంది కానీ, అలాంటి ఫీలింగ్ కలుగదు. వాస్తవానికి ఇప్పుడు సమయం మిగులుతోంది. టెక్నాలజీ పెరగడం వల్ల ఇప్పుడు సమాచారం, వెంట వెంటనే తెలిసి పోతోంది. ఇప్పుడు టెక్నాలజీ, టీవీ ఛానల్స్ వల్ల సమాచారం కోసం ఎక్కువ సేపు ఎదురు చూడాల్సిన పని లేకుండా పోయింది. వీటి వల్ల గతం కంటే చదవడానికి ఎక్కువ సమ యం మిగులుతోంది. ఆరోజుల్లో సమాచార సేకరణకే ఎక్కువ సమయం పట్టేది.

**వేర్వేరు రంగాలు, సామాజిక వర్గాలకు సంబంధించి వస్తున్న సమకాలీన సాహిత్యం చదవాల్సిన అవసరం ఉందా?**

ఖచ్చితంగాఉంది. అలా వస్తున్న మంచి సాహిత్యంతో పాటు అంతకుమించి పనికిరా నిది కూడా వస్తున్నది. వాటిని వేరు చేసుకుని సమకాలీన సాహిత్యం చదవాల్సిందే.

**విషయాధ్యయనంలో స్పెషలైజేషన్లు సంబంధించి..?**

స్పెషలైజేషన్ అంటే మిగతావి చదవ కూడదని కాదు. జనరల్‌గా అన్ని విషయాల గురించిన ప్రాథమిక అవగాహన కోసం చదవడం, అలాగే పనిచేస్తున్న అంశంమీద స్పెషలైజేషన్ చేయడం అవసరం. ఒకే విషయం స్పెషలైజేషన్ చేసి, మిగతా వదిలేయడం సరికాదు. సమగ్రతా రాదు. స్పెషలైజేషన్ లేకుండా అన్ని విషయాలు చదవడం వల్ల కూడా ప్రయోజనం ఉండదు.

**ఇప్పటికీ మీకు ఇన్స్పిరేషన్ ఇచ్చే పుస్తకం రచయిత?**

చెప్పడం కష్టం. చాలామంది ఉన్నారు. చాలా పుస్తకాలున్నాయి. అయినా నా దృష్టిలో క్లాసిక్ మాస్టర్ పీస్ మాత్రం మార్క్స్ రాసిన 'లూయీ బోనపార్టీ ఎయిటీంత్ బ్రుమేర్'. ఆలసట పోగొట్టుకోవడం కోసం తరచూ చదువుతూండే పుస్తకం అది. అందులోని ఒక వాక్యం...మనుషులు చరిత్రను నిర్మిస్తారు కానీ, కోరుకున్న పరిస్థితుల ఆధారంగా కాదు. (మేన్ మేక్స్ హిస్టరీ బట్ నాట్ ఆన్ ద సర్కుమస్టాన్సస్ ఛూజన్ బై హిమ్!) అని ఉంటుంది.

ఇంటర్వ్యూ

# అధ్యయన పద్ధతుల్ని సంస్కరించుకొందాం

**– మావో జెడాంగ్**

***మే 1941***



*(కామ్రేడ్ మావో జెడాంగ్, యేనాన్‌లోని పార్టీ కార్యకర్తల సమావేశంలో ఈ నివేదిక ఇచ్చారు. ఈ నివేదికతోపాటు "పార్టీ పనిపద్ధతులు సరిచేసుకుందాం", "మూసపోత రచనలను వ్యతిరేకిద్దాం" అనే రచనలను కూడా ఆయన దిద్దుబాటు ఉద్యమం కోసం రాశారు. ఈ మూడు రచనల్లో ఆయన పార్టీలో గతంలో పార్టీ వైఖరిపై ఉండిన భిన్న వైఖరులను సైద్ధాంతిక స్థాయిలో చర్చించారు. పార్టీలో మార్క్సిజం–లెనినిజం పేరుతో పెటీ బూర్జువా సిద్ధాంతం ఎలా చెలామణి అయ్యేదో వెల్లడించారు. ఈ పెటీ బూర్జువా ధోరణులవల్ల పార్టీలో స్వీయమానసిక ధోరణులు, పిడివాద పోకడలు ఎలా ప్రబలంగా ఉండేవో వాటి వ్యక్తీకరణ రూపం పార్టీలో మూసపద్ధతి రచనలకు ఎలా దారితీసిందో వివరించారు. కామ్రేడ్ మావో జెడాంగ్ పార్టీలో మార్క్సిస్టు–లెనినిస్టు సైద్ధాంతిక సూత్రాల ప్రకారం పని విధానాన్ని చక్కదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన పిలుపుతో పార్టీ లోపలా, వెలుపలా కార్మికవర్గ సిద్ధాంతం, పెటీ–బూర్జువా సిద్ధాంతాల మధ్య పెద్ద చర్చకు దారితీసింది. ఇది పార్టీ లోపలా, వెలుపలా కార్మికవర్గ సిద్ధాంతిన్ని సమీకృతం చేసింది. పార్టీలోని విస్తారమైన క్యాడరు సైద్ధాంతికంగా ముందడుగు వేయడానికీ, పార్టీ అపూర్వమైన ఐక్యత సాధించడానికీ దోహదపడింది.)*

---

పార్టీ అంతటా మన అధ్యయన విధానాన్ని, పద్ధతుల్ని సంస్కరించు కోవాలని నేడు ప్రతిపాదిస్తున్నాను.

దానికి కారణాలు ఇవి :

**1**

మార్క్సిస్టు – లెనినిస్టు విశ్వజనీన సత్యాన్ని చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో ఆనాటికానాటికి సమైక్యం చేసిన చరిత్రే చైనా కమ్యూనిస్టు పార్టీ గత ఇరవయ్యేళ్ళ చరిత్ర. మన పార్టీ శైశవ దశలో మార్క్సిజం – లెనినిజం గురించి, చైనా విప్లవం గురించి మనకున్న అవగాహన ఎంత తక్కువో, ఎంత మిడి మిడి జ్ఞానమో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే, అది ఇప్పుడెంత లోలోతులకు పోతూ వృద్ధి చెందుతుందో చూడగలం. గత వంద సంవత్సరాలుగా అస్తవ్యస్తమైన చైనా దేశపు ఉత్తమోత్తమ పుత్రీపుత్రులు దేశం కోసం పోరాడుతూ తమ ప్రాణాలను త్యాగం చేశారు. ఒకరులేని లోటును మరొకరు తీరుస్తూ, వారు తమ దేశాన్ని, ప్రజల్ని రక్షించే, విముక్తి చేసే మార్గాన్ని అన్వేషించారు. ఇది మనకో సంతోషాన్ని, విషాదాన్ని కలిగిస్తుంది. కానీ మన జాతిని విముక్తి చేసుకోవడానికి అవసరమైన అత్యుత్తమ ఆయుధమూ, వాస్తవమూ అయిన మార్క్సిజం–లెనినిజాన్ని మొదటి ప్రపంచ యుద్ధానంతరం, రష్యా అక్టోబర్ విప్లవానంతరం మాత్రమే కనుగొన్నాం. ఈ ఆయుధాన్ని ప్రయోగించడంలో చైనా కమ్యూనిస్టు పార్టీ చొరవ తీసుకొంది, ప్రచారం చేసింది. నిర్మాణం చేపట్టింది. చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో జోడించబడిన తర్వాత, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం – లెనినిజం చైనా విప్లవానికి పూర్తిగా కొత్త రూపునిచ్చింది. జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధం ప్రారంభమైనప్పటి నుండే మన పార్టీ విశ్వజనీన సత్యమైన మార్క్సిజం – లెనినిజాన్ని పునాదిగా చేసుకొని యుద్ధంలో నిర్దిష్ట ఆచరణను అధ్యయనం చేయడంలోను, మరొక అడుగు ముందుకు వేసింది. చైనా చరిత్రని అధ్యయనం చేయడం కూడా ప్రారంభించింది. ఇవి అన్నీ మంచి లక్షణాలు.

**2**

అయితే ఇప్పటికీ మనలో లోటుపాట్లు వున్నాయి. వాటిలో కొన్ని చాలా పెద్దవి కూడా వున్నాయి. ఈ లోటుపాట్లను సరిదిద్దుకోకుండా మన పనిలో ముందడుగు వేయలేమని, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం – లెనినిజాన్ని చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతో సమన్వయించడమనే మన మహత్తర కర్తవ్యాన్ని నిర్వహించలేమనీ నా అభిప్రాయం.

ముందుగా ప్రస్తుత పరిస్థితులను అధ్యయనం చేయడం తీసుకొందాం. నేటి జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్ని అధ్యయనం చేయడంలో కొంత విజయాన్ని సాధించాం. కానీ మనంత పెద్ద రాజకీయ పార్టీ స్థాయికి మనం సేకరించిన సమాచారం అతి తక్కువే. అంతేకాక, రాజకీయ, సైనిక, ఆర్థిక సాంస్కృతిక అంశాలన్నింటిలోనూ మనం చేసిన పరిశోధన క్రమబద్ధమైనదిగా లేదు. సాధారణంగా చెప్పుకోవాలంటే, ఈ అంశాలపై విషయ సేకరణలోనూ, అధ్యయనంలోనూ మనం గత ఇరవై సంవత్సరాలలోనూ క్రమబద్ధంగా, క్షుణ్ణంగా పనిచేయలేదు. భౌతిక వాస్తవాన్ని పరిశోధించడానికి, అధ్యయనం చేయడానికి అవసరమైన వాతావరణం మనకు లేదు. "పిచ్చుకల్ని పట్టే గుడ్డివాడిలాగా", "చేపల్ని పట్టే గుడ్డివాడి"లాగా

**"నేను పైన పేర్కొన్న మూడు అంశాలు - నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయడం, చరిత్ర అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయడం, మార్క్సిజం-లెనినిజాన్ని అన్వయించడాన్ని నిర్లక్ష్యం చేయడం.. ఇవన్నీ మన కార్య విధానంలో పూర్తి తప్పుడు శైలినే సూచిస్తున్నాయి. దీని వ్యాప్తి వల్ల మన కామ్రేడ్స్‌లో చాలామందికి హాని జరిగింది."**

వ్యవహరించడం లేదా మొరటుగానూ, నిర్లక్ష్యంగానూ వుండటం, వాగాడంబరానికి లోను కావడం, అతి తక్కువ పరిజ్ఞానంతోనే సంతృప్తి పడటం – ఇది తప్పుడు పని విధానం, మార్క్సిజం – లెనినిజం మౌలికాంశాలకు భిన్నమైన పద్ధతి. ఆ పద్ధతి ఇప్పటికి మన పార్టీలో చాలామంది కామ్రేడ్స్‌లో వుంది. పరిస్థితుల్ని చైతన్యవంతంగా అధ్యయనం చేయాలనీ, వ్యక్తిగత ఇష్టాయిష్టాలతో కాక, భౌతిక వాస్తవికతతో ముందుకు సాగాలనీ, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు మనకు నేర్పారు. అయితే మన కామ్రేడ్స్ చాలామంది ఈ సత్యానికి పూర్తిగా భిన్నంగా నడుస్తున్నారు.

రెండవది, చరిత్ర అధ్యయనాన్ని తీసుకోండి. కొంతమంది పార్టీ సభ్యులు, సానుభూతిపరులు ఈ పనిలో ఉన్నప్పటికీ అది ఒక క్రమపద్ధతిలో జరగడం లేదు. గత వంద సంవత్సరాల చరిత్ర కానివ్వండి, పురాతన కాలం నాటి చరిత్ర కానివ్వండి, మొత్తం మీద చైనా చరిత్ర గురించి మన పార్టీ సభ్యులు చాలామంది ఇంకా అయోమయంలోనే వున్నారు. పురాతన గ్రీసును ఉదహరించకుండా మాట్లాడలేని మార్క్సిస్టు–లెనినిస్టు పండితులు చాలామంది వున్నారు. కానీ తమ పూర్వీకుల గురించి మాత్రం వారు పూర్తిగా మర్చిపోయారు. ప్రస్తుత పరిస్థితుల్ని గాని, గత చరిత్రను గాని లోతుగా అధ్యయనం చేయడానికి అనుకూలమైన వాతావరణం లేదు.

మూడవది, అంతర్జాతీయ విప్లవానుభవాన్ని, విశ్వజనీన సత్యమైన మార్క్సిజం – లెనినిజాన్ని అధ్యయనం చేయడం తీసుకోండి. చాలామంది కామ్రేడ్స్ మార్క్సిజం లెనినిజాన్ని విప్లవాచరణ కోసం గాక ఉత్త విజ్ఞాన సముపార్జన కోసం మాత్రమే అధ్యయనం చేస్తున్నట్లుంది. దాని ఫలితంగా వాళ్ళు చదివిన దాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. వాళ్ళు మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లను పాక్షికంగా ఉదహరించగలరే తప్ప, వారి దృక్పథాన్ని, పద్ధతిని ఆసరా చేసుకుని చైనా ప్రస్తుత పరిస్థితులను, చైనా చరిత్రను నిర్దిష్టంగా అధ్యయనం చేయడానికి గానీ, చైనా విప్లవ సమస్యల్ని నిర్దిష్టంగా విశ్లేషించి పరిష్కరించడానికి గాని అన్వయించలేరు. మార్క్సిజం లెనినిజం పట్ల అటువంటి ధోరణి వుండటం, ముఖ్యంగా మధ్య స్థాయి, ఉన్నత స్థాయి కార్యకర్తలకు చాలా హానికరం.

నేను పైన పేర్కొన్న మూడు అంశాలు – నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయడం, చరిత్ర అధ్యయనాన్ని నిర్లక్ష్యం చేయడం, మార్క్సిజం–లెనినిజాన్ని అన్వయించడాన్ని నిర్లక్ష్యం చేయడం.. ఇవన్నీ మన కార్య విధానంలో పూర్తి తప్పుడు శైలినే సూచిస్తున్నాయి. దీని వ్యాప్తి వల్ల మన కామ్రేడ్స్‌లో చాలామందికి హాని జరిగింది.

నిజానికి ఈ రకమైన పని విధానం వల్ల మన శ్రేణుల్లోని చాలామంది కామ్రేడ్స్ తప్పుడు తోవలోకి పోయారు. దేశం, ప్రాంతం, రాష్ట్రాలకు ఇంటా బయట నిర్దిష్ట పరిస్థితుల్ని కూలంకషంగా, క్రమబద్ధంగా పరిశోధించడానికి ఇష్టపడని వాళ్ళు తమ మిడి మిడి జ్ఞానం ఆధారంగా ఆజ్ఞలు మాత్రం జారీ చేస్తారు. "నేను అనుకుంటున్నాను కాబట్టి అది అలానే అయి వుంటుంది" అనుకునే స్వీయాత్మక పని విధానం మనలో చాలామంది కామ్రేడ్స్‌లో ఇప్పటికీ లేదూ?

మన చరిత్ర ఏమీ తెలియకపోవటం, లేదా అతి కొద్దిగా తెలియటం మూలంగా సిగ్గుపడటానికి బదులు గర్వించేవాళ్ళు కొంతమంది ఉన్నారు. వాస్తవానికి చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర, నల్లమందు యుద్ధం నుండీ వంద సంవత్సరాల చైనా చరిత్ర తెలిసినవాళ్ళు బహు కొద్దిమంది మాత్రమే. గత వంద సంవత్సరాల ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంస్కృతిక చరిత్రని అధ్యయనం చేయడాన్ని ఎవరూ తీవ్రంగా పట్టించుకోలేదు. తమ దేశం గురించి ఏమీ తెలియని వాళ్ళు విదేశాల పురాతన కథల్ని మాత్రం వల్లె వేస్తారు. కనీసం ఈ విజ్ఞానం అయినా సమగ్రంగా వుండదు. అది కూడా పాత విదేశీ పుస్తకాల నుండి సంగ్రహించిన మిడి మిడి జ్ఞానమే.

విదేశాల నుండి తిరిగి వచ్చిన విద్యార్థులు ఈ జబ్బుతో ఎన్నో దశాబ్దాలుగా బాధపడ్డారు. ఐరోపా, అమెరికా, జపానుల నుండి స్వదేశానికి తిరిగి వచ్చిన వాళ్ళు విదేశీ చిలక పలుకులు మాత్రమే పలుకుతారు. వాళ్ళు పాడిందే పాడే గ్రామ్‌ఫోనులుగా మారిపోతారు. కొత్త విషయాలను సృష్టించడం, తెలుసుకోవడం అనే బాధ్యతలను మర్చిపోతారు. ఈ జబ్బు కమ్యూనిస్టు పార్టీలో కూడా ప్రవేశించింది.

మనం మార్క్సిజాన్ని అధ్యయనం చేస్తున్నప్పటికీ, మనవాళ్ళు చాలామంది అనుసరిస్తున్న అధ్యయన పద్ధతి మార్క్సిజానికి పూర్తిగా విరుద్ధమైనది. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు మనకు అందించిన సిద్ధాంతం, ఆదరణల మధ్య ఐక్యత అనే ప్రాథమిక సూత్రాన్ని వాళ్ళు జవదాటుతున్నారు. ఈ సూత్రాన్ని జవదాటుతూ, దీనికి పూర్తిగా వ్యతిరేకమైన సిద్ధాంతాన్ని, ఆచరణ నుండి విడదీసే స్వంత సూత్రాన్ని వాళ్ళు రూపొందించుకుంటున్నారు. పాఠశాలల్లోను, ఆచరణలో వున్న కార్యకర్తలకు, తత్వశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు చైనా విప్లవ గతి తర్కాన్ని అధ్యయనం చేయడంలో విద్యార్థులకు సలహా ఇవ్వడం లేదు. అర్థశాస్త్రం చెప్పే ఉపాధ్యాయులు చైనా ఆర్థిక వ్యవస్థ విశిష్ట లక్షణాలను అధ్యయనం చేయడంలో వారికి సలహా ఇవ్వడం లేదు. రాజనీతి శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు వారికి చైనా విప్లవ ఎత్తుగడల్ని అధ్యయనం చేయడానికి అవసరమైన సలహాలివ్వడం లేదు. సైనిక శాస్త్రం చెప్పే అధ్యాపకులు చైనా ప్రత్యేక లక్షణాలకు అన్వయించి వ్యూహాలు, ఎత్తుగడల గురించి అధ్యయనం చేయడంలో సలహాలివ్వడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో, తత్ఫలితంగా వ్యాపిస్తున్న తప్పుడు అభిప్రాయాలు ప్రజలకు బాగా హాని కలిగిస్తున్నాయి. యువాన్‌లో తాను నేర్చుకున్న దానిని పూషన్‌లో[1] ఎలా అన్వయించాలో తెలియని వాళ్ళున్నారు. ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్లు సరిహద్దు ప్రాంత ద్రవ్యానికి, కొమింటాంగ్ ద్రవ్యానికి[2] మధ్య గల సంబంధాన్ని వివరించలేరు. కాబట్టి విద్యార్థులు కూడా దాన్ని వివరించలేకపోవటం సహజమే. ఈ విధంగా చాలామంది విద్యార్థు

లలో వికృత మనస్తత్వం సృష్టించబడింది. చైనా సమస్యల పట్ల శ్రద్ధ చూపడానికి, పార్టీ ఆదేశాలను చిత్తశుద్ధితో అమలు చేయడానికి బదులుగా వాళ్ళు తమ అధ్యాపకుల దగ్గర నేర్చుకున్న పిడిసూత్రాలే శాశ్వతమైనవనీ, మార్చాల్సిన అవసరం లేనివని భావించి, వాటిని ఒంటపట్టించుకుంటారు.

అయితే, ఇప్పుడు నేను చేసిన ప్రస్తావన అంతా మన పార్టీలోని అతి చెడ్డవారిని గురించి, అంతా ఇలా వున్నారని నేననడం లేదు. కానీ ఇలాంటి వాళ్ళు కూడా ఇంకా వున్నారు. అంతకంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే, వాళ్ళు కొద్దిమందే వున్నా, వాళ్ళ మూలంగా కలిగే హాని మాత్రం చాలా ఎక్కువే. ఈ విషయాన్ని తేలికగా భావించకూడదు.

❝ మార్క్స్ చెప్పినట్లుగా వివరంగా సమాచారాన్నంతటినీ రాబట్టి, దాన్ని శాస్త్రీయ విశ్లేషణకు గురిచేయాలి. మనవాళ్ళు చాలా మంది ఇలా చేయకపోగా, సరిగ్గా దీనికి భిన్నంగా ప్రవర్తిస్తారు. వాళ్ళు చాలామంది పరిశోధనలు జరుపుతున్నారు. కానీ ఈనాటి చైనా గురించిగాని, గతకాలపు చైనా గురించి గాని అధ్యయనం చేయాలన్న కుతూహలం వాళ్ళకు లేదు. వాస్తవంతో సంబంధం లేని, పనికిరాని 'సిద్ధాంతాల' అధ్యయనం పట్ల మాత్రం ఎక్కువ ఆసక్తి చూపుతారు. ❞

**3**

ఈ భావాన్ని మరింత వివరించడం కోసం రెండు భిన్న దృక్పథాలను పోల్చుతాను.

మొదటి స్వీయాత్మక ధోరణి.

ఈ ధోరణిలో వున్నవాడు పరిసరాలను క్రమబద్ధంగాను, క్షుణ్ణంగాను అధ్యయనం చేయలేడు. అతను స్వీయాత్మకమైన ఉత్తేజంతో పనిచేస్తాడు. ఈనాటి చైనా స్వరూపాన్ని అస్పష్టంగా మాత్రమే చూడగల్గుతాడు. ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి చరిత్రను సమగ్రంగా అవగాహన చేసుకోలేడు. అతనికి ప్రాచీన గ్రీకు దేశం గురించి తెలుసు గాని చైనా గురించి తెలీదు. అతను నిన్న మొన్నటి చైనా గురించి అయోమయంగా వుంటాడు. ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతాన్ని అవాస్తవికంగా, లక్ష్యం లేకుండా అధ్యయనం చేస్తాడు. చైనా విప్లవంలోని సైద్ధాంతిక సమస్యల్ని, ఎత్తుగడలకు సంబంధించిన సమస్యల్ని పరిష్కరించేందుకు అవసరమైన దృక్పథాన్ని, పద్ధతిని తెలుసుకోవడం కోసం కాక కేవలం సిద్ధాంత పరిజ్ఞానం కోసమే సిద్ధాంతం అన్న ధోరణిలోనే మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లను అధ్యయనం చేస్తాడు. అతను లక్ష్యానికి గురిచూసి బాణం వేయడానికి బదులు తన ఇష్టం వచ్చినట్లు బాణాలు వదులుతాడు. మనం భౌతిక వాస్తవాల మీద ఆధారపడాలని, ఆచరణలో మార్గదర్శకంగా ఉపయోగపడే సూత్రాలను వాటి నుండి గ్రహించాలని మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌లు మనకు ప్రబోధించారు. దానికోసం మనం మార్క్స్ చెప్పినట్లుగా వివరంగా సమాచారాన్నంతటినీ రాబట్టి, దాన్ని శాస్త్రీయ విశ్లేషణకు గురిచేయాలి. మనవాళ్ళు చాలా



కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్

మంది ఇలా చేయకపోగా, సరిగ్గా దీనికి భిన్నంగా ప్రవర్తిస్తారు. వాళ్ళు చాలామంది పరిశోధనలు జరుపుతున్నారు. కానీ ఈనాటి చైనా గురించిగాని, గతకాలపు చైనా గురించి గాని అధ్యయనం చేయాలన్న కుతూహలం వాళ్ళకు లేదు. వాస్తవంతో సంబంధం లేని, పనికిరాని 'సిద్ధాంతాల' అధ్యయనం పట్ల మాత్రం ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఇంకా చాలామంది ఆచరణ చేపడుతున్నారు. కానీ వాళ్ళు కూడా భౌతిక పరిస్థితుల అధ్యయనం పట్ల ఏమాత్రం శ్రద్ధ చూపరు. ఉత్త ఉత్సాహం మీద ఆధారపడి, సిద్ధాంతాలకి బదులు వాళ్ళ వాళ్ళ వ్యక్తిగత అనుభూతుల్ని ఏర్పరచుకొంటారు. ఈ రెండు రకాలకు చెందినవాళ్ళు కూడా స్వీయాత్మకత మీద ఆధారపడి భౌతిక వాస్తవాల అస్థిత్వాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు.

> **“ శాస్త్రీయ దృక్పథం కలిగిన వ్యక్తి మార్క్సిజం - లెనినిజాన్ని ఒక లక్ష్యంతో అధ్యయనం చేస్తాడు. అంటే, అతను మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతాన్ని చైనా వాస్తవ విప్లవోద్యమంతో సమన్వయ పరుస్తాడు. చైనా విప్లవం ఎదుర్కొంటున్న సైద్ధాంతిక సమస్యల్ని, ఎత్తుగడలకు సంబంధించిన సమస్యల్ని ఈ సిద్ధాంత వెలుగులో పరిష్కరించబూను కుంటాడు. ఇది లక్ష్యాన్ని గురిచూసి బాణం వేసే దృక్పథం. చైనా విప్లవం 'లక్ష్యం' అయితే, మార్క్సిజం - లెనినిజం 'బాణం' అవుతుంది. ”**

వాళ్ళు ఉపన్యాసాలు ఇచ్చేటప్పుడు అ ఆ ఇ ఈ 1, 2, 3, 4 అంటూ వివిధ హెడ్డింగుల కింద అంశాలు చెప్పుకుంటూ పోతారు. వ్యాసాలు రాసేటప్పుడు అతిశయోక్తులు వాడతారు. వాస్తవాల నుండి నిజం గ్రహించాలనే ఉద్దేశ్యం వారికి లేదు. ఏదో విధంగా నమ్మకం కలిగించి ఇతరుల చేత మంచి అనిపించుకోవాలనుకుంటారు. వారు సరుకు లేకుండా పైపై మెరుగులు ప్రదర్శిస్తారు. ఏమాత్రం గట్టితనం లేని ఓటితనానికి పోతారు. తాము ఎప్పుడూ ఒప్పులే చేస్తామని ఈ భూమిపై తమదే మొదటి శ్రేణి అధికారం అనుకుంటూ "రాచరికపు రాయబారుల"లాగా ప్రతి చోటకి పరుగెడుతుంటారు. మన శ్రేణుల్లోని కొంతమంది కామ్రేడ్‌ల పని విధానం ఇలా వుంది. ఈ రకమైన నడవడిక, ప్రవర్తనల ద్వారా తనకి తాను హాని కలిగించుకుంటాడు. ఇతరులకు దీనిని బోధించడం వల్ల వాళ్ళకి కూడా హాని కలుగుతుంది. విప్లవాన్ని నడప టంలో దాన్ని ఉపయోగించడం వల్ల విప్లవానికి హానిచేస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే శాస్త్రీయ విజ్ఞానానికి, మార్క్సిజం - లెనిని జానికి విరుద్ధమైన ఈ స్వీయాత్మక ధోరణి కమ్యూనిస్టు పార్టీకి, శ్రామిక వర్గానికి, ప్రజలకి, దేశానికి ప్రబల శత్రువు. పార్టీలోని చెడు అంతా ఈ రూపం ధరిస్తుంది. మనముందున్న శక్తివంత మైన శత్రువుపైన చావు దెబ్బ తీయాలి. స్వీయాత్మక ధోరణిని నాశనం చేయగలిగితేనే మార్క్సిజం - లెనినిజం అనే సత్యం వర్ధిల్లు తుంది. పార్టీ శక్తివంత మవుతుంది. విప్లవం విజయవంతమవు తుంది. శాస్త్రీయ దృక్పథం లేకపోవడం అంటే సిద్ధాంతాన్ని, ఆచరణను మేళవించాలనే మార్క్సిస్టు - లెనినిస్టు ధోరణి లేకపోవడం, అంటే పార్టీలో పనిచేసే ఉత్తేజం లేదనీ, ఉన్నా తక్కువగా వుందని మనం భావించాలి.

ఈ రకమైన వాళ్ళని వర్ణించడానికి ఒక గేయం వుంది. అది :

"గోడ మీద పిచ్చి మొక్క
దాని తలబరువు, కాడ సన్నం, వేరు శూన్యం
కొండల్లో వెదురు మొలక
దాని నాలుక బహు పదును, చర్మం దళసరి లోన బోలు"

శాస్త్రీయ దృక్పథంలేని వాళ్ళని మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల రచనల్లోంచి వాక్యా లను అదే పనిగా ఉటంకించడం మాత్రమే చేయగలవాళ్ళని, వాస్తవ పరిజ్ఞానం లేక పోయినా అవసరమైన ప్రతిష్టని పొందే వాళ్ళని, ఈ గేయం చక్కగా వర్ణించదూ? తనలో వున్న ఈ లోపాన్ని సవరించుకోవాలని ఎవరైనా నిజంగా భావిస్తుంటే వాళ్ళు ఈ గేయాన్ని బాగా మనసుకు పట్టించుకోవాలి, లేదా మరింత ధైర్యం చూపి దాన్ని తన గది గోడకి అంటించు కోవాలని నా సలహా. మార్క్సిజం - లెనినిజం ఒక శాస్త్రం. శాస్త్రం అంటే నిజాయితీతో కూడు కున్న నిర్దిష్టమైన విజ్ఞానం. దాంతో ఇష్టం వచ్చినట్లుగా నాటకాలాడటానికి వీలులేదు. కాబట్టి ఈ విషయంలో మనం చిత్తశుద్ధి చూపాలి.

రెండవది, మార్క్సిస్టు - లెనినిస్టు దృక్పథం.

ఈ దృక్పథాన్ని కలిగిన వ్యక్తి మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతాన్ని పద్ధతిని చుట్టూ వున్న పరిస్థితుల అధ్యయనానికి, క్రమబద్ధమైన క్షుణ్ణమైన పరిశోధనకు అన్వయిస్తాడు. అతను ఉత్త ఉత్సాహంతో మాత్రమే పనిచేయడు. స్టాలిన్ చెప్పినట్లు, అతడు విప్లవ ఊపుని ఆచరణతో మిళితం చేస్తాడు.[4] ఈ దృక్పథం కలిగిన వ్యక్తి చరిత్ర అసమగ్రంగా చదవడు. పురాతన గ్రీకు దేశం గురించి తెలుసుకోవడం చాలదు. అతను చైనా గురించి తప్పక తెలుసు కోవాలి. విదేశాల విప్లవాల చరిత్రే గాక చైనా విప్లవ చరిత్ర కూడా తెలుసుకోవాలి. ఈనాటి చైనా గురించే కాక నిన్న మొన్నటి చైనా గురించి కూడా తెలుసుకోవాలి. ఈ దృక్పథం కలిగిన వ్యక్తి మార్క్సిజం - లెనినిజాన్ని ఒక లక్ష్యంతో అధ్యయనం చేస్తాడు. అంటే, అతను మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతాన్ని చైనా వాస్తవ విప్లవోద్యమంతో సమన్వయ పరుస్తాడు. చైనా విప్లవం ఎదుర్కొంటున్న సైద్ధాంతిక సమస్యల్ని, ఎత్తుగడలకు సంబంధించిన సమస్యల్ని ఈ సిద్ధాంత వెలుగులో పరిష్కరించబూను కుంటాడు. ఇది లక్ష్యాన్ని గురిచూసి బాణం వేసే దృక్పథం. చైనా విప్లవం 'లక్ష్యం' అయితే, మార్క్సిజం - లెనినిజం 'బాణం' అవుతుంది. చైనా విప్లవం, తూర్పు విప్లవాలు అనే లక్ష్యా లను గురిచూసి కొట్టడం కోసం చైనా కమ్యూ నిస్టులు ఈ బాణాన్ని చేపట్టారు. ఈ రకమైన దృక్పథాన్ని అవలంబించడం వల్ల వాస్తవాల నుండి సత్యాన్ని గ్రహించగల్గుతాం. భౌతికంగా వున్న అన్ని వస్తువులు "వాస్తవాలే". వాటి అంతర్గత సంబంధాలను నిర్దేశించే సూత్రాలే "సత్యం". ఈ సత్యాన్ని "గ్రహించడం" అంటే అధ్యయనం చేయడం. మనం దేశం, గ్రామం, జిల్లాల్లోనూ, వాటి బయటా ఉన్న వాస్తవ పరిస్థితుల అధ్యయనంతో మొదలుపెట్టి, ఊహాజనిత సూత్రాలను విడనాడి, ఈ వాస్తవ పరిస్థితుల్లో అంతర్గతంగా వుండే సూత్రాలను మన ఆచరణకు మార్గదర్శకంగా గ్రహించాలి. అంటే మన చుట్టూ జరుగుతున్న సంఘటనల లోని ఆంతరంగిక సంబంధాలన్నీ కనుక్కో గలగాలి. ఈ విధంగా చెయ్యాలంటే మనం స్వీయాత్మక ఊహల మీద గాని, తాత్కాలికమైన ఉత్సాహం మీద గాని, జీవంలేని పుస్తకాల మీద గాని ఆధారపడకూడదు. భౌతిక వాస్త వాల మీదనే ఆధారపడాలి. వివరాల్ని విపులం గా సేకరించాలి. మార్క్సిజం - లెనినిజం సాధారణ సూత్రాల వెలుగులో ఆ వివరాల నుండి సరియైన అంతిమ నిర్ణయాలకు రాగలగాలి. ఈ నిర్ణయాలు అతిశయోక్తులు కావు. ఉత్త అంకెల పట్టీలూ కావు. ఇవి శాస్త్రీయమైన నిర్ణయాలు. ఇది వాస్తవాల నుండి సత్యాన్ని గ్రహించే దృక్పథం. అంతేగానీ, ఏదో విధంగా ఇతరుల చేత మంచి అనిపించు కునే దృక్పథం కాదు. ఇది పార్టీ ఉత్తేజం యొక్క వ్యక్తీకరణ. ఇది సిద్ధాంతాన్ని ఆచరణతో సమన్వయపరిచే మార్క్సిస్టు - లెనినిస్టు వైఖరి. ఇది ప్రతి కమ్యూనిస్టు సభ్యుడు కనీసంగానైనా

కలిగి వుండాల్సిన దృక్పథం. ఈ దృక్పథాన్ని చేపట్టేవారు "తల బరువు, కాడ సన్నం, వేరు శూన్యం"గానూ ఉందరు, "పదును నాలిక, దళసరి చర్మం, లోన బోలు"గానూ వుందరు.

**"గత వందేళ్ల చరిత్రకు సంబంధించినంత వరకు మనం అర్హులైన వ్యక్తులందరినీ సమావేశపరచాలి. వాళ్ళు పని విభజన చేసుకుని పరస్పరం సహకరించు కుంటూ దాన్ని అధ్యయనం చేయాలి. ఇలా చేయడం ద్వారా మాత్రమే ప్రస్తుతం వున్న అస్తవ్యస్థ పరిస్థితి నుండి బయట పడగలం. ముందుగా ఆర్థిక చరిత్ర, రాజకీయ చరిత్ర, సైనిక చరిత్ర, సాంస్కృతిక చరిత్ర వంటి వివిధ రంగాలలో విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే సమన్వయ పూరితమైన అధ్యయనం సాధ్యపడుతుంది."**

**4**

పైన వివరించిన అభిప్రాయాలకు అనుగుణంగా నేను ఈ సూత్రీకరణలు చేయదల్చుకున్నాను.

1. మన చుట్టూ వున్న పరిస్థితుల్ని క్రమబద్ధంగానూ, క్షుణ్ణంగానూ అధ్యయనం చేయాల్సిన కర్తవ్యాన్ని మనం పార్టీ ముందు వుంచాలి. మార్క్సిస్టు – లెనినిస్టు సిద్ధాంతం, పద్ధతుల పునాది మీద మన శత్రువుల, మిత్రుల, మన ఆర్థిక, ద్రవ్య సంబంధ, రాజకీయ, సైనిక, సాంస్కృతిక, పార్టీ సంబంధ మైన కార్యకలాపాల్ని వివరంగా పరిశీలించాలి. వాటిలోని మార్పుల్ని అధ్యయనం చేయాలి. అపుడు వాటిలో నుండి సరియైన, అవసరమైన నిర్ణయాలకు రాగలగాలి. ఈ లక్ష్యంతోటి, ఈ అంశాల మీద పరిశోధన, అధ్యయనం చేయ దంపై మన కామ్రేడ్స్ దృష్టిని కేంద్రీకరించాలి. పరిస్థితులు తెలుసుకోవటం, సిద్ధాంతం మీద పట్టు సంపాదించడం అనేవి రెండూ కమ్యూనిస్టు పార్టీలో అగ్రగామి స్థాయిలో వున్న సంస్థల ప్రాథమిక కర్తవ్యాలనే విషయాన్ని మన కామ్రేడ్స్ అర్థం చేసుకొనేటట్లు చేయాలి. పరిస్థితులు తెలుసుకోవడం అంటే ప్రపంచాన్ని తెలుసుకోవటం, సిద్ధాంతం మీద పట్టు సంపాదించడం అంటే ప్రపంచాన్ని మార్చడం అనీ అర్థం. పరిశోధన జరపని వాళ్ళకు మాట్లాడే హక్కు లేదని మన కామ్రేడ్స్ అర్థం చేసుకునేలా చేయాలి. వాగాడంబరం, దృగ్గోచర విషయాలను కేవలం 1, 2, 3, 4 అంటూ వరుస క్రమంలో పెట్టడం చాలదని వారికి తెలియజేయాలి. ఉదాహరణకి ప్రచార కార్యక్రమాన్ని తీసుకోండి. మన శత్రువులు, మిత్రులు మనం సాగిస్తున్న ప్రచార కార్యక్రమం గురించిన పరిస్థితి మనకు తెలియకుండా మనం సరియైన ప్రచార సూత్రాలను రూపొందించలేం. ఏ విభాగానికి సంబంధించిన విషయంలోనైనా వాస్తవ పరిస్థితిని ముందు తెలుసుకోవాలి. అప్పుడు మాత్రమే సక్రమంగా పనిచేయగలం. పరిశోధనకు, అధ్యయనానికి అవసరమైన ప్రణాళికను పార్టీ అంతటా రూపొందించుకోవడం అనేది పార్టీ పని విధానంలో మార్పు తీసుకురావడానికి మౌలికమైన లంకెగా ఉపయోగపడుతుంది.

2. గత వంద సంవత్సరాల చైనా చరిత్రకు సంబంధించినంత వరకు మనం అర్హులైన వ్యక్తులందరినీ సమావేశపరచాలి. వాళ్ళు పని విభజన చేసుకుని పరస్పరం సహకరించు కుంటూ దాన్ని అధ్యయనం చేయాలి. ఇలా చేయడం ద్వారా మాత్రమే ప్రస్తుతం వున్న అస్తవ్యస్థ పరిస్థితి నుండి బయట పడగలం. ముందుగా ఆర్థిక చరిత్ర, రాజకీయ చరిత్ర, సైనిక చరిత్ర, సాంస్కృతిక చరిత్ర వంటి వివిధ రంగాలలో విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే సమన్వయ పూరితమైన అధ్యయనం సాధ్యపడుతుంది.

3. ఆచరణలో నిమగ్నులైన కార్యకర్తలకు, లేదా కార్యకర్తల కోసం నిర్వహించే పాఠశాలల్లోను విద్యకు సంబంధించి పార్టీ ఈ క్రింది సూత్రీకరణను ఏర్పాటు చేసుకోవాలి. అదేమంటే చైనా విప్లవంలోని ఆచరణకు సంబంధించిన సమస్యలను మార్క్సిజం – లెనినిజం వెలుగులో అధ్యయనం చేయడానికి ఉపయోగపడే విద్యను అందించాలి. మార్క్సిజం – లెనినిజాన్ని ఒక జడపదార్థంగా, ఒంటరి ధోరణిగా అధ్యయనం చేసే పద్ధతిని విడనాడాలి. అంతేగాక మార్క్సిజం – లెనినిజాన్ని అధ్యయనం చేయడానికి "సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ చరిత్ర (బోల్షివిక్) సంక్షిప్త పాఠం"ను ప్రధానమైన పాఠ్యాంశంగా తీసుకోవాలి. అది అన్నిటికన్నా మెరుగైన సమన్వయం. అది గత వంద సంవత్సరాల ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ సారాంశం. సిద్ధాంతాన్ని ఆచరణతో సమైక్యం చేయడంలో ప్రపంచంలో ఇంత వరకు ఎన్నడూ లేని సమగ్రమైన నమూనా, లెనిన్, స్టాలిన్‌లు మార్క్సిస్టు విశ్వజనీన సత్యాన్ని రష్యా విప్లవ నిర్దిష్ట ఆచరణతో ఎలా సమన్వయం చేశారో, అలా చేయడం ద్వారా మార్క్సిజాన్ని మరింతగా ఎలా అభివృద్ధి చేయగలిగారో చూడటం ద్వారా మనం చైనాలో ఎలా పని చేయాలో తెలుసుకోగలుగుతాం.

ఇప్పటికే ఆ విషయాలను పదే పదే చెప్పుకున్నాం. కానీ సాధారణంగా తప్పులు చేయకుండా సత్యాన్ని గ్రహించడం సాధ్యం కాదు. మనం మన అధ్యయన పద్ధతుల్ని సంస్కరించుకోవడం వల్ల సజీవమైన, సుసంపన్నమైన చైనా, ప్రపంచ విప్లవాలకు సంబంధించి సత్ఫలితాలను పొందగలమని నేను గాఢంగా నమ్ముతున్నాను.

**వివరణలు**

1. ఫూషెన్ కౌంటీ యేనాన్‌కు దక్షిణాన దాదాపు డెబ్భై కిలోమీటర్ల దూరంలో వుంటుంది.

2. షెన్సీ – కాన్సూ – నింగ్‌సియా సరిహద్దు ప్రాంత ప్రభుత్వ బ్యాంకు విడుదల చేసిన ద్రవ్యం సరిహద్దు ప్రాంత ద్రవ్యంగా చెలామణీ అయేది. బ్రిటన్, అమెరికా సామ్రాజ్యవాదుల మద్దతుతో 1935 నుండి నాలుగు పెద్ద కొమింటాంగ్ నిరంకుశ – పెట్టుబడి బ్యాంకులు విడుదల చేసిన కాగితం ద్రవ్యం కొమింటాంగ్ ద్రవ్యంగా చెలామణీ అయేది. ఈ రెండు రకాల ద్రవ్యాలకు మధ్య మారకం విలువల్లో వచ్చే ఎగుడు దిగుడులను కామ్రేడ్ మావో ప్రస్తావించారు.

3. ''పెట్టుబడి''కి ''రెండవ జర్మన్ ముద్రణకు ముందుమాట''లో కార్ల్ మార్క్స్ రాసిన మాటలు చూడండి : "పరిశీలన పద్ధతిలో విషయ సేకరణ సునిశితంగా జరగాలి. దాని వివిధ అభివృద్ధి రూపాలను విశ్లేషించాలి, వాటి ఆంతరంగిక సంబంధాల్ని శోధించాలి. ఈ పని జరిగాకనే వాస్తవ ఉద్యమాన్ని సరిపడినంతగా వర్ణించవచ్చు." ('పెట్టుబడి' ఆంగ్ల ప్రతి, మొదటి సంపుటి, పేజి 19)

4. స్టాలిన్ రాసిన "లెనినిజం పునాదులు" చూడండి. "లెనినిజం సమస్యలు" రష్యన్ ప్రతి, 1952, పేజి 80)

❋

మానవ హక్కులు

# ప్రభుత్వ హత్యలు

**ఆకార్ పటేల్**



రచయిత ప్రముఖ జర్నలిస్టు, భారత దేశంలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ బోర్డు ఛైర్మన్. 'మన హిందూ రాష్ట్ర', ' మోడీ పాలన మూల్యం' అనే పుస్తకాలు రాశారు.

భారత దేశంలో చట్టం, న్యాయంతో పని లేకుండా హత్యలు చేయడం సాధారణమై పోయింది. వాటి పేరే ఎన్‌కౌంటర్లు. ప్రతి సారీ కాకపోయినా చాలా సార్లు కస్టడీలో ఉన్న ముద్దాయిలను ప్రభుత్వం చేస్తున్న హత్యలే ఈ ఎన్‌కౌంటర్లు. ముద్దాయి తనకు రక్షణ కల్పించాలని సుప్రీం కోర్టుకు వెళ్లినా కూడా అతన్ని నిర్దాక్షిణ్యంగా ఎన్‌కౌంటర్ చేసేస్తున్నారు. విచిత్రమేమంటే, ముద్దాయిని ఒక చోటి నుండి మరో చోటికి తరలించేటప్పుడు ఎన్‌కౌంటర్ చేసే అవకాశం ఉందని భావించి ఆ ప్రయాణాన్ని వీడియో తీయాలని కోర్టులు కోరినప్పటికీ అతను ఎన్‌కౌంటర్ అయిపోతున్నాడు.

దీని వెనుక ఒక సిద్ధాంతం ఉంది. న్యాయ వ్యవస్థ పనిచేయడం లేదు కనుక ముద్దాయికి శిక్ష పడేవరకు ఆగలేము. ప్రపంచంలో మంచి వారు, చెడ్డ వారు ఉంటారు. ఈ చెడ్డవారిని శిక్షించడం కోసం కోర్టులు శిక్షలు వేసే వరకు ఆగనక్కర లేదు. కోర్టులు, చట్టాలతో పని లేకుండా వారిని కాల్చి పారేయాలి...ఇదీ ఈ సిద్ధాంతం.

2013 ఆగస్టు 27న నాటి లోక్‌సభ సభ్యుడు గురుదాస్ దాస్‌గుప్త పార్లమెంటులో హోమ్ మంత్రికి కొన్ని ప్రశ్నలు వేశారు. వాటిలో ఒకటి, మణిపూర్‌లో జరిగిన ఏడు హత్యల్లో ఆరు బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపేసినవేనని సుప్రీం కోర్టు నియమించిన జస్టిస్ ఎన్. సంతోష్ హెగ్డే కమిషన్ వెల్లడించిన విషయం కేంద్ర ప్రభుత్వానికి తెలుసా? రెండోది, మణిపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లన్నిటిపైనా దర్యాప్తు జరపాలని మానవ హక్కుల సంఘం డిమాండు చేసిందా?

హెగ్డే కమిషన్ వెల్లడించిన విషయాలు ప్రభుత్వానికి తెలుసు, కానీ జాతీయ మానవ హక్కుల సంఘం ఈ విషయాలపై 'ఎటువంటి దర్యాప్తును కోరలేదు' అందువల్ల ప్రభుత్వం దీనిపై ఏమీ చేయకుండా మిన్నకుంది అని ప్రభుత్వం తరఫున జవాబు చెప్పారు.

ఈ కమిషన్ ఏమిటి, అది ఏమి చేసింది అన్న విషయాలు తెలుసుకోవడం అవసరం. 2012 నవంబర్ 24న సుప్రీం కోర్టు ముగ్గురు సభ్యులతో ఒక కమిషన్‌ను నియమించింది. ఇందులో మాజీ న్యాయమూర్తి హెగ్డేతోపాటు మాజీ ఎన్నికల ప్రధానాధికారి జెఎం లింగ్డో, కర్నాటక మాజీ డిజిపి అజయ్ కుమార్ సింగ్ ఉన్నారు. 1979, 2012 మధ్య మణిపూర్‌లో ఎన్‌కౌంటర్లలో చంపేసిన 1,528 మంది హత్యలపై దర్యాప్తు జరపాలని వారిని నిర్దేశించారు. మణిపూర్ పోలీసులు, భద్రతా దళాలు ఈ ఎన్‌కౌంటర్లకు పాల్పడ్డాయి. చాట్టాన్ని ఉల్లంఘించి చేసిన హత్యలకు గురైన బాధితుల కుటుంబాట అసోసియేషన్ (ఇఇబిఎఫ్ఎఎం) సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్ వల్ల ఈ అంశం బయటకు వచ్చింది.

కమిషన్ మొత్తం 1,528 హత్యల్లో మొదటి ఆరు హత్యల ఘటనలను పరిశీలించింది. దర్యాప్తులో 2013 నాటికి ఇవన్నీ బూటకు ఎన్‌కౌంటర్లని తేలిపోయింది. హంతకులను సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ) రక్షిస్తున్నందువల్ల ఈ ఎన్‌కౌంటర్ హత్యలు చోటు చేసుకున్నాయి. అయితే ఎన్‌కౌంటర్లు ఈశాన్య రాష్ట్రాల్లోనూ, కాశ్మీలోనూ మాత్రమే జరగలేదు. 'ఎన్‌కౌంటర్లు' చేయడానికి


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

రాజ్యానికి ఎఎఫ్ఎస్పిఎ చట్టమే అవసరం లేదు. ఈ నాడు మణిపూర్ ప్రపంచ వ్యాపితంగా వార్తల్లో ఉంది. అయితే దీనికి వేరే కారణాలున్నాయనుకోండి. ఇక్కడ కూడా మనం చట్టం, న్యాయంతో సంబంధంలేని హత్యల గురించి పట్టించుకోవడం లేదు. ప్రధాన మంత్రి కూడా ఆ ఘోరమైన ఘటన వెలుగులోకి వచ్చిన తరువాతనే గత్యంతరం లేని పరిస్థితుల్లో నోరు తెరిచి నాలుగు వాక్యాలు చెప్పారు.

అందువల్ల ఇటువంటి హత్యలు జరుగుతున్నాయని ప్రభుత్వం లోక్‌సభలో ఒప్పుకున్నాక భారత దేశంలో రాజ్యం పనిలో మార్పు వచ్చిందనుకోవాలా? అబ్బే, అదేం లేదు. ఎన్‌కౌంటర్లు కొనసాగుతూనే ఉన్నాయి. సుప్రీం కోర్టు మెట్లు ఎక్కి వచ్చిన వ్యక్తి కూడా కస్టడీలో చనిపోవడం, ఒక చోట నుండి మరో చోటికి తీసుకెళుతున్న వ్యక్తిని కూడా చంపేయడం, అదికూడా టీవీలో ప్రత్యక్ష ప్రసారం చూపిస్తూ చంపడం వంటి ఇటీవలి ఉదాహరణలు అనేకం ఉన్నాయి.

ఇటువంటి వాటిని సాధ్యం చేసే పరిస్థితులు కొన్ని ఈ దేశంలో నెలకొని ఉన్నట్లు కనిపిస్తోంది. సభ్య సమాజం స్థాయిలో ఇటువంటి హత్యలకు ప్రతిఘటన లేదు. కొంతవరకూ ఊహమీద ఆధారపడిందే అయివుండొచ్చు గానీ, సమాజంలో 'మంచి' ప్రజలు, 'చెడ్డ' ప్రజలు అనే భావన వల్ల ఇటువంటి పద్ధతులకు ఆమోదం లభిస్తోంది. ఇటువంటి ఘటనలపై మీడియా కవరేజీలో కూడా ఇది ప్రతిబింబిస్తోంది. రాజ్యం చట్టవిరుద్ధంగా హత్యలు గావిస్తే మీడియాకు అది పెద్ద విషయం గాకుండా పోయింది. దాని గురించి చర్చించడం అనవసరమనుకుంటోంది. సమాజం నుండి ఇటువంటి అనుమతి వల్ల, పౌర సమాజం నుండి మినహా మిగతా సమాజం నుండి కనీస స్పందన లేనందువల్ల, ప్రభుత్వం తను ఇటువంటి హత్యలు చేసుకుంటూ పోతున్నది.

ఈ విషయంలో న్యాయవ్యవస్థ కొంచెం ఆసక్తి కనబరుస్తున్నప్పటికీ అది కూడా గతంలో చేసిన దానికీ, ఇప్పటికీ చేస్తున్నదానికీ రాజ్యాన్ని బాధ్యురాలిగా చేయడం లేదు. దీనంతటి వల్ల భారత దేశంలో చట్టాన్ని ధిక్కరించి హత్యలు చేయడం అనేది సామాన్య విషయంగా మారిపోయింది. ఇతరులకు ఇబ్బంది కలిగించనంతవరకు ఇది ఒక సమస్యే కాకుండా పోతుంది. అయితే ఈ నెల ఈ సమస్య అంతర్జాతీయం అయింది. భారతీయ రాజ్యం ఇంకొకరి భూభాగంలో చట్టవిరుద్ధ హత్యకు పాల్పడిందని ఆరోపించబడింది. దీనికి సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి సాక్ష్యం సమర్పించలేదు. అందువల్ల ఎప్పటిలాగే మనం అమాయకులమని చెప్పవచ్చు. ఈ ఆరోపణలు నిజం కాకూడదని ఆశిద్దాం.

కానీ మన ఇంటి లోపల పరిస్థితి ఏమిటో పరిశీలిద్దాం. మన దేశంలో ఈ సమస్య చాలా తీవ్రంగానూ, ఒక వ్యాధిలాగానూ పట్టి పీడిస్తోంది. అధికారిక న్యాయవ్యవస్థకు సమానాంతరంగా ఒక అనధికార, క్రూరమైన న్యాయవ్యవస్థ మనుగడలో ఉంది. అధికారిక న్యాయవ్యవస్థ నేరస్తులుగా తేలినవారికి మరణ శిక్ష విధించేకన్నా అనేక రెట్లు ఎక్కువ మందిని చంపడం ద్వారా శిక్షిస్తోంది. 2016 2022 సంవత్సరాల మధ్య కాలంలో 800 మంది కన్నా ఎక్కువ మందిని ఎన్‌కౌంటర్‌లో చంపేశారని గత ఏడాది హిందూ కు చెందిన ఫ్రంట్ లైన్ పత్రిక వెల్లడించింది. ఇదే కాలంలో శిక్షలు ప్రకటించి ఉరితీయబడిన వ్యక్తులు అయిదుగురు మాత్రమే.

మనల్ని మనం చూసుకోడానికి ఎవరో బయటి వారు వచ్చి చెప్పనక్కరలేదు, భారత దేశంలో జరుగుతున్న ఘటనలు చూస్తే సరిపోతుంది. మణిపూర్‌లో చంపేసిన వారి జాబితాను తయారుచేసి, 2012 మార్చిలో భారత దేశానికి పరిశీలన కోసం వచ్చిన చట్టవిరుద్ధ హత్యలు, ఏకపక్ష హత్యలపై ఐక్య రాజ్య సమితి ప్రత్యేక పరిశీలకుడు క్రిస్టోఫ్ హేన్స్‌కు సమర్పించడం జరిగింది. మనం ముందుగానే చర్యలు తీసుకుని ఉంటే ఇదంతా అవసరమవుతుందా?

❋

**"అందువల్ల ఇటువంటి హత్యలు జరుగుతున్నాయని ప్రభుత్వం లోక్‌సభలో ఒప్పుకున్నాక భారత దేశంలో రాజ్యం పనిలో మార్పు వచ్చిందనుకోవాలా? అబ్బే, అదేం లేదు. ఎన్‌కౌంటర్లు కొనసాగుతూనే ఉన్నాయి. సుప్రీం కోర్టు మెట్లు ఎక్కి వచ్చిన వ్యక్తి కూడా కస్టడీలో చనిపోవడం, ఒక చోట నుండి మరో చోటికి తీసుకెళుతున్న వ్యక్తిని కూడా చంపేయడం, అదికూడా టీవీలో ప్రత్యక్షప్రసారం చూపిస్తూ చంపడం వంటి ఇటీవలి ఉదాహరణలు అనేకం ఉన్నాయి."**




భూటకపు ఎన్‌కౌంటర్లు, మానవ హక్కుల హననానికి నిరసనగా దీక్ష చేపట్టిన మణిపూర్ విద్యార్థులు మేధావులు

# కలి కాలం

ఎం.వి.ఎస్.శర్మ


రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

**క్రీ.శ.** 3వ శతాబ్దపు మొదటి అర్ధభాగంలో ఉత్తర భారతంలో కుషానుల సామ్రాజ్యం, దక్షిణాదిన శాతవాహనుల సామ్రాజ్యం దాదాపు ఒకే కాలంలో పతనం కావడం మొదలైంది. ఆయా సామ్రాజ్యాల స్థానిక ప్రతినిధులు ఎక్కడికక్కడ స్వతంత్రతను ప్రకటించుకోసాగారు. శకులు (విదిశ ప్రాంతంలో), మాఘులు (కౌశాంబి ప్రాంతంలో), యౌధేయులు (రాజస్థాన్) ఇక్ష్వాకులు (ఆంధ్ర ప్రాంతం) కాదంబులు, పల్లవులు, విష్ణుకుండినులు, వాకాటకులు చిన్న చిన్న రాజ్యాలను పాలించడం మొదలైంది.

క్రీ.పూ. 6వ శతాబ్దంలో బలంగా రూపు దిద్దుకున్న కుల వ్యవస్థ బౌద్ధం, జైనం తదితర మతాల సవాలును తట్టుకుని కొనసాగింది. తాను స్వయంగా బౌద్ధమతాన్ని స్వీకరించినా, దాని వ్యాప్తికి తోడ్పడినా, అశోకుడు సైతం కులవ్యవస్థను సవాలు చేసేందుకు పూనుకోలేదు. ఆ తర్వాత వచ్చిన కుషానులు గానీ, శాతవాహనులు గానీ కుల వ్యవస్థను బలోపేతం చేయడానికే తోడ్పడ్డారు.

ఆ విధంగా దాదాపు ఒక వేయి సంవత్సరాలపాటు బలపడుతూ వచ్చిన కుల వ్యవస్థ క్రీ.శ.3-4 శతాబ్దాల మధ్య కాలంలో తీవ్రమైన సవాలును ఎదుర్కొంది. శాతవాహన, కుషాను సామ్రాజ్యాలు పతనమై చిన్న చిన్న రాజ్యాలుగా ఎక్కడికక్కడ తలెత్తడం ఈ సవాలుకు రాజకీయ భూమికను కల్పించింది. ఈ కాలాన్ని పురాణాలు, ధర్మశాస్త్రాలు కలియుగం, లేదా కలికాలం అని వర్ణించాయి.

వేదాలు, ఉపనిషత్తులు, క్రీ.శ. 200 కి మునుపు రూపొందిన ధర్మశాస్త్రాలు ఎక్కడా ఈ కలికాలం గురించి ప్రస్తావించలేదు. కాని రామాయణంలోని అయోధ్యకాండలో 'అరాచక వ్యవస్థ' గురించిన ప్రస్తావనలు ఉన్నాయి. అదే విధంగా మహాభారతం లోని ఆరణ్యక పర్వంలోనూ, శాంతి పర్వం లోనూ కలికాలం గురించిన వర్ణనలు వివరంగా ఉన్నాయి. క్రీ.శ. 200-275 మధ్యకాలంలో రాయబడిన వాయు పురాణంలో, బ్రహ్మాండపురాణంలో, క్రీ.శ 275-325 మధ్య కాలంలో రాయబడిన విష్ణు పురాణంలో కలికాలం గురించి వివరాలు ఉన్నాయి. ఈ పురాణాలు రాసిన కాలం, శాతవాహన, కుషాను సామ్రాజ్యాలు పతనం చెందుతున్న కాలం ఒక్కటే. మను ధర్మశాస్త్రంలోనూ, కౌటిల్యుడి అర్ధ శాస్త్రంలోనూ కూడా ఈ కలికాలానికి చెందిన ప్రస్తావనలు చాలానే ఉన్నాయి.

ఈ ప్రస్తావనలన్నీ ఆ కాలంలో తలెత్తిన రాజకీయ, సామాజిక సంక్షోభం గురించి ఆధిపత్య వర్గాల కోణం నుంచి చేసినవేనన్న సంగతిని మనం ముందు గుర్తుంచుకోవాలి. పురాణాలు, ధర్మశాస్త్రాలు బ్రాహ్మణులు రాసినవే. కుల వ్యవస్థను బలపరుస్తూ రాసినవే. తమ బ్రాహ్మణాధిపత్యానికి పెను సవాలు ఎదురైతే ఆ తరగతులు ఏ విధంగా గగ్గోలు పెడతాయో అది కలికాలం గురించి పురాణాలలో ఉన్న ప్రస్తావనలు తెలియజేస్తాయి.

మానవ సమాజంలో జరిగే పరిణామాలను బ్రాహ్మణవాదం నాలుగు దశలుగా, నాలుగు యుగాలుగా వివరించింది. అవి కృత యుగం, త్రేతాయుగం, ద్వాపర యుగం, కలి యుగం. కలియుగం తర్వాత మళ్ళీ కృత యుగం మొదలౌతుందని చెప్తారు.

కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలమీదా నడుస్తుంది. అంటే ధర్మం అత్యున్నత దశలో ఉంటుంది. ఆ యుగంలో ఏ ఒక్కరూ తమ తమ కులాలకు నిర్దేశించిన ధర్మాలను అతిక్రమించరు. కుల వ్యవస్థకు పూర్తిగా లోబడి నడుచుకుంటారు.

ఆ తర్వాత త్రేతా యుగం. ఇందులో ధర్మం ఒక కాలును కోల్పోయింది. ఐతే, ఈ యుగంలో ఆదర్శవంతమైన పాలనకు ప్రతీకగా రామరాజ్యం ఉంది. ఆ రాజ్యంలో అందరూ సంపదలతో, సుఖ సంతోషాలతో జీవించారు. (ఇక్కడ అందరూ అంటే పాలక వర్గాలందరూ అని వేరే చెప్పనక్కరలేదు)

తర్వాతది ద్వాపర యుగం. ఇందులో ధర్మానికి మరో కాలు పోతుంది. మహాభారత యుద్ధం జరిగింది. ఈ యుగధర్మానికి ప్రతీక ధర్మరాజు, లేదా యుధిష్టిరుడు. (ప్రజల సంపదను పణంగా ఒడ్డి జూదం ఆడినవాడు ధర్మానికి ప్రతీక !)

నాలుగోది కలి యుగం. ఈ యుగంలో ధర్మం ఒంటికాలిపై కుంటుతూ నడుస్తుంది. వర్ణ సంకరం ఎల్లెడలా తాండవిస్తుంది. కుల వ్యవస్థకు అది పెనుసవాలు అవుతుంది.

కలియుగాంతం తర్వాత మళ్ళీ కృతయుగం మొదలౌతుంది. అంటే కుల వ్యవస్థ శాశ్వతంగా కొనసాగుతుంది.

పైన ప్రస్తావించిన పురాణాలు కృత యుగాన్ని గొప్పగా పొగుడుతూ ప్రస్తావించాయి. త్రేతా, ద్వాపర యుగాల గురించి కొద్దిగానే పేర్కొన్నాయి. కలి యుగం లేదా కలి కాలం గురించి అవి ఎక్కువగా చర్చించాయి.

ఈ పురాణాలు రాయబడిన కాలం, కుషాను, శాతవాహన సామ్రాజ్యాలు పతనం అయిన కాలం, దాదాపు ఒక్కటే. అంటే ఈ పురాణాల్లో పేర్కొన్న కలికాలం క్రీ.శ.3-4 శతాబ్దాల మధ్య కాలం అయివుండాలి.

కలికాలపు ప్రధాన ధోరణులు ఈ విధంగా ఉంటాయని పురాణాలు పేర్కొన్నాయి. అవి వర్ణ సంకరం, లేదా వివిధ కులాల మధ్య కట్టుబాట్లను అతిక్రమించి సంబంధాలు పెట్టుకోవడం, శూద్రులకు, బ్రాహ్మణులకు మధ్య వైరం పెరగడం. వైశ్యులు పన్నులు చెల్లించడానికి నిరాకరించడం. భారీగా పన్నులు వడ్డించి ప్రజలను పాలకులు

పీడించడం. దొంగతనాలు దోపిడీలు పెరిగిపోవడం. కుటుంబానికి, ఆస్తికి రక్షణ లేకపోవడం. జీవనోపాధి నాశనం కావడం. కర్మకాండలకన్నా సంపదలకే ప్రాధాన్యత పెరగడం. కుల వ్యవస్థకు వెలుపల ఉండే వారు (మ్లేచ్ఛులు) పాలకులుగా పుట్టుకురావడం.

ఈ ధోరణులన్నీ ఆధిపత్య కులాలవారికి ప్రతికూలంగా పరిణమించినవే. అందుకే దీనిని కలికాలం అన్నారు.

వర్ణసంకరం అంటే కేవలం కులాంతర వివాహాలు చేసుకోడం, తద్వారా సంతానాన్ని కనడం మాత్రమే కాదు. ఆహారపుటలవాట్లలో మార్పు మాత్రమే కాదు. సంపదను ఉత్పత్తి చేసే కులాలు ( వైశ్యులు వ్యవసాయం చేసే రైతులుగా, శూద్రులు కూలీలుగా, బానిసలుగా ఉండడం అప్పటి వరకూ కులకట్టుబాటు) తమకు నిర్దేశించిన విధులను నిర్వహించడానికి తిరస్కరించడం వర్ణ సంకరం అవుతుంది. రైతులుగా ఉన్న వైశ్యులు తమ వంతు శిస్తులను చెల్లించకపోవడం, శూద్రులు ఆధిపత్య కులాలు చెప్పినట్టు చాకిరీ చేయడానికి నిరాకరించడం వర్ణ సంకరం అన్నమాట.

మరి ఉత్పత్తి కులాలవారు శిస్తులు చెల్లించకపోతే, చాకిరీ చెయ్యకపోతే ఆధిపత్య కులాలైన క్షత్రియులు, బ్రాహ్మణులు తమ పెత్తనాన్ని ఎలా కొనసాగించగలగుతారు? పెత్తనం మాట అటుంచి, వాళ్ళ జీవన భృతి ఎక్కడినుంచి వస్తుంది? అందుచేత వాళ్ళు కూడా తమ విధులను (పెత్తనాన్ని) వదిలిపెట్టి బతుకుతెరువుకోసం రకరకాల పనులను చేపట్టవలసివస్తుంది. ఎక్కడెక్కడికో పోవలసివస్తుంది. ఇదే కలికాలం సారాంశం.

కలికాలంలో రెండు రకాల వైరుధ్యాలు తలెత్తాయి. బ్రాహ్మణులు, క్షత్రియులు ఒకవైపు, వైశ్యులు మరొకవైపు. విపరీతంగా శిస్తుల భారం పెరిగిపోవడం, అణచివేత పెరిగిపోవడంతో వ్యవసాయదారులైన వైశ్యులు శిస్తులు చెల్లించడానికి నిరాకరించ సాగారు. కరువు కాటకాలతో పంటల దిగుబడి కూడా తగ్గుతూవచ్చింది. ఖజానాకు రాబడి తగ్గిపోయింది. ఇది మొదటి వైరుధ్యం. రెండవది: ఉచితంగా అగ్రకులాలకు చాకిరీ చేయడానికి శూద్రులు నిరాకరించడం.

ఈ వైరుధ్యాల పర్యవసానంగా యోగక్షేమం అదృశ్యం అయింది. యోగం అంటే సంపదను కలిగివుండడం. క్షేమం అంటే భద్రత. అంటే సంపదను కలిగిన ఆధిపత్య కులాలవారి ఆస్తి హక్కుకు భంగం వాటిల్లిందన్నమాట. శిస్తులు భారంగా

“ కలికాలంలో రెండు రకాల వైరుధ్యాలు తలెత్తాయి. బ్రాహ్మణులు, క్షత్రియులు ఒకవైపు, వైశ్యులు మరొకవైపు. విపరీతంగా శిస్తుల భారం పెరిగిపోవడం, అణచివేత పెరిగిపోవడంతో వ్యవసాయదారులైన వైశ్యులు శిస్తులు చెల్లించడానికి నిరాకరించ సాగారు. కరువు కాటకాలతో పంటల దిగుబడి కూడా తగ్గుతూవచ్చింది. ఖజానాకు రాబడి తగ్గిపోయింది. ఇది మొదటి వైరుధ్యం. రెండవది: ఉచితంగా అగ్రకులాలకు చాకిరీ చేయడానికి శూద్రులు నిరాకరించడం. ”

మారిపోయి వాటిని చెల్లించలేని పరిస్థితుల్లో వైశ్యులు వ్యవసాయాన్ని వదలి పెట్టారు. వారిలో కొందరు వ్యాపారానికి మళ్ళారు. మరికొందరు సన్యాసం తీసుకోసాగారు. లేదా దొంగలుగా మారారు. మరోవక్క రాజు తన అవసరాలకోసం, భోగాలకోసం అధిక శిస్తులు విధిస్తూ తన రక్షణను మాత్రమే పట్టించుకునేవాడు. రాజాధికారులు నిరుంకుశులుగా, లంచగొండులుగా మారారు. ప్రజల్ని పీడించుకు తినడమే తప్ప, తమ బాధ్యతలను పట్టించుకోవడం మానివేశారు.

కేంద్రీకృత అధికారం గల సామ్రాజ్యాలు అంతరించడంతో విదేశీ ఆక్రమణదారులు పెరిగారు. స్థానికంగా బలం, బలగం ఉన్నవారు తమ చేతుల్లోకి పెత్తనాన్ని తీసుకోసాగారు. ఆశ్విక దళాలు, గజ బలం, పదాతిదళం, వీటిని పోషించగలిగేంత ధనం ఉన్నవారెవరైనా రాజు అయిపోయేవారు. ఆ తర్వాత వాళ్ళని క్షత్రియులుగా బ్రాహ్మణులు ప్రకటించి వారి పాలనకు చట్టబద్ధత కల్పించేవారు.

కుల కట్టుబాట్లను అతిక్రమించినది కేవలం దిగువ కులాలే కాదు. ఇతర తరగతులవాళ్ళు సైతం అతిక్రమించారు. వర్తకులు తప్పుడు కొలతలను, తప్పుడు తూనికలను ఉపయోగించి మోసాలకు పాల్పడసాగారు. వారిపైన అధిక పన్నులు విధించడంతో వర్తకులు కూడా పాలకులకు వ్యతిరేకంగా తయారయ్యారు. ఇక చేతివృత్తులవారు రాజు వద్ద ప్రతీ నెలా కొన్ని రోజులు ఉచితంగా, ప్రతిఫలం లేకుండా పని చేయవలసిరావడంతో వారు కూడా వ్యతిరేకంగా తయారయ్యారు.

క్రీ.శ.3-4 శతాబ్దాల మధ్య కాలంలో వాణిజ్యం, విదేశీ వ్యాపారం క్షీణ దశకు చేరుకుంది. వ్యవసాయ భూమి విస్తరించకపోవడంతో రాబడిలో పెరుగుదల లేదు. సంపన్న కులాలవారే ప్రధానంగా విదేశీ సరుకులు కొనుగోలు చేయగలిగే స్థితి వచ్చింది. వ్యవసాయం మీద రాబడి తగ్గడంతో వారి కొనుగోలుశక్తి కూడా పరిమితం అయిపోయింది. భూసారం క్షీణత, కరువు కాటకాలు తోడయ్యాయి. వ్యాపారం తగ్గడంతో చేతివృత్తులు దెబ్బ తిన్నాయి. అంతవరకూ సంపదకు, సాంస్కృతిక వికాసాలకి కేంద్రాలుగావిలసిల్లిన పట్టణాలు క్షీణించడం, లేదా శిథిలం కావడం మొదలైంది. అంతవరకూ ఆ పట్టణాలలో జీవించినవారంతా బతుకుతెరువు కోసం గ్రామాలకు తరలిపోవడం మొదలైంది. ఇది గ్రామాలమీద వత్తిడిని మరింత పెంచింది.

కలి కాలంలో సైతం బౌద్ధం బ్రాహ్మణ మతం పట్ల తన నిరసనగళాన్ని వినిపిస్తూనేవుంది. అదే సమయంలో వైష్ణవం ఒక సాంప్రదాయేతర మత శాఖగా ప్రాచుర్యం పొందసాగింది. అది దిగువ కులాల ప్రజలకు సైతం సానుకూలతను ప్రదర్శించింది.

“సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ” అని భగవద్గీతలో కృష్ణుడు బోధించినట్టు ఉంది. అన్ని ధర్మాలనూ వదిలిపెట్టి నన్ను శరణు వేడితే నీకు స్వర్గ ప్రాప్తి కలుగుతుంది అని దాని సారాంశం. అందులో పరోక్షంగా కుల కట్టుబాట్ల ప్రాధాన్యతను తగ్గించే భావం ఉంది. దాంతో వైశ్య, శూద్ర కులాలవారు, మహిళలు స్వర్గ ప్రాప్తి పొందవచ్చునన్న అభిప్రాయం బలపడింది. అది బ్రాహ్మణాధిపత్యాన్ని సవాలు చేసింది. దాంతో శూద్రులలో తపస్సు చేసేవారు, వైష్ణవ మత బోధకులు బయలుదేరారు. రాముడు శంబూకుడిని వధించిన కథను ఈ నేపథ్యంలో చూడాలి.

తాత్వికంగా ఈ ధోరణులన్నీ బ్రాహ్మణాధిపత్యాన్ని సవాలుచేయసాగాయి.

ఈ సంక్షోభాన్ని తట్టుకోడానికి మనుధర్మశాస్త్రం తీవ్రమైన అణచివేత చర్యలను చేపట్టవలసిందిగా రాజుకు సూచించింది. శాంతిపర్వంలో కూడా ఈ మాదిరి సూచనలు

“ఇంతకూ కఠినంగా వ్యవహరించడం అంటే ? తప్పు చేసిన బ్రాహ్మణుడికి మందలింపు అతి పెద్ద శిక్ష. అదే క్షత్రియుడికైతే రాజుకు పూర్తిగా దాసోహం కావడమే శిక్ష. ఇక వైశ్యుడికైతే మరింత ఎక్కువ శిస్తు అపరాధం కింద చెల్లించడం శిక్ష. తప్పు చేసిన శూద్రు డికి ఆస్తీ పాస్తీ ఉండదు గనుక శూద్రులకీ, చండాలురికీ కఠినాతి కఠినమైన శిక్షలు విధించేవారు.”

ఉన్నాయి. ప్రజలను రక్షించి వారి బాగోగులు చూసే పాత్రను పోషించే బదులు ప్రజలను కఠినంగా శిక్షించి వర్ణాశ్రమ ధర్మాలను కాపాడే నిరంకుశ పాత్రను రాజులకు నిర్దేశించారు. బలప్రయోగం ద్వారా కఠినంగా అణచివేయగలిగినప్పుడే రాజు ధర్మాన్ని కాపాడి “యోగక్షేమాలను” పరిరక్షించగలుగుతాడు అని పురాణాలు పేర్కొన్నాయి.

స్వర్గంలో ఎవరూ పాపాలు చేయరు. ఎందుకు ? అక్కడ కఠినంగా శిక్షించి ధర్మాన్నిపరిరక్షించడానికి యమధర్మరాజు ఉంటాడు గనుక. అదే మాదిరిగా ఈ లోకంలో కూడా వర్ణ సంకరం జరగకుండా ఉండాలంటే రాజు యముడి మాదిరిగా వ్యవహరించాలన్నారు.

ఇంతకూ కఠినంగా వ్యవహరించడం అంటే ? తప్పు చేసిన బ్రాహ్మణుడికి మందలింపు అతి పెద్ద శిక్ష. అదే క్షత్రియుడికైతే రాజుకు పూర్తిగా దాసోహంకావడమే శిక్ష. ఇక వైశ్యుడికైతే మరింత ఎక్కువ శిస్తు అపరాధం కింద చెల్లించడం శిక్ష. తప్పు చేసిన శూద్రుడికి ఆస్తీ పాస్తీ ఉండదు గనుక శూద్రులకీ, చండాలురికీ కఠినాతి కఠినమైన శిక్షలు విధించేవారు.

ఐతే, అణచివేతతో, శిక్షలతో సమాజం సంక్షోభం నుండి బైట పడడం సాధ్యం కాదు. కనుక ఈ కాలంలోనే భూదానాలు సంక్షోభానికి ఒక పరిష్కారంగా ముందుకొచ్చాయి.

మొదట ఈ భూదానాలు ఉత్తర భారతంలో గాక, వర్ణవ్యవస్థ అంతగా బలపడని ప్రాంతాలలో మొదలయ్యాయి. తూర్పు మధ్య ప్రదేశ్, విదర్భ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి ప్రాంతాలలో భూదానాలు మొదట జరిగాయి. ఇక్కడ బ్రాహ్మణాధిపత్యం ఉత్తరాదిలో మాదిరిగా బలపడివుండకపోవడం కూడా ఒక కారణం కావచ్చు. శాతవాహనుల కాలంలో తొలుత ఈ భూదానాలు మతకార్యకలాపాల నిమిత్తం చేశారు. కాని క్రీ.శ.3-4 శతాబ్దాల మధ్య కాలంలో భూదానాలు విస్తరించాయి. మత కార్యకలాపాలకే కాకుండా ఇతర కార్యకలాపాలకోసం కూడా భూదానాలు చేయసాగారు. కోసల, వాకాటక, మాఘ, ఇక్ష్వాక, పల్లవ, విష్ణుకుండిన రాజ్యాలలో భూదానాలు విరివిగా సాగాయి.

నెదుంగరాజ అనే గ్రామాన్ని ‘శరణిక గ్రామం’గా ప్రకటించి దానిని నిరాశ్రయులైన బ్రాహ్మణులకు దానంగా పల్లవరాజు విష్ణుగోపుడు అనేవాడు ఇచ్చినట్టు, ఆ బ్రాహ్మణులు ఆంధ్ర లోని నెల్లూరు నుండి శరణార్థులుగా వచ్చినట్టు ఒక శాసనం లభించింది. ఇది 5వ శతాబ్దం నాటిది. అంటే వర్ణ వ్యవస్థను కాపాడడం కోసం రాజులు బ్రాహ్మణులకు అండగా వ్యవహరించారని కనిపిస్తోంది.

మధ్య గంగా మైదానంలో భూదానాలు వేరే విధంగా జరిగాయి. అంతవరకూ సాగులో లేని బంజరు భూములను సాగులోకి తేవడం కోసం వాటిని దానంగా ఇవ్వడం ఇక్కడ జరిగింది. కొత్తగా సాగులోకి వచ్చిన ప్రాంతాలమీద పెత్తనం నెరపడానికి బ్రాహ్మణులకు వాటిని దానంగా ఇచ్చేవారు. సాంఘిక అశాంతి పెరుగుతున్నకొద్దీ దాని ఉధృతిని తగ్గించడానికి, చెదరగొట్టడానికి ఈ భూదానాలను ఉపయోగించారు.

ఇంకోపక్క సామాజిక సంక్షోభం ఫలితంగా ఉన్నచోట బతకలేక బ్రాహ్మణులు, తమ కుటుంబాలతో సహా ఇతర ప్రదేశాలకు వలసలు పోవడం ప్రారంభించారు. వారితోబాటు రైతులను, చేతివృత్తిదారులను కూడా వెంటపెట్టుకుపోయారు. ప్రధానంగా నదీ తీరాల వెంబడి ఆ వలసలు సాగాయి. మధ్య గంగా మైదాన ప్రాంతాల నుండి నాలుగు దిక్కులవైపై ఈ వలసలు సాగాయి. ఉత్తర బీహార్ మీదుగా కాశ్మీర్ దాకా, తూర్పున అంగ, వంగ (బెంగాల్) దాకా, పడమటన తపతీ నది ముఖద్వారం దాకా (మేఖల), దక్షిణాన గోదావరి, కృష్ణ నదుల మధ్య ప్రాంతం దాకా ఈ వలసలు సాగాయి. ఈ ప్రదేశం క్రీ.శ. 3-4 శతాబ్దాల మధ్య కాలంలోనే ప్రసిద్ధి గాంచింది.

కొత్తగా ప్రవేశించిన ప్రదేశాల్లో స్థానికంగా ఉన్న తెగల నాయకులను క్షత్రియులుగా ప్రకటించి వారి అధికారాన్ని బ్రాహ్మణులు చట్టబద్ధం చేశారు. ఆ క్రమంలో స్థానిక తెగల ప్రజలను సైతం కుల వ్యవస్థ చట్రంలోకి తీసుకువచ్చారు. అంతకు ముందు ఎవరినైతే దొంగలుగా, సంఘవ్యతిరేక శక్తులుగా ఈ బ్రాహ్మణులు వర్ణించారో, వారినే ఇప్పుడు ప్రభువులుగా, ప్రజారక్షకులుగా కీర్తించసాగారు.

విరివిగా సాగిన భూదానాలు, కొత్త ప్రదేశాలలో స్థిరపడడం వలన వ్యవసాయం విస్తరించింది. సంపద పెరిగింది. కొత్త ప్రాంతాలకు మెరుగైన ఉత్పత్తి పద్ధతులు విస్తరించాయి. క్షీణించిన పాత పట్టణాలనుండి తరలివచ్చిన ప్రజలకు జీవనాధారం లభించింది. మరోపక్క కేంద్రీకృతంగా ఉంటూవచ్చిన పాలనా విధానం ఇప్పుడు వికేంద్రీకరించబడింది. ప్రభువుకు, ఉత్పత్తిదారులకు మధ్య పాలక వర్గపు దొంతరలు ఏర్పడ్డాయి. పన్నుల వసూలు, శాంతిభద్రతల నిర్వహణ బాధ్యతలు దిగువ దొంతరల పాలకవర్గాల బాధ్యత అయింది. మౌర్య సామ్రాజ్యపు అధికార యంత్రాంగంతో పోల్చితే చాలా తక్కువ యంత్రాంగంతో ఇప్పుడు రాజు పరిపాలన చేయగలుగుతున్నాడు.

కలి కాలంలో వివిధ కులాల స్థితిగతులలో మార్పులు వచ్చాయి. రాజులు విధించే అధిక పన్నులను చెల్లించడం అసాధ్యం అవుతున్న నేపథ్యంలో వైశ్యులలో పట్టు కలిగివున్న కొందరు తక్కిన వారిని కూడగట్టుకుని స్వతంత్ర రాజ్యాన్ని ప్రకటించుకున్నారు. వారే గుప్తులు. తర్వాత గుప్తరాజులు అయారు. ఆ తర్వాత వర్ణాశ్రమధర్మాలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించారు. శూద్రులు తమపై తిరగబడి అక్కడక్కడా తమ స్వంత రాజ్యాలను ఏర్పాటు చేసుకున్న నేపథ్యంలో, బ్రాహ్మణులు తమ ఆధిపత్యంలో నాగ, వాకాటక, పల్లవ, గాంగ, కాదంబ తదితర రాజ్యాలను స్థాపించారు.

కొందరు వైశ్యులు వ్యవసాయం వదిలిపెట్టి వ్యాపారం వృత్తిగా స్వీకరిస్తే తక్కిన

**ఈ మాసం ముఖ్యాంశం**

# శాస్త్రీయ దృక్పథం (సైంటిఫిక్ టెంపర్‌మెంట్)



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

**ఎస్ వెంకట్రావు**

శాస్త్రీయ దృక్పథం లేదా (సైంటిఫిక్ టెంపర్‌మెంట్) అన్న పదాన్ని మన దేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 1946లో రాసిన ప్రఖ్యాత రచన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' లో మొట్టమొదటి సారిగా ఉపయోగించారు.

నెహ్రూ ఉద్దేశంలో వ్యక్తులు తమ దైనందిన జీవితాల్లో విజ్ఞాన శాస్త్ర పద్ధతులను అనుసరించి నిర్ణయాలు తీసుకోవడమే శాస్త్రీయ దృక్పథం అంటే.

### విజ్ఞాన శాస్త్ర పద్ధతి

అంటే సత్యాన్ని తెలుసుకోడానికి, నిర్ధారించడానికి విజ్ఞాన శాస్త్రం ఏ పద్ధతిని ఉపయోగిస్తుందో ఆ పద్ధతినే దైనందిన జీవితంలో ప్రజలంతా ఉపయోగించడమే శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవడం. సత్యాన్ని తెలుసుకోడానికి సైన్సు అనుసరించే పద్ధతి ఏమిటి? 17వ శతాబ్దం నుండి అభివృద్ధి చెందిన ఆధునిక సైన్సు అనుసరించే పద్ధతి. ప్రశ్న, పరిశీలన, పరిశోధన, ప్రతిపాదన, ప్రయోగం, దాన్నుండి వచ్చిన సమాచారాన్ని విశ్లేషించి నిర్ధారణలకు రావడం, ప్రచారం చేయడం ఇదీ శాస్త్రీయ పద్ధతి. ఏ విషయమైనా శాస్త్రీయంగా నిలవాలంటే శాస్త్ర ప్రయోగానికి నిలవాలి. ప్రయోగంలో ఒకసారి వచ్చిన ఫలితమే ఎన్నిసార్లయినా రావాలి. అలా రాకపోతే దాన్ని ఎటువంటి మినహాయింపులు లేకుండా తిరస్కరిస్కరిస్తుంది సైన్సు.

ప్రజలు దైనందిన జీవితంలో శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరిస్తే వారు పిడివాదాన్నీ, మూఢభావాలనూ, అశాస్త్రీయ సంప్రదాయాలనూ వదిలిపెట్టి ఈ విశాల విశ్వంలోని ప్రకృతినీ, దానిలో భాగంగా మానవ సమాజాన్నీ, సామాజిక జీవిగా మనిషిలోని శక్తి యుక్తులనూ అర్థం చేసుకోగలుగుతారు. ప్రజలను అలా తయారు చేయగలిగితే సమాజం పురోగమిస్తుంది. అలా కాకుండా మూఢాచారాలు, తర్కవిరుద్ధ భావజాలాన్ని పట్టుకు వేలాడితే అవి సమాజాన్ని వెనక్కు నడుపుతాయి.

### సైన్సు-శాస్త్రీయ దృక్పథం

చాలా మంది శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయడం అనగానే సైన్సును ప్రచారం చేస్తే చాలు అనుకుంటారు. కానీ శాస్త్రీయ దృక్పథం అనేది కేవలం సైన్సుకు సంబంధించిన అంశం కాదు. అది సైన్సు యొక్క సామాజిక ప్రయోజనాలకు చెందిన అంశం. అంటే అది సామాజిక, రాజకీయ అంశం. సామాజిక అంశం ఎందుకంటే సమాజం శాస్త్ర సాంకేతికా విష్కరణలను ఎలా ఉపయోగించు కుంటుంది అన్న విషయం ఇందులో ఇమిడి ఉంటుంది. రాజకీయ అంశం ఎందుకంటే ప్రభుత్వాలు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజారం చేసి వారిని భావి పురోభివృద్ధికి సన్నంద్ధం చేస్తున్నాయా లేక అశాస్త్రీయ భావాల ప్రచారంతో ప్రజలను తిరోగామి పథంలో నడిపిస్తున్నాయా అన్న అంశం ఇందులో ఇమిడి ఉంటుంది.

### ప్రాచీన కాలంలోనే శాస్త్రీయ దృక్పథం ఉంది

శాస్త్రీయ ఆలోచనా విధానం అనేది వేల ఏళ్లుగా ఉంది. మన దేశంలో చార్వాకులు, సాంఖ్యులు, లోకాయతులు, భౌద్ధులు మొదలైన వాళ్లు ప్రాచీన కాలంలోనే హేతుబద్ధ ఆలోచనా ధోరణిని ప్రచారం చేశారు. అయితే వారి ఆలోచనా ధోరణిని బలపరిచే స్థాయిలో ఆనాడు సైన్సు అభివృద్ధి కాలేదు గనుక మన దేశంలో ఆ నాడు హేతువుకీ, మూఢత్వానికీ మధ్య జరిగిన ఘర్షణలో హేతువిరుద్ధ ఆలోచనా విధానం విజయం సాధించింది.

మన దేశంలోనే కాదు యూరప్, చైనా ఇతర ప్రాచీన సమాజాలన్నిటిలో మధ్య యుగాల్లో హేతువిరుద్ధత రాజ్యమేలింది. పెట్టుబడిదారీ సమాజాభివృద్ధితో తొలుత యూరప్ తరువాత అన్ని దేశాలూ ఈ చీకటి యుగం నుండి బయటపడ్డాయి కానీ నేటికీ శాస్త్రీయ దృక్పథానికీ, అశాస్త్రీయ ఆలోచనలకూ మధ్య ఘర్షణ కొనసాగుతూనే ఉంది.

మన దేశంలో స్వాతంత్ర్యోద్యమం బ్రిటిష్ వారిపై పోరాడ్డమే కాదు, కరడుగట్టిన పాత సంప్రదాయ భావజాలం మీద కూడా తిరుగుబాటు చేసింది. మూఢ నమ్మకాలు, కుల మతపరమైన దురాచారాలనుండి భారతీయుల మెదడు విముక్తి చెంది దేశం పురోగామి పథంలో నడవాలంటే వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయడమొక్కటే మార్గమని కాంగ్రెస్ పార్టీలో నెహ్రూ నాయకత్వం, అంబేద్కర్ తదితరులు, స్వాతంత్ర్యోద్యంలో పాల్గొన్న వామపక్ష స్రవంతికి చెందిన నేతలు సహా నాటి పాలకులు అనేక మంది గ్రహించారు.

1958లో భారత ప్రభుత్వం విజ్ఞాన శాస్త్ర విధాన పత్రాన్ని ప్రకటించినప్పుడు అందులో "సైన్సును పెద్ద ఎత్తున ప్రోత్సహించి దాన్ని దేశ అవసరాలకు ఉపయోగించడం నేటి ప్రపంచంలో ప్రధాన అంశంగా ఉంది" అని పేర్కొంది.

1976లో మన రాజ్యాంగంలోని 51ఎ అధికరణం ద్వారా పౌరుల ప్రాథమిక విధులను చేర్చినప్పుడు 8వ విధిలో "శాస్త్రీయ దృక్పథం, మానవత్వం, పరిశీలనా స్ఫూర్తి, సంస్కరణాభిలాష పెంపొందించుకోవడం ప్రతి పౌరుని విధి" అని పేర్కొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ "డిస్కవరీ ఆఫ్ ఇండియా" పుస్తకంలో శాస్త్రీయ దృక్పథం అనే పదాన్ని మొదటి సారిగా ఉపయోగిస్తూ "శాస్త్రీయ దృక్పథం అనేది ఒక జీవన విధానం – ఒక వ్యక్తిగత, సామాజిక ఆలోచనా, ఆచరణాత్మక ప్రక్రియ. ఇది శాస్త్రీయ పద్ధతిని అంటే ప్రశ్నించడం, వాస్తవాన్ని పరిశీలించడం, పరీక్షించడం, ప్రతిపాదించడం, విశ్లేషించడం,

**"మనకు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా నేటికీ సమాజం లో కొనసాగుతున్న ఫ్యూడల్ భావాలు, నిరక్షరాశ్యత, సామాజిక, ఆర్థిక అసమానతలు ప్రజల్లో శాస్త్రీయ భావాల ప్రచారానికి పెద్ద అడ్డంకిగా ఉన్నాయి. వీటికి తోడు మూఢభావాలు, అశాస్త్రీయ ఆచారాలు ప్రజల్లో బలంగా నాటుకుని ఉండడం అభివృద్ధికి ఆటంకాలుగా మారాయి. వీటిని అధిగమించి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి ప్రయత్నం జరిగినా సామాజిక వ్యవస్థలో మౌలిక మార్పు రానందున ఈ వైపు పెద్దగా అడుగులు పడలేదు."**

ప్రచారం చేయడాన్ని పాటి స్తుంది" అని చెప్పారు.

శాస్త్రీయ దృక్పథం అనే భావనను రాజ్యాంగంలో కలిగి ఉన్న అరుదైన దేశాల్లో మన దేశం ఒకటి. కానీ మన దేశం శాస్త్రీయ దృక్పథాన్ని సాధించే విషయంలో ఇంకా చాలా దూరంలోనే ఉండి పోయింది.

### శాస్త్రీయ దృక్పధానికి అడ్డుపడుతున్న అంశాలు

శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో ప్రచారం చేయడానికి మన దేశంలో చాలా అంశాలు అడ్డుపడుతున్నాయి. ఈ అడ్డంకులను గుర్తించి ప్రజల భాగస్వామ్యంతో తొలగిస్తేనే దేశం నిజ మైన పురోగతి సాధిస్తుంది.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినా నేటికీ సమాజంలో కొనసాగు తున్న ఫ్యూడల్ భావాలు, నిరక్షరాశ్యత, సామా జిక, ఆర్థిక అసమానతలు ప్రజల్లో శాస్త్రీయ భావాల ప్రచారానికి పెద్ద అడ్డంకిగా ఉన్నాయి. వీటికి తోడు మూఢ భావాలు, అశాస్త్రీయ ఆచా రాలు ప్రజల్లో బలంగా నాటుకుని ఉండడం అభివృద్ధికి ఆటంకాలుగా మారాయి. వీటిని అధిగమించి ప్రజల్లో శాస్త్రీయ దృక్ప థాన్ని పెంచడానికి ప్రయత్నం జరిగినా సామా జిక వ్యవస్థలో మౌలిక మార్పు రానందున ఈ వైపు పెద్దగా అడుగులు పడలేదు. అయినప్పటికీ నాటి మన పాలకులు మన సాంఘిక వాతావ రణాన్ని శాస్త్రీయ దృక్పథం, తార్కిక ఆలోచ నలు, మూఢాచారాల నిర్మూలన, లౌకికతత్వం, పురోగామి సంస్కరణలవైపుకు మళ్లించ డానికి కొంత ప్రయత్నం చేశారు. మీడియా కూడా పెద్ద పాత్ర నిర్వ హించింది. న్యాయవ్యవస్థ, ఇతర రాజ్యాంగ వ్యవస్థలు దీనికి ఊతమి చ్చాయి. భావాల ఘర్షణలో శాస్త్రీయ, తార్కిక ఆలోచనా విధానా నిది పైచేయి అయింది.

### అశాస్త్రీయ ధోరణివైపు

కానీ నేడు ఆ పరిస్థితి మారిపోయింది. ప్రభుత్వమే నేడు రాజ్యాంగ విధులను విస్మ రించి శాస్త్రీయ దృక్పథానికి వ్యతిరేకంగా మారింది. మీడియా పూర్తిగా కార్పొరేట్ వ్యాపా రుల చేతుల్లోకి వెళ్లిపోవడం వల్ల దానికి శాస్త్రీ య ఆలోచనా ధోరణుల ప్రచారం పట్ల ఆసక్తి లేకుండా పోయింది.

ఇలాంటి పరిస్థితుల్లో సామాజిక కార్య కర్తలు, కాస్తో కూస్తో ప్రజాదృక్పథాన్ని అలవర చుకున్న పత్రికలు, పాత్రికేయులు శాస్త్రీయ ఆలోచనా ధోరణిని ప్రచారం చేయబోతే వారికి అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి.

దీనికి ఒక ఉదాహరణ 2021 మేలో మణిపూర్ ప్రభుత్వం అరెస్టు చేసిన ఇద్దరు వ్యక్తుల ఉదంతం. వారిలో ఒకరు పాత్రికే యుడు కిషోర్ చంద్ర వాంగ్ ఖెమ్, రెండో వ్యక్తి సైన్సు ప్రచారకుడు ఎరెంద్రో లీచోంబామ్. మణిపూర్‌లోని భారతీయ జనతాపార్టీ ప్రభు త్వం ఇద్దరినీ జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేసింది. వారు జాతీయ భద్రతకు చేసిన హాని ఏమంటే కోవిడ్-19 తగ్గడానికి ఆవు పేడ, ఆవు మూత్రం గొప్ప ఔషధంగా పనిచేస్తా యి అని జరుగుతున్న ప్రచారానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్ట డమే.

ఎంత విచిత్రం! మన రాజ్యాంగంలోని 51ఎ అధికరణం శాస్త్రీయ భావాలు అల వరచుకోవడం ప్రజల ప్రాథమిక విధి అని చెబుతోంది. ఆ విధిని నిర్వహించే వారిని ప్రభు త్వమే అరెస్టు చేస్తోంది.

శాస్త్రీయ ఆలోచనలు, హేతువాద దృక్ప థాలను ప్రచారం చేయడమే జీవిత ధ్యేయంగా ఎంచుకున్న నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే, గౌరీ లంకేశ్‌లను మూఢ శక్తులు ఏకంగా హత్య గావించిన సంగతి మనకు తెలుసు.

ఆధునిక సైన్సు అంతా మనం దేశంలో వేల ఏళ్ల క్రితమే కనుగొనబడిందన్న అహేతుక ప్రచారం చేయడం ఈ రోజు ఫాషన్ అయిపో యింది.

దీనికి కొన్ని ఉదాహరణలు:

– 2019 జనవరి 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు పంజాబ్‌లోని జలందర్‌లో జరిగిన 106 ఇండియన్ సైన్సు కాంగ్రెస్‌లో నాటి ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ జి నాగేశ్వరరావు చేసిన ఉపన్యాసం. కౌరవులు టెస్ట్ ట్యూబ్ టెక్నాలజీ వల్ల జన్మించారనీ, విష్ణుమూర్తి విసిరే విష్ణుచక్రం గైడెడ్ క్షిపణి అనీ, లంకలో రావణుడి దగ్గర 24 రకాల విమానాలు, విమానాశ్రయాలుండేవనీ ఆయన అనర్గళంగా చెప్పుకు పోయారు.

– ప్రధాని 2015లో ముంబయిలో జరిగిన వైద్యనిపుణుల సదస్సులో మాట్లాడుతూ వినాయకుడు ప్లాస్టిక్ సర్జరీ చేయడం వల్ల అలా ఏర్పడ్డాడనీ, మహాభారతంలో కర్ణుడు జనిటిక్ ఇంజినీరింగ్ వల్ల పుట్టాడనీ చెప్పారు.

– కేంద్ర విద్యాశాఖ మంత్రి సత్యపాల్ "డార్విన్ పరిణామ వాదం తప్పు. నరవానరం మనిషిగా మారడాన్ని ఎవరూ చూడలేదు" అని సెలవిచ్చారు.

– కేంద్ర మంత్రి ('ఆయుష్' శాఖ) శ్రీపాద్ నాయక్ 2016లో బెంగళూరులోని స్వామి వివేకానంద యోగా అనుసంధన సంస్థాన్‌లో ఒక రకమైన యోగా చేస్తే క్యాన్సర్ తగ్గిపోతుందని చెబుతూ దాన్ని తాను నిరూపిస్తానన్నారు.

– హర్‌ద్వార్‌కు చెందిన బిజెపి ఎంపీ లోక్ సభలో మాట్లాడుతూ "లక్షల సంవత్సరాల క్రితమే రుషి కణాదుడు అణు పరీక్ష జరిపాడు" అని చెప్పుకొచ్చారు.

– రాజస్థాన్ బిజెపి విద్యా మంత్రి వాసుదేవ్ దేవ్నాని "ఆవు మాత్రమే ఆక్సిజన్ పీల్చుకుని మళ్లీ ఆక్సిజన్ విడుదల చేస్తుంది" అని ప్రకటించారు.

– కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి రాధా మోహన్ సింగ్ 'యోగా వ్యవసాయం' గురించి 'కనిపెట్ట'గా, కాషాయ 'వ్యవసాయ శాస్త్రవేత్త' సుభాష్ పాలేకర్ ఆవు మూత్రంతో వ్యవసాయం 'కనిపెట్టా'రు.

– హోమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారు ఢిల్లీలో హిందీ దివస్ సభలో మాట్లా డుతూ క్వాంటమ్ ఫిజిక్స్‌లో వార్నర్ హీసెన్ బర్గ్ రూపొందించిన అస్థిరతా సిద్ధాంతం (థియరీ ఆఫ్ అన్‌సెర్టెనిటీ) వేదాలనుండి తస్కరించిందేనన్నారు. రవీంద్రనాథ్ ఠాగోర్‌తో హీసెన్‌బర్గ్ వేదాల గురించి జరిపిన చర్చల సందర్భంగా ఆయన ఈ సూత్రం పసిగట్టే శాడని మంత్రిగారు వెల్లడించారు.

– గుజరాత్‌లో ఏకంగా పురాణాలనే

సైన్సుగా మార్చేసి బోధిస్తున్నారు. భారతీయ సంస్కృతిలోని 'వాస్తవాలు' అనే పేరుతో ప్రతి విద్యార్థి చదవాల్సిన పుస్తకాలను అక్కడి ప్రభుత్వం అచ్చొత్తించింది. అందులో చెప్పిన ఒక 'సైన్సు' సంగతి చూడండి!

"స్టెమ్ సెల్ పరిశోధన తామే చేశామని అమెరికా చెప్పుకుంటోంది. కానీ శరీర భాగాలు పున:సృష్టి చేసే పేటెంట్‌ను డాక్టర్ బాలకృష్ణ గంపత్ మతపుర్కార్ ఇప్పటికే పొంది వున్నారు... నిజానికి ఈ పరిశోధన ఇప్పటిది కాదనీ, దీన్ని మహాభారతం నుండి డాక్టర్ మతపుర్కార్ గ్రహించారనీ వింటే మీరు ఆశ్చర్యపోతారు. కుంతికి సూర్యునిలాంటి వెలుగునిచ్చే కొడుకుండేవాడు. రెండేళ్ల నుండి గర్భం దాల్చని గాంధారికి ఈ విషయం తెలిసింది. ఆమె గర్భవతి అయింది కానీ అబార్షన్ అయింది. ఆమె కడుపునుండి పెద్ద మాంసపు ముద్ద బయటకొచ్చింది. ఇది తెలిసి మహర్షి ద్వైపాయన సహాయం కోరారు. ఆయన ఈ మాంసానికి కొన్ని ఔషధాలు కలిపి చల్లని కుండలో పెట్టాడు. తరువాత ఆ మాంసం ముద్దను తీసి నూరు భాగాలు చేసి, ఒక్కో భాగాన్ని నేతితో నిండిన ఒక్కో కుండలో పెట్టాడు. రెండేళ్ల తరువాత అందులో నూరుగురు కౌరవులు తయారయ్యారు. ఇది చదివిన తరువాత స్టెమ్ సెల్స్ తన పరిశోధన కాదనీ మహాభారత సమయంలోనే వున్నదనీ మతపుర్కార్ తెలుసుకున్నాడు"... గుజరాత్‌లోని బడిపిల్లలచేత బలవంతంగా చదివిస్తున్న తేజోమయ భారత్ పుస్తకం 92-93 పేజీల్లో ఈ విషయం రాశారు.

ప్రధాన మంత్రి, మంత్రులతో సహా అధికార పార్టీ నాయకులు, వారి అంతేవాసులు ప్రచారం చేస్తున్న ఈ విషయాలన్నీ పూర్తిగా అశాస్త్రీయమైనవి. ఎందుకంటే అవి శాస్త్రీయ పరిశోధనా పద్ధతికి నిలవవు. వాటిని ఎక్కడా, ఎవరూ పరిశోధించలేదు. పేరెన్నికగన్న ఏ శాస్త్ర పరిశోధనా గ్రంథంలోనూ ప్రచురించబడలేదు, శాస్త్రీయ సమీక్ష (పీర్ రివ్యూ)కు నిలవలేదు. కేవలం మన పురాణాల్లోనూ, ప్రాచీన గ్రంథాల్లోనూ పేర్కొన్న పదాలను తీసుకువచ్చి, వాటి చుట్టూ కథలు అల్లి సైన్సుగా ప్రచారం చేస్తున్నారు. మంచి గతమున కొంచెమేనోయ్ అని గురజాడవారు చెప్పినట్లు గత కాలంలో జరిగిన శాస్త్రీయ పరిశోధన చాలా కొంచెం మాత్రమే. సమాజ గమనంలో ఫ్యూడల్ సమాజ గర్భం నుండి పెట్టుబడిదారీ సమాజం తొలుత ముందుకు వచ్చిన యూరప్‌లో ఆధునిక సైన్సు పరిశోధనలు ప్రారంభమైనాయి. అక్కడి నుండి పెట్టుబడిదారీ సమాజం వ్యాపించినంత వరకు ప్రపంచ వ్యాపితంగా సైన్సు విస్తరించింది.

**❝ మన రాజ్యాంగం లౌకికత్వ పునాదిపై నిర్మితమైంది. శాస్త్రీయ దృక్పథం, హేతువాద ఆలోచనా విధానం ప్రజల ప్రాథమిక విధి అని రాజ్యాంగాలో పేర్కొనబడింది. కానీ నేడు ఆ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన భావజాలాన్ని పాలక వర్గాలు పెంచి పోషిస్తున్నాయి. అదే సమయంలో ఇటువంటి హేతువిరుద్ధ ప్రచా రాలను ఎదుర్కొనే గొంతులు సమాజంలో రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. ❞**



**1949 జనవరి 3న లక్నోలో భారత సైన్సు కాంగ్రెస్ సభను ప్రారంభిస్తున్న నాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ**

ఈ ఆధునిక సైన్సును, శాస్త్రీయ దృక్పథాన్ని అందిపుచ్చుకుని మన సమాజాన్ని అందంగానూ, సౌకర్యవంతంగానూ తీర్చిదిద్దుకోవలసింది పోయి మళ్లీ సమాజాన్ని వెనక్కు నడిపించడానికి చీకటి శక్తులు ప్రయత్నిస్తున్నాయి. ప్రతి ఆధునిక ఆవిష్కరణా ప్రాచీన గ్రంథాల్లో ఉన్నట్లూ, అందువల్ల మన దేశంలో ఏనాడో దాన్ని కనిపెట్టేసినట్లూ ప్రచారం చేస్తూ ప్రజల దృష్టిని శాస్త్రీయ, హేతువాద భావాల నుండి అశాస్త్రీయ మూఢభావాలవైపు నడపడానికి ప్రయత్నిస్తున్నారు.

మితవాద ప్రభుత్వాలూ, వాటి నిధులు మెక్కుతున్న ప్రచారకర్తలు ఈ విధంగా అశాస్త్రీయ భావాల ప్రచారంలో తరించి పోతుంటే మరోవైపు సమాజంలో మనుషుల స్వయం శక్తిపై నమ్మకాన్ని వమ్ముచేసే కర్మకాండలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. యజ్ఞాలు యాగాలు, స్వాములు బాబాలు, తాయత్తులు అంత్రాలు, శకునాలు జ్యోతిష్యాలు...ఇవన్నీ రానురాను చదువుకున్న వారిలో కూడా అధికమవుతున్నాయి.

మన రాజ్యాంగం లౌకికత్వ పునాదిపై నిర్మితమైంది. శాస్త్రీయ దృక్పథం, హేతువాద ఆలోచనా విధానం ప్రజల ప్రాథమిక విధి అని రాజ్యాంగాలో పేర్కొనబడింది. కానీ నేడు ఆ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన భావజాలాన్ని పాలక వర్గాలు పెంచి పోషిస్తున్నాయి. అదే సమయంలో ఇటువంటి హేతువిరుద్ధ ప్రచారాలను ఎదుర్కొనే గొంతులు సమాజంలో రోజురోజుకూ తగ్గిపోతున్నాయి.

మన పత్రికల్లో పేజీలకు పేజీలను రాశిఫలాలు, స్థలపురాణాలు, ఇతర అశాస్త్రీయ భావాలు, మూఢనమ్మకాల వ్యాప్తికి కేటాయిస్తారు. కానీ శాస్త్రీయ దృక్పథం, హేతువాద భావాల ప్రచారానికి ఒక్క కాలమ్ కూడా ఉండదు. టీవీల్లో పొద్దున్న లేస్తే అన్ని ఛానళ్లలోనూ అదే ప్రచారం. భక్తి, ఆధ్యాత్మికత పేరుతో ఆయా మతాలు ప్రత్యేక ఛానళ్లనే ఏర్పాటు చేసుకున్నాయి. చివరికి సరుకుల అడ్వర్టయిజ్‌మెంట్లు

> **“ హేతువిరుద్ధ మితవాద భావజాలం, మతోన్మాదం, జాతి, వర్ణ ఆధిక్యతల ప్రచారం మన దేశంలోనే కాదు అనేక దేశాల్లో నేడు ప్రబలి పోతోంది. యూరప్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో పెరుగుతున్న నయా- ఫాసిస్టు శక్తులు ప్రజలను జాతి, వర్ణం పేరుతో వేరుచేయడానికి ప్రయత్నిస్తున్నాయి. వలస ప్రజలకు వ్యతిరేకంగా అనేక అసంగత ప్రచారాలు గావిస్తున్నాయి. తమ విద్వేష ప్రచారాలను బలపరుచుకోడానికి అనేక రకాల హేతువిరుద్ధ సిద్ధాంతాలను ముందుకు తెస్తు న్నాయి. తెల్లజాతి ఆధిక్యతా వాదం అందులో ఒకటి. ”**

చేసుకోడానికి కూడా మూఢనమ్మకాలను ఉపయోగించుకుంటున్నారు. కానీ ఏ ఛానల్ కూడా ఈ హేతువిరుద్ధ ప్రచారాలను పూర్వ పక్షం గావించేందుకు రోజూ కొంత సమయం కూడా కేటాయించదు.

**అన్ని దేశాల్లో ఇదే ధోరణి కనిపిస్తోంది**

హేతువిరుద్ధ మితవాద భావజాలం, మతోన్మాదం, జాతి, వర్ణ ఆధిక్యతల ప్రచారం మన దేశంలోనే కాదు అనేక దేశాల్లో నేడు ప్రబలి పోతోంది. యూరప్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో పెరుగుతున్న నయా- ఫాసిస్టు శక్తులు ప్రజలను జాతి, వర్ణం పేరుతో వేరుచేయడానికి ప్రయత్నిస్తున్నాయి. వలస ప్రజలకు వ్యతిరేకంగా అనేక అసంగత ప్రచారాలు గావిస్తున్నాయి. తమ విద్వేష ప్రచారాలను బలపరుచుకోడానికి అనేక రకాల హేతువిరుద్ధ సిద్ధాంతాలను ముందుకు తెస్తున్నాయి. తెల్లజాతి ఆధిక్యతా వాదం అందులో ఒకటి. దేవుడు మనుషులను సమానంగా పుట్టించలేదనీ, తెల్లజాతీయులను పాలించడానికీ, నల్లజాతివారు, ఇతర రంగుల వాళ్లను పాలించబడడానికీ పుట్టించారనే ప్రచారం ఇందులో ఒకటి. ఇది మన దేశంలో మనుధర్మ శాస్త్రాన్ని పోలి లేదూ? అందుకనే వీళ్లు డార్విన్ పరిణామ వాదాన్ని కూడా నమ్మరు. నమ్మకపోతే సరే శాస్త్రీయంగా నిరూపితమైన ఈ వాదం బైబిల్‌లో చెప్పిన సృష్టి వాదానికి వ్యతిరేకం గనుక పరిణామ వాదాన్ని పాఠశాలల్లో బోధించకూడదని అమెరికాలోని అనేక రాష్ట్రాల్లో మితవాదులు డిమాండ్ చేయడంతో అనేక పాఠశాలల్లో పరిణామ వాదాన్ని బోధించడం ఆపేశారు. మరికొన్ని చోట్ల పరిణామ వాదం, సృష్టి వాదం రెంటినీ సమానంగా బోధించాలని తీర్మానాలు చేశారు. మితవాద భావజాలం పెరిగిన అన్ని ప్రాంతాల్లోనూ ఈ విధంగా విజ్ఞాన శాస్త్రంపైనా, శాస్త్రీయ దృక్పథం పైనా దాడులు జరుగుతూనే ఉన్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల్లో శాస్త్రీయ భావాలను పెంపొందిచడానికి చేసే కృషి అనేక సవాళ్లను అధిగమించాల్సి ఉంది. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో సైన్సు పేరుతో అనేక అశాస్త్రీయ, మూఢ భావాలను, నమ్మకాలను ప్రచారం చేస్తున్నారు. వీటిని పూర్వ పక్షం చేయాల్సిన అవసరం ఉంది.

**మూఢ నమ్మకాలు**

మూఢ నమ్మకాలు ప్రధానంగా రెండు రకాలు:

మొదటి రకం, పూర్తిగా విజ్ఞాన శాస్త్రానికి విరుద్ధమైన మూఢ విశ్వాసాలు. ఉదాహరణకు శకునాలు, వాస్తు, చిల్లంగి, తాయెత్తులు వగైరా. వాటిని ఎదుర్కోవడం ఒక ఎత్తు.

రెండో రకం, మనం ఎదుర్కొనడం కూడా కష్టతరమైనవి. ఇవి విజ్ఞాన శాస్త్రం ముసుగులో చెలామణి అవుతుంటాయి.

కొన్నాళ్ల క్రితం ఆయిల్ పుల్లింగ్ చేస్తే అన్ని రోగాలు నయమవుతాయన్నారు. చాలా మంది మధ్య తరగతి ప్రజలు నిజమని నమ్మారు. దానికి శాస్త్రీయ ఆధారం ఉందా లేదా అని చూడలేదు. రోజుకు ఎనిమిది లీటర్ల మంచినీరు తాగితే రోగాలు పోతాయన్నారు. దానికీ శాస్త్రీయ ఆధారం ఉందా లేదా అని చూడలేదు. భోజనంలో ఆయిల్ ఉండకూడదన్నారు, తరువాత మరొకరు ఆయిల్ తాగమన్నారు. మాంసాహారం అతిగా తింటే ఆరోగ్యానికి హాని అన్నారు. తరువాత పూర్తిగా మాంసం తింటే మంచిదని చెప్పారు. వీటన్నిటికీ ఎక్కడ పరిశోధన చేశారు. ఏ పరిశోధన ఏం చెప్పింది అన్న దాంతో నిమిత్తం లేకుండా వాటిని నమ్మడానికి కారణం సమాజంలో శాస్త్రీయ ఆలోచనా ధోరణి, ప్రశ్నించే తత్వం లోపించడమే.

అశాస్త్రీయ పునాది మీద నిర్మించబడిన సమాజం తిరోగమనంలో పయనిస్తూ చివరికి విచ్ఛిన్నం అవుతుంది. భారతీయ సమాజానికి ఇటువంటి ప్రమాదం రాకుండా నివారించాలంటే ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ఎంతైనా అవసరం.

**పర్యావరణం**

భూ తాపం ఎందుకొస్తున్నది? అందరూ భూ తాపాన్ని తగ్గించాలంటున్నారు. కానీ అడ్డుపడుతున్నదేమిటి? లాభాలే ధ్యేయంగా పనిచేసే కార్పొరేట్ వ్యాపార విధానం. 2030 నాటికి భూమి సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెలిసియస్ కన్నా పెరిగితే వాతారణ మార్పులు మన అదుపులో లేకుండా పోతాయని ప్రపంచ శాస్త్రవేత్తలంతా ముక్త కంఠంతో చెబుతున్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లాంటి మూర్ఖులు దీన్ని నమ్మడం లేదు. చాలా మంది దేశాధి నేతలు నమ్మినా భూతాపాన్ని తగ్గించడానికి కొంచెం కూడా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్ని మాటలు చెప్పినప్పటికీ రోజురోజుకీ రోడ్లమీదకు వచ్చే వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నది. పరిమితమైన శిలాజ ఇంధనాలు ముఖ్యంగా బొగ్గును మండించడం పెరిగిపోతునే ఉన్నది,

దీనికి అడ్డుకట్ట వేయకపోతే మొత్తం మానవాళి మనుగడే ప్రమాదంలో పడిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయినా పాలకులు కళ్లు తెరవడం లేదు ఎందుకు? వ్యక్తిగత రవాణాను నియంత్రించి ప్రజా రవాణను ప్రోత్సహించడం లేదు ఎందుకు? బొగ్గుతో నడిచే విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలను నివారించి, సౌర విద్యుత్తు, పవన విద్యుత్తు వంటి వాటిని ప్రోత్సహించడం లేదు ఎందుకు? ఏ దేశ నాయకుడు చూసినా, ఏ సమావేశంలో చూసినా పర్యావరణ పరిరక్షణ చర్యల గురించి వాగాడంబరం ఒలకబోస్తూ ఉంటారు. కానీ వాస్తవ సంఖ్యలు చూస్తే శిలాజ ఇంధనాల వినియోగం ఇంకా ఇంకా పెరిగిపోతూనే ఉన్నది. భూతాపం ప్రమాదకర స్థాయికి చేరుకుంటూనే ఉన్నది. ఇప్పటికే ధృవాల్లో కరిగిపోతున్న మంచు ఖండాలు, హిమనీనదాలు సముద్ర నీటి మట్టం పెరుగుదలను సూచిస్తున్నాయి. తీవ్రమైన వరదలు, అతి తీవ్రమైన ఎండలు, దావానలాలు, తీవ్రమైన వరదలు మరోవైపు కనీ విని ఎరుగని దుర్భిక్షాలు మనకు ప్రమాద ఘంటికలను వినిపిస్తూనే ఉన్నాయి. అయినా గొప్ప తెలివి తేటలు గడించిన మన సమాజం ఎందుకు తగినంతగా స్పందించలేకపోతున్నది?

మనిషికి అవసరమైన ఒక వస్తువును అతను ఉన్న చోటనే తయారుచేసుకోగల సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ కార్పొరేట్ ఉత్పత్తిదారులు గరిష్ట లాభాల కోసం వివిధ దేశాల్లో

వివిధ భాగాలు తయారు చేసి మరో దేశంలో విడిభాగాలు కూర్చి వస్తువు తయారు చేసి ప్రపంచంలోని అన్ని దేశాల్లో అమ్ము తున్నారు. ఈ రకమైన ఉత్పత్తి విధానం కార్పొరేట్లకు లాభాలు చేకూర్చవచ్చు కానీ పర్యావరణాన్ని తొందరగా నాశనం చేస్తున్నది. ఒక వస్తువును పదిసార్లు ఉపయోగించే చోట ఒక్కసారి ఉపయోగించి పారవేసే వినిమయ దారీ విధానం అమలులోకి వచ్చిన తరువాత శిలాజ ఇంధన వినియోగం విపరీతంగా పెరిగి పోయింది. యూరప్‌లో టిన్నులో నిల్వచేసే చేపముక్క, దాన్ని తినే ముందు భూ గోళాన్ని పది సార్లు తిరుగి వస్తోందంటే ఆశ్చర్యం వేస్తుంది. వినిమయమే అభివృద్ధిగా చూసే వ్యవస్థ స్థానంలో ప్రకృతితో మమేకమయ్యే సుస్థిరాభివృద్ధి విధానం వచ్చినప్పుడే భూగోళం రక్షించబడుతుంది.

ఈ విషయాల మీద శాస్త్రీయ ప్రచారం ఏదీ? ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలు చాలా వరకు కార్పొరేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లి పోయి ఇటువంటి సామాజిక చైతన్య కృషి పట్ల ఆసక్తి కోల్పోయాయి. కానీ రోజురోజుకూ విస్తరిస్తున్న సోషల్ మీడియాలో శాస్త్రీయ ఆలోచనల ప్రచారానికి ఇంకా స్పేస్ ఉంది. దాన్ని ఉపయోగించుకుని ప్రజల్లో శాస్త్రీయ ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

“అదృష్టమేమిటంటే ప్రజల్లో ముఖ్యం గా యువతలో ఇప్పటికీ శాస్త్రీ ఆలోచనా విధానం పట్ల, పర్యావరణ పరిరక్షణ పట్ల ఆశక్తి, అనురక్తి ఉంది. దాన్ని సరైన మార్గంలో పెట్టే వేదికలను సృష్టించడం ఈరోజు అత్యవసరం. ప్రభుత్వమూ, కార్పొరేట్ మీడియా నుండి ప్రతికూలతలను ఎదుర్కొంటూనే శాస్త్రీయ దృక్పథం ప్రచారానికి, పర్యావరణ పరిరక్షణకూ పనిచేస్తున్న సంస్థలు చాలా ఉన్నాయి. వ్యక్తు లుగా కూడా చాలా మంది కృషి చేస్తున్నారు. వీటి కృషి ఇబ్బిడిముబ్బిడిగా పెరగాల్సిన అవస రం ఉంది.”




గుజరాత్ కొత్త పాఠ్య పుస్తకాల్లో 'మహా భారతంలో స్టెమ్‌సెల్స్', 'వేద సత్యాలు, భారత సంస్కృతి', 'వేదాల్లో కార్లు' వంటి అనేక అశాస్త్రీయ పాఠ్యాంశాలను చేర్చారు

**యుద్ధం**

మానవుని ఉమ్మడి సంపద అయిన వాతావరణాన్ని అహేతుకంగా నాశనం చేస్తూ భూగోళానికి చేటు తెచ్చుకుంటున్న వైనం ఒకవైపు కాగా అతి విలువైన వనరులను (భౌతిక వనరులు, మానవ వనరులు) మానవాళి ఉపయోగినికి కాకుండా వారిని అంతం చేసే ఆయుధాలకోసం, యుద్ధాల కోసం ఖర్చు చేయడం మరింత అశాస్త్రీయమైన విషయం. ఇప్పటికే అగ్రరాజ్యాల వద్ద ఈ భూగోళాన్ని వందల సార్లు భస్మీపటలం చేసే సామర్థ్యం గల అణ్వాయుధాలు పోగుపడి ఉండాగా ఇంకా మరిన్ని దేశాలు ఇంకా కొత్త కొత్త ఆయుధాలను, అణ్వాయుధాలను, వాటిని ఇతర దేశాలపై ప్రయోగించే వాహకాలనూ తయారు చేసుకుంటూ పోతున్నాయి. ప్రశ్నన్న యుద్ధం తరువాత నేడు అణ్వాయుధాలను ఉపయోగించే ప్రమాదం ఏనాటి కన్నా ఎక్కువైందని ఐక్యరాజ్య సమితికి చెందిన నిరాయుధీకరణ వ్యవహారాల అధిపతి ఇజుమి నకమిత్సు చెప్పారు.

మొత్తం మీద చూసినప్పుడు రాజకీయంగా మితవాదం, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న వినిమయదారీ వాదం, యుద్ధాలకు కారణమవుతున్న ఆయుధాల తయారీ, వ్యాపారాలను వ్యతిరేకించాలి. వాటికి వ్యతిరేకంగా ప్రచారం చేయాలి. హేతుబద్ధమైన జీవన విధానం కోసం కృషి చేయాలి.

**శాస్త్రీయ ప్రచారానికి విద్యాసంస్థలు మంచి వేదికలు**

అదృష్టమేమిటంటే ప్రజల్లో ముఖ్యం గా యువతలో ఇప్పటికీ శాస్త్రీ ఆలోచనా విధానం పట్ల, పర్యావరణ పరిరక్షణ పట్ల ఆశక్తి, అనురక్తి ఉంది. దాన్ని సరైన మార్గంలో పెట్టే వేదికలను సృష్టించడం ఈరోజు అత్యవసరం. ప్రభుత్వమూ, కార్పొరేట్ మీడియా నుండి ప్రతికూలతలను ఎదుర్కొంటూనే శాస్త్రీయ దృక్పథం ప్రచారానికి, పర్యావరణ పరిరక్షణకూ పనిచేస్తున్న సంస్థలు చాలా ఉన్నాయి. వ్యక్తులుగా కూడా చాలా మంది కృషి చేస్తున్నారు. వీటి కృషి ఇబ్బిడిముబ్బిడిగా పెరగాల్సిన అవసరం ఉంది.

శాస్త్రీయ దృక్పథాన్ని బాల్యం నుండే అలవరచం అవసరం కాబట్టి పాఠశాలలు, కళాశాల్లో సైన్సు క్లబ్బులు, సైన్సు ఎగ్జిబిషన్లు నిర్వహించడం, వాటిలో సైన్సు ప్రయోగాలు చేయడమే కాదు సైన్సుకూ, సమాజానికీ ఉన్న సంబంధంపై చర్చలు నడపాలి. సైన్సు టీచర్లు, సైన్సు పట్ల ఆసక్తి గల విద్యార్థులు దీనికి మంచి వనరులవుతారు.

వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణకు లింకు చేస్తూ ప్రజల్లో చర్చ నడపడమే కాదు ప్రత్యక్ష కార్యాచరణ నిర్వహించే వేదికలు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ఇటువంటి కృషి చేస్తున్న వాటి మధ్య అనుసంధానం చేయాలి. ఉదాహరణకు, మురికి, దోమలు, ప్లాస్టిక్కు, చెత్తపారవేత, బహిరంగ మలమూత్ర విసర్జన వంటి వాటికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం, మొక్కలు నాటడం వంటి కృషి.

సమాజానికి నష్టం కలిగిస్తున్న మూఢ విశ్వాసాలు, అశాస్త్రీయ పద్ధతులకు వ్యతిరేకంగా సదస్సులు, చర్చాగోష్టులు నిర్వహించాలి. మూఢ నమ్మకాలను విజ్ఞాన శాస్త్రాలుగా ప్రచారం చేస్తున్న మిథ్యా–శాస్త్రవేత్తలను పూర్వపక్షం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటిమీద పత్రికల్లో వ్యాసాలు రాయవచ్చు. టివీలో దీనికి చోటు చాలా తక్కువగానే ఉంది. కానీ సోషల్ మీడియాలో దీనిపై విస్తృతంగా ప్రచారం చేయొచ్చు. ❋

మతతత్వం

# ఎవరీ సావర్కర్?

**సుభాష్ గటాడే**



**రచయిత ప్రముఖ పాత్రికేయుడు, వామపక్ష ఉద్యమకారుడు. 'మోడీనామా', 'హిందూత్వ పునరాగమనం' వంటి అనేక పుస్తకాలు రాశారు. వర్తమాన రాజకీయాలపై వ్యాఖ్యానాలు, వ్యాసాలు రాస్తుంటారు.**

హిట్లర్ అభిమానుల జాబితా చాలాపెద్దదే. అందులో చాలా మంది ప్రముఖులు ఉన్నారు.

ఈ చిట్టాలో అగ్రగణ్యుడు వినాయక్ దామోదర్ సావర్కర్ (1883 మే 28–1966 ఫిబ్రవరి 26). సావర్కర్ స్వాతంత్ర పోరాట యోధుడు. ఆ తరువాతి కాలంలో హిందుత్వ సిద్ధాంతకర్తగా మారి, "హిందుత్వ" అనే పుస్తకాన్ని రాశారు (హిందుత్వ ఆలోచనా పరులు తప్పక చదవాలని భావించే పుస్తకం ఇది).

ఈయన 1883 మే 28వ తేదీన ఒక మరాఠీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమం పట్ల ఆకర్షితుడై, అభినవ భారత సమాజాన్ని (యంగ్ ఇండియా) స్థాపించారు. ఇందుకు పాఠశాలలో ఉండగా మజ్జిని స్థాపించిన యంగ్ ఇటలీ నుంచి స్ఫూర్తిని పొందారు. న్యాయ శాస్త్రం చదవడానికి ఇంగ్లాండ్ వెళ్లి, అక్కడ తీవ్రవాద రాజకీయ భావాలు సంతరించుకున్నారు. 1857లో బ్రిటిషర్లుకి వ్యతిరేకంగా జరిగిన ప్రథమ స్వతంత్ర సంగ్రామంతో స్ఫూర్తిని పొంది మరాఠీలో 'ది ఇండియన్ వార్ అఫ్ ఇండిపెండెన్స్ 1857' అనే పుస్తకాన్ని రాశారు. అందులో హిందువులు ముస్లింలు కలిసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన వైనాన్ని వివరించారు. ఆ పుస్తకంలో ఉన్న విస్ఫోట స్వభావాన్ని గమనించి, ప్రభుత్వం దానిని వెంటనే నిషేధించింది. నిషేధించబడినా, ఆ పుస్తకం ప్రజలలో మంచి ఆదరణ పొంది, అనేక ప్రచురణలు వేయాల్సి వచ్చింది. ఆంగ్లంతో సహా అనేక భాషలలో అనువాదం చేయబడింది. 1857లో జరిగిన ఆ తిరుగుబాటు, ఫ్రెంచ్ విప్లవం, అమెరికన్ విప్లవం అంత ప్రభావం కలది అని సావర్కర్ భావించారు. మతాన్ని, దేశాన్ని రక్షించుకోడానికి, 1857లో పడిన ఆ విప్లవ బీజం పవిత్రమైన, స్ఫూర్తిదాయకమైన ఆలోచనలో ఉంది. ఆ ఆలోచనే స్పష్టంగా, బహిరంగంగా ఢిల్లీ గద్దె మీది నుండి బ్రిటిష్ వారిని దించేందుకు ప్రతిపాదించబడిందని సావర్కర్ అభిప్రాయపడ్డారు.

'1857 అమరవీరులకు' అర్పించిన ఈ పుస్తకంలో మంగళ్ పాండే, రాణి ఝాన్సీ లక్ష్మి భాయ్, నానాసాహిబ్, అహేమద్ షా, అజీముల్లాహ్ ఖాన్, తాంతియా టోపీ, బహదూర్ షా జాఫర్, బేగం హజ్రత్ మహల్ ఇంకా చాలామందే ఉన్నారు.

తరువాత సావర్కర్ తన కార్యకలాపాల ద్వారా లండన్ లోను, ఆ తరువాత భారతదేశం లోను ప్రజలను రెచ్చగొడుతున్నందుకు లండన్‌లో ఖైదు చేయబడ్డారు. ఆ తరువాత ఈ నేరానికి గాను రెండేళ్ల కఠిన కారాగార శిక్ష ఎదుర్కొన్నారు. అండమాన్ సెల్యులర్ జైలుకు తరలించబడ్డారు. అక్కడున్న కఠిన జీవితానికి – ఇతర ఖైదీలు వాటిని ఎటువంటి రాజీ లేకుండా ఎదుర్కొన్నారు – సావర్కర్ ఆత్మ గాయపడింది. అందువలనే వెంటనే విడుదల చేయవలసిందిగా బ్రిటిష్ ప్రభుత్వానికి పిటిషన్ పెట్టుకున్నారు. ఏ.జి. నూరాని రాసిన సావర్కర్ అండ్ హిందుత్వలో దీనికి సంబంధించిన వివరాలు ఉన్నాయి.

ఇంతటి ఉన్నత స్థాయి కల నాయకుడు, తన నాయకత్వం ద్వారా ఎందరో యువకులను దేశవ్యాప్తంగా ఉత్తేజపరచిన వాడు, శిక్షలో భాగంగా అండమాన్ జైలులో జీవిత ఖైదు గడపడానికి పంపబడిన వెంటనే, క్షమించమని ప్రార్థిస్తూ, మన్నింపు కోరుతూ ఉత్తరాలు రాయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అఖిల భారత డిఫెన్స్ కమిటీ సావర్కార్ని విడుదల చేయాలని డిమాండ్ చేయడాన్ని గాని, కాంగ్రెస్ పార్టీ, బ్రిటిష్ పాలకులను అతనిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేయడాన్ని గాని సావర్కర్ ఏమాత్రం పట్టించుకోలేదు. ఆర్‌సి మజుందార్ రాసిన' పీనల్ సెటిల్మెంట్ ఇన్ అండమాన్స్ 'అనే పుస్తకంలో సావర్కర్ అండమాన్ జైలులో పరిస్థితులకు ఎంతగా కదిలిపోయారో, తనకు పడిన జైలు శిక్షతో నైతికంగా ఎంత పతనమయ్యారో వివరంగా రాశారు. అందుకనే, తనని విడుదల చేస్తే అందుకు బదులుగా ప్రభుత్వం ఏ పని, ఎక్కడ చేయమన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు వాగ్దానం చేశారు.

చాలా రోజుల తరువాత బ్రిటిష్ ప్రభుత్వం సావర్కర్ ఉత్తరానికి స్పందించి, అతనిని ఇంటికి పంపించింది. ఏ రకమైన రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని షరతు పెట్టి చివరికి 1930ల చివరిలో జరిగే ప్రావిన్షియల్ ఎన్నికల సందర్భంగా విడుదల చేసింది. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వం ముంబై ప్రొవిన్స్‌కి ఎన్నికయింది.

అతని జీవితంలోని రెండు దశలను మనం చూడగలం. మొదటి దశ, అండమాన్ జైలుకి వెళ్ళకముందుది – హిందూ ముస్లిం ఐక్యత గురించి చెప్పిన దశ. రెండో దశ – హిందువుల ఐక్యతను నొక్కి చెపుతూ హిందూ జాతి సిద్ధాంతం ప్రతిపాదించిన దశ.

అతనిలోని ఈమార్పు ఎంత సంపూర్ణమైనదంటే, హిందుత్వ ఉద్యమ సిద్ధాంతానికి ఆద్యుడిగా గుర్తించబడ్డారు.

ఈ హిందుత్వ సిద్ధాంతంలోని ప్రధాన అంశం, హిందుత్వ అనే ప్రత్యేకమైన భావనను హిందూ మతానికి బదులుగా మాత్రమే వాడలేదు. 1923లో తొలిసారిగా ప్రచురించబడిన 'హిందుత్వ : హిందువు ఎవరు?' అనే వ్యాస ప్రచురణకర్త తన రెండో ప్రచురణలో, సావర్కర్ మరాఠా పేరుతో 'చారిత్రిక పార్శ్వము నుంచి', వైదిక కాలం నాటి నుంచి హిందూ జాతి మతం, రాజకీయాల పురోగతి జాడలు కనుగొన్నారు. "హిందూయిజం అన్నది హిందుత్వ నుండి ఉత్పన్నమైనదనేది అందులో ఒక భాగం మాత్రమే. హిందుత్వకి హిందూయిజానికి మధ్య తేడా తెలుసుకోవడంలో విఫలమవడం వలన ఈ అసమాన సంస్కృతికి వారసత్వంగా వచ్చిన హిందూయిజానికి సంబంధించిన

అనేక జాతుల మధ్య అనుమానాలు, అపోహలు ఏర్పడుతున్నాయి. హిందుత్వం అంటే అస్పష్టంగా నిర్వచించబడిన హిందూయిజం కాదు అన్న విషయం గమనించవలసిన ప్రధానమైన అంశం. ఏదైనా ఒక ఇజం సాధారణంగా ఒక సిద్ధాంతానికి, నైతిక సూత్రాలకి, దాదాపుగా ఒక ఆధ్యాత్మిక చింతనకి, మతబోధనకి సంబంధించినది. కానీ హిందుత్వ ప్రాథమికంగా అలా కాదు. ఇది ఏ రకమైనా మత ప్రచారానికి, బోధనకు సంబంధించినది కాదు. మన భాషలో గనక హిందునెస్ అని ఉండి ఉంటే బహుశా ఆ పదం హిందూత్వకు మరికాస్త దగ్గరిగా ఉండేదేమో.”

హెగ్డేవార్ తక్కిన నలుగురితో కలిసి ఆర్ఎస్ఎస్ స్థాపించడానికి ముందు సావర్కర్‌ని కలుసుకుని ఆయన సలహాలు తీసుకున్నారన్న విషయం మనకు తెలుసు.

**2**

మళ్లీ హిట్లర్ దగ్గరికి వస్తే, ఆనాడు హిట్లర్ చేసిన దాష్టీకాలు తెలియని వారు లేరు. అయినా సావర్కర్ హిట్లరుని తెగ పొగిడారు. ఉదాహరణకి హిట్లర్ యూదులను శిక్షించడాన్ని సంపూర్ణంగా సమర్ధించారు. “జర్మనీ నాజీయిజాన్ని, ఇటలీ ఫాసిజాన్ని అమలుచేసే హక్కు వారికి ఉంది. ఆనాటి వారి దేశ కాల పరిస్థితులకు ఆ విధానాల అమలు తప్పనిసరి.” అలాగే 1940 లో (రెండో ప్రపంచ యుద్ధం తరువాత) ఒక ప్రసంగంలో “హిట్లర్ ఫాసిజాన్ని అమలు చేస్తున్నాడు కాబట్టి పిశాచమని, చర్చిల్ ప్రజాస్వామ్యాన్ని అమలుచేస్తున్నాడు కాబట్టి దేవుడని అనలేం. ఆనాడు జర్మనీ ఉన్న పరిస్థితులలో నాజీయిజం తప్పనిసరి” అన్నారు. హిట్లర్ అంటే అతనికెంత అభిమానం అంటే, హిట్లర్‌ని నెహ్రూ వ్యతిరేకించడాన్ని ఎద్దేవా చేస్తూ బహిరంగ సవాల్ విసిరారు.

అతనో “బలమైన అభివృద్ధి చెందిన భారతదేశాన్ని ఊహించుకున్నారని” ప్రధాని అన్నారు.

మోడీ సావర్కర్ పట్ల వ్యక్తపరిచిన అభిప్రాయాలతో ఏకీభవించిన వారు కొందరే అయితే, అతనిని ధీశాలి అని, దేశభక్తుడని కొనియాడటంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఒకరు తన ట్విటర్ హేండిల్‌లో “అయ్యా, మన తోటి పౌరులకు మీరు తప్పుడు చరిత్రను బోధించకండి. మీరు ప్రధాని స్థానంలో ఉన్నారు. ఆర్ఎస్ఎస్ అధిష్టానంగా కాదు.” అని ట్విట్ చేశారు. మోడీకే కాదు ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని మితవాద హిందుత్వ వాదులకి కూడా ఇందుకు అభ్యంతరం లేదు. మోడీ, తాను ప్రమాణ స్వీకారం చేసిన సంవత్సరంలోనే వచ్చిన సావర్కర్ జన్మదిన సందర్భంగా “సావర్కర్ మాతృభూమి పునర్నిర్మాణం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని” పొగిడారు.

> **“నిజానికి ఆనాడు ఆయన భారతదేశం అనుసరించవలసిన విధానాలను అధ్యయనం చేస్తున్నారు. జర్మనీలో హిట్లర్ యూదులను హింసించినట్టే భారతదేశంలో ముస్లింలను హింసించవచ్చనేది ఆయన భావన. ఒకసారి హిందూ మహాసభ చరిత్ర చూసినట్లయితే జాతి ప్రక్షాళన చేయడం అవసరమని, జర్మనీలో జరిగినదే భారతదేశంలో కూడా జరగాలని సావర్కర్ కోరుకుంటున్నట్టు అర్థం అవుతుంది.”**



వీడి సావర్కర్

అందుకే వాస్తవాలు తెలుసుకోవలసిన సమయం ఆసన్నమయింది. నిజంగానే లౌకిక జాతీయవాదులు సావర్కర్ పై నీలాపనిందలు వేశారా? అతని పై బురద జల్లే ప్రయత్నాలు చేశారా?

అదే నిజమైతే, సావర్కర్ ధైర్యాన్ని, దేశభక్తిని నిరూపించడానికి ముప్పై ఏళ్ళు ఎందుకు పట్టినట్టు? ఈ రోజు గర్వపడుతున్నట్టు చెప్పుకుంటున్న వారసత్వానికి వాళ్ళు ఏరికోరి దూరంగా ఉన్నట్టు రుజువు చేయగల అనేక సాక్ష్యాధారాలు ఉన్నాయి. ఉదాహరణకి, 19 90ల చివరిలో శివసేన బిజెపి కలిసి మహా రాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. కానీ ఏనాడూ సావర్కర్ చిత్ర పటాన్ని అసెంబ్లీలో ఆవిష్కరించుకోవాలనుకోలేదు. సూక్ష్మంగా పరిశీలించే వారెవరికైనా బిజెపి, ఎన్‌డిఏ ఉమ్మడి పాలనా కాలంలో (1998-2004) సావర్కార్ని కనుగొనడం (లేదా తిరిగి కనుగొనడం అనాలి) జరిగిందని అర్థం అవుతుంది.

ఒకసారి గతాన్ని పునఃశ్చరణ చేసుకుంటే, ఒకటిన్నర దశాబ్దానికి ముందు వాజ్‌పాయ్ నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం కూలిపోయింది. ఆ స్థానంలో యుపిఏ, అధికారంలోకి వచ్చింది. “ఆనాడు పోర్ట్ బ్లెయిర్ జైలులో ఉన్న సావర్కర్ స్మారక చిహ్న ఫలకాన్ని తొలగించినప్పుడు ఎటువంటి ఆసక్తి చూపని వారికి ఈ రోజు ఉన్నట్టుండి ఇంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందని” సావర్కర్ అన్న కొడుకు ఒక జాతీయ పత్రికకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశ్నించారు.

“సెల్లులార్ జైలు నుండి తన పిన తండ్రి ఉటంకింపులు తొలగిస్తున్నా బిజెపి పట్టించుకోలేదని” మండిపడ్డారు. ఆనాడు అండమాన్ నికోబార్ దీవుల గవర్నర్‌గా ఉన్న రామ్ కాప్సే గాని, మాజీ పార్లమెంటు సభ్యుడు రామ్ నాయక్ గాని (ఇద్దరూ బిజెపి కార్యకర్తలే) నోరుమెదపలేదు. “బిజెపికి సావర్కర్ పట్ల ఆసక్తి లేకపోవడానికి ఆశ్చర్య పోనక్కరలేదు. బిజెపి గాని, ఆర్ఎస్ఎస్ గాని సావర్కర్ తాత్విక చింతనను అభినందించలేదు. బిజెపి సావర్కర్ పట్ల చూపే ప్రేమ కేవలం కంటి తుడుపు. మహారాష్ట్ర ఓటర్లను ఆకర్షించడానికి తీసుకునే చర్య.”

ఆర్ఎస్ఎస్, హెగ్డేవార్, గురుజీలను వారి జీవితకాలంలో శిక్షించి, ఇప్పుడు కీర్తిస్తున్నది. తమ సామాజిక, రాజకీయ జీవితాలను ఆర్ఎస్ఎస్ - హిందూ సంస్థల పురుషులు, మహిళలు లేదా హిందుత్వ వాదులతో ప్రారంభించినవారు గుర్తుంచు కోవాలి అన్న విషయం హిందూమితవాద అభిమానిగా పేరుపొందిన ఆండర్సన్, దంలేలు, డివి కెల్కర్, ‘ఎకనామిక్ వీక్లి’లో, వి.డి.సావర్కర్ రాసిన ఒక ఉటంకింపు- “ఏ ఆర్ఎస్ఎస్ కార్యకర్త కయినా - పుట్టాడు, ఆర్ఎస్ఎస్‌లో చేరాడు, ఏమి సాధించకుండానే చనిపోయాడు” అనే పేరు మాత్రమే మిగులుతుంది.

హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్ మార్గాలు భిన్నమైనవని ఏమాత్రం సూక్ష్మంగా పరిశీలించిన వారికైనా అర్థం అవుతుంది. రెండు సంస్థల ప్రాధాన్యతలు వేరు. సావర్కర్

> **" స్వాతంత్ర పోరాటం ముమ్మరంగా కొనసాగుతున్న కాలం లో బిజెపి మనుగడలోకి వచ్చినా స్వాతంత్రపోరాటానికి దూరంగా ఉండాలని భావించిందన్న విషయం అందరికీ తెలి సిందే. ఆర్ఎస్ ఎస్ ఆవిర్భవించిన తరువాత, స్వాతంత్రం రావడానికి ముందున్న ఇరవై ఏళ్ల పైచిలుకులో ఒక్కసారి కూడా బ్రిటిషు వారికి వ్యతిరేకంగా ఒక్క పిలుపు కూడా ఇవ్వలేదు. అంతేకాదు స్వాతంత్ర పోరాటంలో పాల్గోవాలనుకున్న వారిని శిక్షించింది కూడా. "**

జైలు నుండి విడుదల అయిన తరువాత హిందూ మహాసభ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. హిందూ మహాసభను కాంగ్రెస్‌ను వ్యతిరేకించే ఒక రాజకీయ పార్టీగా తీర్చిదిద్దాలని సావర్కర్ కోరిక అని దాంలే, ఆండర్సన్‌లు రాశారు. హెగ్డేవార్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఏ రకమైన రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనకూడదని అప్పటికే నిర్ణయించారు. గోల్వాల్కర్ గాని హెగ్డేవార్ గాని ఆర్ఎస్ఎస్‌ని కాంగ్రెస్‌కి వ్యతిరే కంగా ఎక్కడా నిలపాలనుకోలేదు. అందువలన హిందువులను ఐక్యం చేసే ఉద్యమంలో ఇద్దరికీ ఒకరిపట్ల ఒకరికి కొన్ని భయాలు ఉన్నాయి. రెండు సంస్థల మధ్య ఉన్న పొరపొచ్చాలు 1940లో సావర్కర్ ఆఫీస్ నుండి వచ్చిన ఒక లేఖలో తెలుస్తాయి. "ఏ ప్రాంతంలో అయినా హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్ విభాగాల సమావేశాలు జరుగుతుంటే, ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభకి వ్యతిరేకంగానే ఎక్కువ ప్రచారంచేస్తున్నది. అటువంటప్పుడు హిందూ మహాసభ నుండి ఆర్ఎస్ఎస్ వారు వైదొలగాలి తమ సొంత హిందూ మహాసభ స్వయం సేవకులను తయారు చేసుకోవాలి."

ఈ 'భిన్నమైన వీరుడి' దేశభక్తి ఆనాడు ఆర్ఎస్ఎస్ కంటికి కనపడలేదు. సావర్కర్ ఒంటరిగా కన్నుమూశారు. ఆనాడు ఉచ్ఛ దశలో ఉన్న ఆర్ఎస్ఎస్ సావర్కర్ నుండి దూరంగా ఉండటానికి ప్రత్యేకమైన కృషి చేసింది. వారసత్వం గురించి మాట్లాడిన వారు లేరు.

**3**

"బ్రిటిష్ వారిని తరిమేయాలన్న స్ఫూర్తితో స్వతంత్రం కొరకు చాలామంది కృషి చేశారు. బ్రిటిష్ వారు వెళ్ళిపోయిన తరువాత ఆ ఉత్సాహం తగ్గింది. నిజానికి అటువంటి ఉత్సాహం ఉండాల్సిన అవసరం కూడా లేక పోయింది. మనం, దేశ స్వాతంత్రం మన మతం ద్వారా, సంస్కృతి ద్వారా పొందాలని ప్రతిజ్ఞ చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. అందులో బ్రిటీషువారు వెళ్లిపోవడం గురించిన ప్రస్తావనే లేదు. "– ఎంఎస్ గోల్వాల్కర్ అలియాస్ గురూజీ," 1942లో చాలామంది మనసులలో ఒక బలమైన వివేచన ఉండేది. ఆ సమయంలో సంఘ్ కార్యక్రమాలు యథా విధిగా జరిగేవి. ప్రత్యక్షంగా ఏమీ చేయ కూడదని సంఘ్ నిర్ణయించింది.

"గోల్వాల్కర్, సావర్కర్‌ల ఔన్నత్యాన్ని కనుగొనడం" 1990ల నుండి లేదా 21 శతాబ్దపు తొలినాళ్ళ నుండో ప్రారంభమయిం దన్న విషయం ఒక పామరుడికి కూడా అర్థం అవుతుంది. ఆర్ఎస్ఎస్‌కి సావర్కర్‌కి మధ్య సంబంధం ఆత్మకు సంబంధించినది కాదు. అవసరానికి సంబంధించినది. బిజెపి తాను అధికారంలోకి వచ్చిన సరిగ్గా ఐదు సంవత్స రాల తరువాత సావర్కర్ చిత్రపటాన్ని పార్ల మెంటు హాల్‌లో ఆవిష్కరించింది. అంటే, తక్షణ అవసరాలే కాక సావర్కార్ని సొంతం చేసుకోవడంలో దీర్ఘకాల ప్రయోజనాలు కూడా ఉన్నాయని భావించింది. సామ్రాజయవాద వ్యతిరేక పోరాటంలో సావర్కర్ పాత్రని సొంతం చేసుకోవడం అన్నమాట.

స్వాతంత్ర పోరాటం ముమ్మరంగా కొనసాగుతున్న కాలంలో బిజెపి మనుగడలోకి వచ్చినా స్వాతంత్రపోరాటానికి దూరంగా ఉండాలని భావించిందన్న విషయం అందరికీ తెలిసిందే. ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన తరువాత, స్వాతంత్రం రావడానికి ముందున్న ఇరవై ఏళ్ల పై చిలుకులో ఒక్కసారి కూడా బ్రిటిషు వారికి వ్యతిరేకంగా ఒక్క పిలుపు కూడా ఇవ్వలేదు. అంతేకాదు స్వాతంత్ర పోరాటంలో పాల్గొవాలనుకున్న వారిని శిక్షించింది కూడా. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ కూడా కాంగ్రెస్‌లో ఉండి ఉద్య మంలో వ్యక్తిగతంగా పాల్గొన్నారు. బ్రిటిష్ వారి ఆంతరంగిక నివేదికలలో కూడా ఎక్కడా ఒక్క వ్యతిరేకత కూడా వారిపైన లేదు. బ్రిటిష్ వాళ్ళు, వారు చేసే సైనిక విన్యాసాలు ఆప మన్న వెంటనే ఆపేసినందుకు వారిని అభి నందించారు.

స్వాతంత్ర పోరాటంలో పాల్గొనక పోవడమేకాదు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉమ్మడిగా కలిసి ఉద్యమంలో పాల్గొన్న వారిని కూడా మత ప్రాతిపదికన విభజించారు.

అందువల్ల వారికి అంటిన ఈ మచ్చ వదిలించుకోవడం సాధ్యంకావడంలేదు. అందువలనే వారికి 'సావర్కర్'ని మహోన్న తుడిగా' 'ఒక చిహ్నంగా' గుర్తించవలసి వచ్చిం ది. సావర్కర్ని గొప్ప స్వతంత్ర సమరయో ధుడిగా పొగిడి, అతనిని సొంతం చేసుకోవ డం వలన తమ పాపం చెరిగిపోతుందని భావిస్తున్నారు. ఒక స్వతంత్ర సమరయోధుడు నుండి ఆ తరువాత కాలంలో హిందుత్వ అధినాయకునిగా సావర్కర్ మార్పు చెందడం కూడా వారికి ఉపయోగకరంగా ఉంది. సావర్కర్ జీవితంలోని అనేక పార్శ్వాలు కూడా వారికి ఇబ్బంది కలిగించేవే. నిజానికి సావర్క ర్‌ని రక్షించే ప్రయత్నం అంటే పాలలోపడ్డ బల్లిలాంటిది. అందుకు కారణం సావర్కర్ బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్ష పిటీషన్ వేసి శరణు కోరడం. మొదట్లో ఈ పిటిషన్‌ని సవాలు చేశారు. కానీ ఒప్పుకోక తప్పలేదు. నిజానికి ఆనాడు అంతటి కఠినమైన శిక్షలను చాలామంది దేశభక్తులు ఎదుర్కొన్నారు. ఇదొక వ్యూహంగా చిత్రించడానికి ప్రయత్నం చేయడం ఆనాటి స్వతంత్ర సమరయోధులు, పేర్లు తెలిసిన వారిని, తెలియనివారిని, అనేక మందిని, అష్ట కష్టాలకోర్చి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న విప్లవ వీరులను అవమానపరచడమే. వారంతా మృత్యువును ప్రేమగా కౌగలించుకున్నారుగాని క్షమాభిక్ష కోరలేదు. శరణువేడలేదు.

ఇలా రక్షణ కోరడంలో అనేక పొర పాట్లు ఉన్నాయి. సెల్యులార్ జైలు నుండి 1913లో కారాగారానికి వచ్చిన సర్ రెజినాల్డ్ క్రాడ్డోక్‌కి సావర్కర్ సమర్పించిన పెటిషన్‌లోని వాక్యాలు," ఈ ప్రభుత్వానికి నేనెటువంటి సేవలు అందించడానికయినా సిద్ధంగా ఉన్నాను. ఏ హోదాలో అయినా ఆ సేవలు చేస్తాను. నా ఆలోచనలలో ఈ మార్పు చైతన్య పూరితంగా జరిగినది కాబట్టి నేను తప్పకుండా నామాటలకు కట్టుబడి ఉంటాను. అత్యంత బలవంతుడే దయామయుడిగా ఉండగలడు. దారితప్పిన కొడుకు, తండ్రి లాంటి ప్రభుత్వం చెంతకు చేరగలడు కానీ ఇంకెక్కడికిపోగలడు?"

**4. మహాత్మా గాంధీ హత్య, సావర్కర్**

భారతదేశ జాతిపిత, మహాత్మా గాంధీ హత్యలో సావర్కర్ ప్రమేయం ఈ

నాటికీ ఒక పెద్ద వివాదాస్పద విషయం. ఈ కుట్రలో సావర్కర్ హస్తం ఉందని సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ అతని మద్దతుదారులు కొన్ని సాంకేతిక కారణాలు చూపి ఆయన పై అభియోగాలకు మసిపూసి మారేడుకాయ చేసి, రుజువు కాకుండా చూశారు.

గాంధీ హత్య కేసులో సావర్కర్ పాత్రను గురించి వేసిన కపూర్ కమిషన్, "బిర్లా హౌస్‌లో బాంబు పేలిన తరువాత, మదన్ లాల్ ప్రకటన వెలువడిన తరువాత, మహాత్మా గాంధీ జీవితానికి ప్రమాదం పొంచి ఉన్నాదన్న విషయం స్పష్టమయింది. ఈ కుట్ర మహాత్మా గాంధీ పై జరగనుందని, ఇందులో మరాఠాలు పాత్ర ఉందని తేలింది. 1948 జనవరి 20వ తేది మదన్ లాల్ ఇచ్చిన ప్రకటనలలో కనీసం గా రెండు పేర్లు వెల్లడయ్యాయి – కర్కరే, సావర్కర్."

నేరాలు ట్రయిల్ కోర్టులలో పరిశీలించబడుతున్న తరుణంలో ఆత్మా చరణ్, గాడ్సేలు తామే నేరానికి పథక రచన చేసినట్టు, నేరం చేసినట్టు ఒప్పుకున్నారు. స్వతంత్ర నిరూపణకు ప్రోసిక్యూషన్ ప్రయత్నించలేదు. బాగ్డే, స్వతంత్ర వ్యక్తి కానందువలన ఆయన సాక్ష్యం పరిశీలించబడలేదు. అయితే దీనిని ఆ తరువాతి కాలంలో సావర్కర్‌తో దగ్గరి సంబంధం గల వ్యక్తులు – అప్పా రామచంద్ర కసర్, సావర్కర్ బాడి గార్డ్, గజానన విష్ణు, ఆయన కార్యదర్శి ధృవీకరించారు. కానీ వీరు ట్రయల్ జరుగుతున్నప్పుడు సాక్ష్యం ఇవ్వలేదు. 1965లో ఏర్పడిన కపూర్ కమిషన్ ముందు మాత్రమే సాక్ష్యం ఇచ్చారు. కసర్ కాన్పూర్ కమిషన్ ముందు, వారు (గోడ్సే, ఆత్మ చరణ్‌లు) జనవరి 23, 24 తేదీల ప్రాంతాల్లో, అంటే, బాంబు పేలుళ్ల తర్వాత ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తరువాత సావర్కార్ కలిశారని తెలిపారు. గోడ్సే, ఆప్టే సావర్కర్‌ని ఆయన తోటలో, జనవరి నెల మధ్యలో కలిసినట్టు దాంతే సాక్ష్యం చెప్పారు.

ఈ సాక్ష్యాల ఆధారంగా జస్టిస్ కపూర్ ఈ కింది నిర్ధారణకు వచ్చారు. "పై విషయాలన్నీ పరిగణనలోకి తీసుకుంటే, సావర్కర్, అతని సమూహమే గాంధీ హత్య కుట్ర చేయలేదనే వాదనను భగ్నం చేశాయి".

అతని వ్యక్తిత్వాన్ని సమతూకం వేసేందుకు ఉపయోగపడే మరికొన్ని కీలకమైన అంశాలు, చర్చకు అవసరం లేదని గాని, చర్చకు సంబంధం లేదని గాని తొలగించడం జరిగింది. స్వతంత్రంగా ఈ విషయాలన్నిటిని పరిశీలించవలసిన సమయం వచ్చింది. అప్పుడే స్వతంత్ర భారతదేశ చరిత్రలో జరిగిన అనేక

> **"సావర్కర్ చుట్టూ 'నాయకుడి'గా 'వెలుగును' నింపాలని భ్రమపడే వారందరూ, ఆయన జిన్నా కంటే ముందుగానే ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని బయట పెట్టడానికి ఎందుకు వెనకాడుతున్నారు? జిన్నా విభజనని డిమాండ్ చేసిన 'విలన్'గా చిత్రించ బడిన విషయాన్ని ప్రజలలో ఎక్కువమంది భావిస్తున్నప్పుడు, రెండు జాతుల సిద్ధాంతాన్ని అంతకంటే ముందుగా ప్రతిపాదించిన సావర్కార్‌కి 'నాయకుడి' ముసుగు వేయడం సమంజసమేనా?"**

దుర్ఘటనలకి, రక్తపాతానికి సరైన సమాధానాలు దొరుకుతాయి.

సావర్కర్ హిందుత్వ సిద్ధాంతం ప్రతిపాదించిన వాడే కాదు. రెండు దేశాల సిద్ధాంత ప్రతిపాదకుడు కూడా. తన హిందూ జాతి ఆలోచనను పరిపుష్టం చేసుకోడానికి పురాణాలను, చరిత్రను కలిపిన వ్యక్తి. అయోధ్య యువరాజు యుద్ధంలో జయించి తిరిగి అయోధ్య చేరిన నాయకుడి పుట్టిన రోజు మనకు నిజమైన పండగ. ఇది మన నిజమైన జాతీయ దినం: ఎందుకంటే ఆర్యులు ఆర్యే తరులు ఈ దేశంలో ఒకటిగా కలిసిన రోజిది" అన్నారు.

1937లో హిందూ మహాసభ 19వ సెషన్ అధ్యక్షోపన్యాసం చేస్తూ, హిందూత్వ గురించిన తన అవగాహనను ప్రకటించడమే కాక, ద్విజాతి సిద్ధాంతాన్ని కూడా ప్రతిపాదించారు. ఆయన మాటల్లోనే, "... భారతదేశంలో రెండు విరుద్ధజాతులు ఒకరిపక్కన ఒకరు కలిసి నివసిస్తున్నారు. చాలామంది శైశవదశలోని రాజకీయవేత్తలు భారతదేశంలో నివసిస్తున్న ఈ రెండు జాతులు సఖ్యతతో ఉన్నాయని, లేదా సఖ్యతతో ఉండగలవని కోరుకుంటున్నారు. ఈ అర్ధవంత, అనాలోచిత స్నేహితులు తమ కలలు నిజమనుకుంటున్నారు. అందువలనే వారు మతఘర్షణలు జరిగినప్పుడు అసహనానికి గురవుతున్నారు. వాటిని మతతత్వ సంస్థలకు ఆపాదిస్తున్నారు. కానీ బలమైన వాస్తవం ఏమిటంటే, ఈ మతతత్వ సమస్యలు మనకు హిందూ, ముస్లింల మధ్య శతాబ్దాలగా ఉన్న సాంస్కృతిక, మత, జాతి వైరుధ్యాల నుండి వారసత్వంగా సంక్రమించినవే. ఈ రోజు భారతదేశాన్ని ఒక ఏకీకృత, సజాతీయ దేశంగా చూడలేం. దానికి విరుద్ధంగా ఇక్కడున్నవి రెండు దేశాలు. హిందువులు, ముస్లింలు."

ఒక ఏడాది గడిచిన తరువాత ఆయనే, "హిందువులు భారతదేశంలో నివసిస్తున్న భారతదేశస్తులు, ముస్లింలు ఇక్కడున్న ఒక మైనారిటీ జాతి" అన్నారు. "జిన్నా తన ద్విజాతి సిద్ధాంతాన్ని 1939లో ప్రతిపాదించిన విష యం మనం గుర్తించాలి. అంటే సావర్కర్ ప్రతిపాదించిన రెండేళ్ల తరువాత. ఆర్.సి మజుందార్ అనే సంఘ్ పరివార్‌కి అనుకూలు డైన చరిత్రకారుడు, "భారతదేశం మతప్రాతి పదికన విభజించబడాలనే ఆలోచనకు దారి తీసిన ప్రధానమైన అంశం చాలావరకు హిందూ మహాసభ ఆలోచన అని చెప్పుకోవలసి ఉంటుంది" అని అంగీకరించారు. (స్ట్రగుల్ ఫర్ ఫ్రీడమ్, భారతీయ విద్యాభవన్, ముంబై, 1969, 611 పేజీ.)

సావర్కర్ చుట్టూ 'నాయకుడి'గా 'వెలుగును' నింపాలని భ్రమపడే వారందరూ, ఆయన జిన్నా కంటే ముందుగానే ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని బయట పెట్టడానికి ఎందుకు వెనకాడుతున్నారు? జిన్నా విభజనని డిమాండ్ చేసిన 'విలన్'గా చిత్రించ బడిన విషయాన్ని ప్రజలలో ఎక్కువమంది భావిస్తున్నప్పుడు, రెండు జాతుల సిద్ధాంతాన్ని అంతకంటే ముందుగా ప్రతిపాదించిన సావర్కార్‌కి 'నాయకుడి' ముసుగు వేయడం సమంజసమేనా?

1942లో దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా నినాదం మారుమోగుతూ, బ్రిటిష్ పాలనకు నిరసనగా వేలాది మంది ప్రజలు పోలీసులు, సైన్యంతో సహా అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాలు వదులుకుంటున్న సమయంలో హిందుత్వకి అనుకూలమైన సంస్థలు బ్రిటిష్ పాలనతో రాజీ ధోరణిని అవలంభించాయి. ఆర్ఎస్ఎస్ క్విట్ ఇండియా ఉద్యమానికి దూరంగా ఉండడమే కాదు, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కలిసిపోరాడిన ప్రజల మధ్య తన విభజన ఎజెండాను పెట్టింది. దానితో హిందూ రాష్ట్ర ప్రతిపాదన మరో ముందడుగు వేసింది. ఆ సమయంలో సావర్కర్ దేశమంతా తిరుగుతూ, బ్రిటిష్ సైన్యంలో

> ❝ ఒకవైపు కాంగ్రెస్ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 'చావో రేవో' తేల్చుకోడానికి పిలుపునిస్తే, హిందూ మహాసభ సింద్, బెంగాల్‌లలో ముస్లింలీగ్‌తో కలిసి ప్రభుత్వాలను ఏర్పాటు చేసు కుంది. ఒకవైపు సావర్కర్ ముస్లింలను భారత జాతిలో ఇముడ్చు కునే ప్రశ్న లేదంటూ తన వాక్ చాతుర్యంతో భిన్న జాతుల సిద్ధాంతంపై దాడులకు తెగబడుతూనే, 'ముస్లింలని బుజ్జగించడానికి' ఆ పాలనలో భాగస్వామి అవడానికి ఏమాత్రం సందేహించ లేదు. ❞

చేరాలని భారతదేశ యువకులకు పిలుపు నిచ్చారు. "హిందువులను సైనికీకరించు. జాతిని హిందువులుగా మలుచు'' అనే పిలుపునిచ్చి, బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగసిపడుతున్న ప్రజా ఉద్యమాన్ని అణచివేయడానికి బలం చేకూర్చారు.

హిందూ మహాసభ 24వ జాతీయ సదస్సు జరుపుకుంటున్న సందర్భంలో సావర్కర్ ఇచ్చిన ఉపన్యాసం చూద్దాం: అయన బ్రిటిష్ వారి ఎడల హిందూ మహాసభ అనుసరించవలసిన, 'ప్రతిస్పందించే సహకార విధానం' సిద్ధాంతాన్ని తీసుకొచ్చారు. "అన్ని కార్యాచరణ విధానాలలో సహకార ప్రతిస్పందన విధానం ఉత్తమమైన సూత్రమని హిందూ మహాసభ భావిస్తున్నది. హిందూ సంఘటనలలో ఉన్నవారందరూ, కౌన్సెలర్స్, మంత్రులు, శాసన సభ్యులు, ఏదయినా మునిసిపాలిటీలో లేక ఏదయినా ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్న వారు ప్రభుత్వ అధీనంలో ఉన్న ఆయా సంస్థలను వినియోగించుకునే విధానం అమలుచేయాలి. ...అలాచేయడం అంటే దేశానికే అత్యున్నతమైన సేవ చేయడం. ...సహకార ప్రతిస్పందన విధానంలో అన్ని రకాల దేశభక్తియుత కార్యాచరణాలు ఇమిడి ఉన్నాయి – షరతులు లేని సహకారం, సైనిక ప్రతిఘటన కూడా. ఇది ఆయా దేశ కాల పరిస్థితులకు, అధీనములో ఉన్న వనరులకు అనుగుణంగా మారుతుంటుంది. మన దేశ ప్రయోజనాలతో నిర్దేశించబడుతుంటుంది."

ఒక వైపు సుభాష్ చంద్ర బోస్ బ్రిటిష్ సైన్యంతో యుద్ధం చేయడానికి సైన్యాన్ని సమకూర్చుకుంటుంటే, ఈ తేడా వీరుడు సిగ్గు లేకుండా ఎగసిపడుతున్న జాతీయోద్యమాన్ని అణచివేయడానికి బ్రిటిష్ పాలకుల బలాన్ని పెంచే పనిలో ఉన్నారు. హిందూ రాష్ట్రకర్తలు, బోస్ జర్మనీకి వెళ్ళడానికి ముందు సావర్కర్‌ని కలిశాడని భ్రమపడేటట్టు చేస్తుంటారు. కానీ సావర్కర్ ఇండియన్ ఆర్మీకి తన శుభాకాంక్షలు తెలియచేసి ఉంటే, బ్రిటిష్ వారి సైన్యంలో చేరాలని హిందువులను ఎందుకు ప్రోత్సహించారో చెప్పుకోలేక కుడితిలో పడ్డ ఎలక లాగా గిజగిజ లాడుతున్నారు. దీనిని సమర్థించుకోడం చిక్కుముడులతో కూడి ఉంది.

ఒకవైపు కాంగ్రెస్ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 'చావో రేవో' తేల్చుకోడానికి పిలుపునిస్తే, హిందూ మహాసభ సింద్, బెంగాల్‌లలో ముస్లిం లీగ్‌తో కలిసి ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుంది. ఒకవైపు సావర్కర్ ముస్లింలను భారతజాతిలో ఇముడ్చుకునే ప్రశ్న లేదంటూ తన వాక్ చాతుర్యంతో భిన్న జాతుల సిద్ధాంతంపై దాడులకు తెగబడుతూనే, 'ముస్లింలని బుజ్జగించడానికి' ఆపాలనలో భాగస్వామి అవడానికి ఏమాత్రం సందేహించ లేదు. ముస్లింలతో అధికారం పంచుకోడాన్ని కూడా నిసిగ్గుగా సమర్ధించుకున్నారు.

"..రాజకీయాలు అమలు చేసే సందర్భంలో మనం ముందుకెళ్లాలంటే ఎంతోకొంత మేరకు రాజీ ధోరణి అవలంభించాలని హిందూ మహాసభకు తెలుసు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సింధ్‌లో లీగ్‌తో చేతులు కలపడానికి సింద్ హిందూ మహాసభ చొరవ తీసుకుంది. బెంగాల్ పరిస్థితి కూడా అందరికి తెలిసినదే. జూలు విదిలించిన లీగ్ మెడలను నమ్రతతో కాంగ్రెస్ వంచలేకపోయిందిగాని ఫజ్ రూల్ హాక్, సమర్థుడైన మహాసభ నాయకుడు, డాక్టర్ శ్యాం ప్రసాద్‌ముఖర్జీల నాయకత్వంలో ప్రభుత్వం దాదాపు ఒక ఏడాది పాటు విజయవంతంగా నడపబడింది. ఇది రెండు జాతులకు మేలు చేసింది."

నిజానికి 1942లో కాంగ్రెస్‌ని నిషేధించడం, దానిని "రాజకీయ రంగం నుంచి బహిరంగంగా పనిచేయడానికి తొలగించడంతో, ఇక భారత జాతీయ కార్యకలాపాలు" తమ ఆధ్వర్యంలో జరుగుతాయని సావర్కర్ భావించారు.

"దేశభక్తి"గా భావించలేని ఇన్ని సంఘటనలు ఉన్నప్పటికీ సావర్కర్ ఇంకా దేశభక్తుడని ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేయడం హిందుత్వ బ్రిగేడ్‌కే చెల్లింది. భారతదేశ ప్రజలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూ తమ రక్తం ధారపోస్తుంటే, బ్రిటిష్ వారి 'వీరుడు' వారి పాలనను చట్టబద్ధం చేసుకోవడంలో తలమునకలై ఉన్నారు. అంతేకాదు. ఒక తరగతి ప్రజలను బ్రిటిష్ శక్తిలో చేర్చే పనిలో ఉన్నారు.

నిజానికి ఈ 'తేడా వీరుడి' కథ ఇంతటితో ముగియలేదు. అతడు కాంగ్రెస్‌ని 'నిషేధించిన', 'రాజకీయ రంగం నుండి తొలగించిన' ఆనందాన్ని దాచుకోలేదు. తన ఆనందాన్ని వెనువెంటనే ట్రావెన్కోర్ దివాన్ అయిన అయ్యర్‌కి తెలియచేశారు అతడు స్వతంత్రం ప్రకటించుకునే ధైర్యం చేశారు. ఫ్రంట్ లైన్‌లో ఒక వ్యాసంలో నూరాని మాటల్లో "ట్రావెన్కోర్ దివాన్ సి.పి.రామస్వామి అయ్యర్ భారతదేశాన్ని కాదని స్వతంత్రం ప్రకటించుకున్నారు. విశ్వాస ఘాతుకత అంతటితో ఆగలేదు. వెంటనే ఆయన జిన్నాకి చెందిన పాకిస్తాన్‌కి ఒక విదేశీ వ్యవహారాల మంత్రిని నియమించారు. అంటే స్వతంత్ర, సమగ్ర భారతదేశానికి బద్ధ శత్రువుగా ముద్ర వేసుకున్నారు. వెంటనే అతనిని కొనియాడింది ఎవరనుకున్నారు. ఈ వీర్ సావర్కర్ గారే గాని మారేవరో కాదు."

### 5. ప్రాయశ్చిత్త రాజకీయాలు

సావర్కర్ వగ తీర్చుకునే రాజకీయాలు ప్రచారం చేయడం గురించి చెప్పుకోలేకపోతే సావర్కర్ ధైర్యం గురించిన కథను పూర్తిగా చెప్పుకోనట్టే. ఆయన హిందూ రాష్ట్ర అభివృద్ధికి అత్యాచారాన్ని కూడా ఒక ఆయుధంగా వాడాలని చెప్పారు. అమాయకుల పట్ల హింసను సమర్ధించిన విధానం మహిళలు పట్ల వీర శివాజీ చూపిన ఔదార్యాన్ని హేళన చేయడం అభిశంసించవలసిన అంశాలు.

ధనంజయ్ కౌర్ తన ఆత్మ కథలో సావర్కర్ జీవితంలోని ఒక ఘటన గురించి రాశారు. సావర్కర్ 12 సంవత్సరాల వయసులో ప్రాంతీయ మసీదులో రాళ్ళు రువ్వడానికి వెళ్లారు. "మేము ఆ మసీదును మనసుకి తృప్తి కలిగించే వరకు ధ్వంసం చేశాం. మా ధైర్యానికి గుర్తుగా జండా ఎగరవేశాం. మేము శివాజీ యుద్ధ వ్యూహాన్ని అనుసరించాం. మా పని పూర్తికాగానే అక్కడి నుండి పరారయ్యాము."

"ముస్లిం కుర్రవాళ్లు ఈ సంఘటనకి ప్రతిస్పందించగానే సావర్కర్ అతని అనుయా

యులు కత్తులతో, పలుగులతో హింసకు దిగడానికి ఏమాత్రం సంశయించలేదు. ఈ 'మత యుద్ధంలో విజేతలైనందుకు సావర్కర్ తన సంతోషాన్ని ఏమాత్రం దాచుకోలేదు."

నిజానికి బ్రిటిష్ వారు పిల్లల పట్ల హింసాయుతంగా ప్రవరించడాన్ని సావర్కర్ కీర్తించడం కూడా ఒక సమస్య. శ్రీ జ్యోతిర్మయి శర్మ టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రచురించిన 'కనుగొన్న శత్రువు : సావర్కర్ ప్రతీకార రాజకీయాలు' అనే వ్యాసంలో, సావర్కర్ 1857లో కాన్పూర్‌లో జరిగిన ఒక ఘటనని ఎలా వర్ణించారో రాశారు. 1857లో కాన్పూర్‌ని ఆక్రమించుకోడాన్ని గురించి ఏ భావోద్వేగం లేకుండా వరస్ట్," బిబిఘర్ ప్రధాన ఇంగ్లీష్ అధికారిని, ఇంగ్లీష్ వారిని చంపమని బేగం సాహెబ్ ఇచ్చిన ఆదేశాలు ఖైదీ కాపలాదారులు అమలు చేయడానికి తిరస్కరిస్తే, కసాయి వాళ్ళను పిలిపించారు" .. "వాళ్ళు కత్తులతో ప్రవేశించిన వెంటనే 150 మంది మహిళలను పిల్లలను నరికేశారు. ఆ కసాయివాళ్ళు వచ్చేటప్పుడు భూమ్మీదే నడుచుకుంటూ వచ్చినా తిరిగి వెళ్ళేటప్పుడు రక్తపు మడుగులలో నుంచి వెళ్లాల్సి వచ్చింది" అని రాశారు.

సావర్కర్ మహత్తర సాహితి రచనగా చెప్పుకునే భారతదేశ చరిత్రలో ఆరు స్వర్ణ ఘట్టాలులో అయన తన సొంత ఆలోచనలు పంచుకున్నారు. అందులో తన ఇదివరకటి జాతీయవాద తాత్విక చింతనలను పక్కన పెట్టి, కేవలం హిందూ రాష్ట్ర కల సాఫల్యం చేసు కోడం పై దృష్టి పెట్టారు. 'సావర్కర్ హిందుత్వ' గురించి రాస్తూ, శ్రీ అజిత్ కార్నిక్, సావర్కర్ ముస్లింలపై పగ తీర్చుకొనేందుకు సావర్కర్ మరాఠాలను ఎలా తెగనాడదో రాశారు. "1757లో అబ్దల్లి చేసిన దౌర్జన్యాలకు మరాఠీలు ప్రతీకారం తీర్చుకోకపోవడం సావర్కారుకి నచ్చలేదు. మరాఠాలు కేవలం ప్రతీకారం తీర్చుకోవడమే కాదు, ముస్లిం మతాన్ని సమూలంగా నాశనం చేసి, ముస్లింలనందరిని అంతం చేసి, భారతదేశాన్ని ముస్లిం రహిత దేశంగా మార్చి ఉంటే సావర్కర్ ఇష్టపడేవారు. ఇంతకు మునుపు స్పెయిన్, పోర్చుగల్, గ్రీస్. బల్గేరియాలు ముస్లింలను అంతం చేసి క్రిస్టియన్లను రక్షించడాన్ని సావర్కర్ సమర్థించారు. బహుశా సావర్కర్ ముస్లింలను అంతం చేసి భారతదేశం 'హిందువులకు' సురక్షితమైన దేశం చేయాలని భావించి ఉంటారు. ముస్లింలు భారతదేశంలో క్షణం ఉండకూడదనే ఆయన ఆలోచనలు సుస్పష్టం. ఈ దేశంలో ముస్లింలు, ఇస్లాంను అనుసరించేవారు ఉండ

❝ సావర్కర్ మహత్తర సాహితి రచనగా చెప్పుకునే భారతదేశ చరిత్రలో ఆరు స్వర్ణ ఘట్టాలులో అయన తన సొంత ఆలోచనలు పంచుకున్నారు. అందులో తన ఇదివరకటి జాతీయవాద తాత్విక చింతనలను పక్కన పెట్టి, కేవలం హిందూ రాష్ట్ర కల సాఫల్యం చేసు కోడం పై దృష్టి పెట్టారు. 'సావర్కర్ హిందుత్వ' గురించి రాస్తూ, శ్రీ అజిత్ కార్నిక్, సావర్కర్ ముస్లింలపై పగ తీర్చుకొనేందుకు సావర్కర్ మరాఠాలను ఎలా తెగనాడదో రాశారు. ❞



**మహాత్మాగాంధీ హత్య కేసు ముద్దాయిల్లో నాథూరామ్ గాడ్సే (మొదటి వరుస మొదటి వ్యక్తి) తదితరులతో సావర్కర్ కోర్టు బోనులో...(చివరి వరుసలో రెండో వాడు)**

కూడదు."

ఈ పుస్తకంలో సావర్కర్ "ముస్లింల సామూహిక దోషం" గురించి రాయడాన్ని చెప్పుకోవాలి. ముస్లింలు వాళ్ళు చేసిన నేరాలకు కాక వారి సహ మతస్థులు చేసిన తప్పిదాలకు కూడా శిక్షించబడాలి. ఒకరకంగా చెప్పుకోవాలంటే, ప్రతిశోధన, ప్రతీకారాలకు జన్మనిచ్చిన వానిగా తనకు తాను చూపుకున్నారు. ప్రతీకారం, శిక్ష, మొదలైన ఆలోచనలను, సంఘ్ పరివార్, శివ సేన హిందూ మహాసభ వంటి సంస్థల నుండి హెగ్డేవార్, గోల్వాల్కర్, తక్కెర్స్ తొగాడియాల వంటి వ్యక్తుల వరకు, అందరిలో ఈ ఆలోచనలను పాదుగొల్పి, ఉత్సాహపరచిన మొట్టమొదటి మేధావిగా తనకు తాను భావిస్తారు సావర్కర్.

"కార్తీక్," సావర్కర్ మరాఠాలు హిందువులపైన దాడులు చేసిన అబ్దల్లి పైన అతని అనుచర ముస్లింల పై ప్రతీకారం తీర్చుకోలేదని మాత్రమే కోపగించుకోలేదు. మథుర, గోకులంలో నివసించే సాధారణ ముస్లింలను సహితం (సైనికులు కాదు) హననం చేయలేదని, వారి ఇళ్ళు తగలపట్టలేదని, ముస్లిం మహిళలపై అత్యాచారాలు చేయలేదని విమర్శల వర్షం కురిపించారు. ఈ ప్రతీకారం దాడులు దోపిడీలు చేసిన వారి పైనే కాదు, అటువంటి సంఘటనలతో ఏ సంబంధం లేనివారిపైనా కూడా జరగాలని, ఆ ప్రాంతం లోనే కాదు ఇతర ప్రాంతాలలో నివసిస్తున్న ముస్లింల పైన కూడా జరగాలని కోరుకున్నారు. వారి నేరం ఒకటే. అంతకు ముందు తరాలలో తాము అనుసరిస్తున్న మతానికి సంబంధించిన వారు దౌర్జన్యాలు చేయడం."

సావర్కర్ ఈ జాతి శుద్ధిచేసే ఆలోచన ఈ మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న నాగరిక సమాజాలలో అనేక విమర్శలను ఎదుర్కొంది. బోస్నియాలో సెర్బియన్ అతి జాతీయవాదులు చేస్తున్న ప్రచారాన్ని, ఆ అమానుషత్వానికి కారకుల చరిత్రలు గ్రంధ స్తం చేయబడ్డాయి. అందుకు

> **“ కేవలం ఆర్యులే భారతదేశ ప్రాచీనులుగా వాదించడం అంటే, మన మూలాల సమగ్రా కృతిని అర్థంచేసుకునే అవకాశాన్ని వదులుకో వడమే. భారతదేశ వ్యాప్తంగా సాంస్కృతికంగా, సమాజపరంగా, జన్యుపరంగా కూడా ఉన్న వైవిధ్యాలను నిర్లక్ష్యం చేయడమే. కానీ హిందూ మితవాదులు తమ సంస్కృతే ఉన్నతమైనదిగా, ప్రధానమైనదిగా స్థిరపరిచేందుకు కథలు అల్లుతున్నారు.”**

స్లొబోదన్ మీలో సెవిక్ ప్రపంచ కోర్టులో విచారణ ఎదుర్కొ న్నారు. 2002లో గుజరాత్‌లో జరిగిన మారణహోమం ప్రపంచవ్యాప్తంగా ఖండించ బడింది. సుప్రీం కోర్టు కూడా వాటికి ఆధునిక నిరోలు నాయకత్వం వహించారని ప్రకటిం చింది.

ఈ సంఘటనలు జరిగేటప్పటికి సావర్కర్ చనిపోయి చాలా రోజులే అయినప్పటికీ, సావర్కర్ బతికి ఉంటే వాటికి ఎలా స్పందించి ఉండేవారో, అంతకు ముందు జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని, ఊహించడం కష్టం కాదు. పుష్యమిత్ర శృంగుడు బౌద్ధమతాన్ని ఎలా తుడిచిపెట్టేశాడో మనం చూశాం. ఆ సమయంలోనే బ్రాహ్మణవాదం పునరుజ్జీవించబడింది. మనుస్మృతి సూత్రాలు అమలయ్యాయి. ఈ పుస్తకంలో సావర్కర్‌కి బౌద్ధ సన్యాసులై పుష్యమిత్ర శృంగుడు చేసిన అఘాయిత్యాల పట్ల ఎటువంటి బాధ లేదు.

### 6. అత్యాచారం ఒక రాజకీయ అస్త్రం

కళ్యాణ్ నవాబును శివాజీ జయించి, అయన కోడలును తన సైన్యం బంధించి తన ముందు ఉంచినప్పుడు శివాజీ అనుసరించిన తీరును సావర్కర్ విమర్శించడం, ఆయన జీవితంలో అత్యంత ఖండించదగిన అంశం. ఈ సంఘటనని తన పుస్తకం 'భారతీయ ఇతిహాసితిల్ సహా సోనేరి పాణే, లో 'ఇదొక దిక్కుమాలిన ధర్మం' అని అన్నారు. కథనం ప్రకారం, ఒక సైనికాధికారి అత్యుత్సాహంతో, తనకు ఏదయినా బహుమానం దొరుకుతుందని ఆశించి నవాబ్ కోడలిని శివాజీ ముందు ప్రవేశపెట్టాడు. శివాజీ అతనిని అందుకు తీవ్రంగా మందలించడమే కాదు శిక్షించాడు కూడా. ఆమెను గౌరవంగా తన ఇంటికి పంపించేశాడు. కానీ సావర్కర్ ఈ చర్యను ఖండించారు. ఇటువంటి సంస్కారవంతమైన, మానవత్వపు చర్య, ఆ మతమౌఢ్యులలో హిందూ మహిళల పట్ల అదే భావాలను పుట్టించలేదని అన్నారు. కంటికి కన్ను పంటికి పన్ను ఉండాలని కోరుకున్నారు. అంటే, సావర్కర్ ఇతరుల మహిళల పట్ల జరుగుతన్న అనేక అత్యాచారాలకు సైద్ధాంతిక చట్ట బద్ధత కల్పించారు. నిజానికి శివాజీలాగే ఛీమాజీ అప్ప, మరో మరాఠా యోధుడు కూడా స్పందించారు. ఆ విషయం ఒక పోర్చుగీస్ గవర్నర్ భార్య బాస్సన్‌కి సంబంధించినది. శివాజీ, ఛీమాజీ అప్ప ధైర్యాన్ని ప్రజలందరూ కొనియాడు తుండగా, సావర్కర్‌కి మాత్రం వారిని పొగడ డడం నచ్చలేదు. “ఇప్పటికి మనం ఛత్రపతి శివాజీ, ఛీమాజీ అప్పలు కళ్యాన్ గవెర్నర్ ముస్లిం కోడలిని, పోర్చుగీస్ గవర్నర్ కోడలు బస్సిన్‌ని బంధించినా గౌరవంగా తిరిగి తమ ఇళ్లకు పంపడాన్ని ఘనంగా చెప్పుకుంటున్నాం. అయితే శివాజీకి కాని ఛీమాజీ అప్పకి గాని, మొహమ్మద్ గజినీ, మొహమ్మద్ ఘోరీ, అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఇతరులు డబీర్ యువరాణి, కర్ణరాజు భార్య కమలాదేవి, వారి అత్యంత అందాల బిడ్డ దేవళాదేవి, అలాగే వేలాది హిందూ మహిళలపై చేసిన అత్యాచారాలు అప్పుడు గుర్తుకు రాకపోవడం దురదృష్టకరం” అని రాశారు.

“వారి దిక్కుమాలిన ధర్మపు ఆలోచనలు, మహిళలపట్ల గౌరవం, హిందూ జాతికి తీవ్రమైన నష్టాన్ని కలిగించాయి. ముస్లింలు హిందువుల పట్ల వ్యవహరించినట్టు శివాజీ గాని, ఛీమాజీ అప్ప గాని వ్యవహరించలేక పోయారు.”

సావర్కర్ అంతటితో ఆగలేదు. ఈ సమకాలీన వ్యవహారాలన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, వాటిని సరైన రీతిలో పరిశీలించాలని అయన భావన. భారత పాకిస్తాన్ సంబంధాలను గురించి – “భారతీయ మహిళ లపై అత్యాచారాలు చేయడం, ఇతర పైశాచిక చర్యలు,ఆపాలంటే పాకిస్తాన్‌కి కూడా కంటికి కన్ను పంటికి పన్నుతో సమాధానం చెప్పాలి. వారు తాము చేసిన ఘాతుకాలను తెలుసుకోవాల నుంటే, అటువంటి పరిస్థితులను ఎదుర్కోవలసిం దే” అని సావర్కర్ అభిప్రాయం.

సావర్కర్ అనుయాయులకు సావర్కర్ని 'వెతుకులాడే' పని ఇంకా కొనసాగుతున్నది. వారికి ఒక 'గుర్తు' ఉండడం అవసరమే. సావర్కర్ యువకులలో ఒక నాయకుడిగా వెలుగు వెలిగి చివరికి ఒక మతతవాదిగా, విద్వేషానికి ఒక సిద్ధాంత కర్తగా, దానినే ఆచరించేవాడిగా మిగిలిపోయాడు.

అటువంటివాడిని భారతదేశ గొప్ప స్వాతంత్ర పోరాట యోధునిగా, ఆ పోరాటానికి ఒక చిహ్నంగా భారతీయులందరిపైనా రుద్దే హక్కు వారికి లేదు.

హిందుత్వ బ్రిగేడ్ యోధులు అతనినే 'వీరుడిగా' కీర్తించడంతో ఉపశమనం పొందవచ్చు గాక. కానీ లింగ బేధాల పట్ల సున్నితంగా వ్యవహరించేవారు, అతడు శివాజీ, ఛీమాజీల గురించి చేసిన వ్యాఖ్యలను జీర్ణించుకోలేరు. లింగ సమానత్వాన్ని కోరుకునే వారికి, అత్యాచారాల గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు గుణపాఠంగా మిగిలిపోతాయి.

ప్రధాని మోడీ గారికి, ఆయన సహచర క్యాబినెట్ సభ్యులకు, వారికి ఇష్టమైన వారిని ప్రతిమలు చేసుకుని పూజించుకునే హక్కు ఉంది. కానీ అది అంత వరకే పరిమితం. కానీ రాజ్యాం గానికి కట్టుబడి ఉంటామని ప్రమాణం చేసిన 120 కోట్ల జనాభా నాయకులకి, వారి ఆలో చనలు, చర్యలు – ప్రధానంగా ప్రజల మధ్య చేసినవి – శల్య పరీక్షలకు గురవక తప్పదు.

బ్రిటిష్ పాలకులకి క్షమాభిక్షకు అర్జీ పెట్టుకున్న వ్యక్తి, జస్టిస్ కపూర్ కమిటీ. మహాత్మా గాంధీ హత్యకు కుట్ర పన్నిన నేరస్తుడిగా భావించడానికి సరిపడా ఆధారాలు ఉన్నాయని భావించిన వ్యక్తి, అమాయకుల పై ఆఘాయిత్యాలు చేయడం సరైనదని సమర్థించుకునే వ్యక్తి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాయకత్వంలో రూపొందించబడిన భారత రాజ్యాంగాన్ని వ్యతి రేకించిన వ్యక్తి, మనుస్మృతి భారతదేశ రాజ్యాం గంగా ఉండాలని కోరుకునే వ్యక్తి, వారి గుర్తని, నాయకుడని వారెందుకనుకుంటున్నారో ప్రజ లకు చెప్పాల్సిన అవసరం ఉంది.

ప్రజాస్వామ్యం ప్రయోగం 75 ఏళ్లుగా భారతదేశంలో జరుగుతున్న సందర్భంతో – అదెంత పరిమితంగా అయినా – మహిళల సమర్థతని ఎవరైనా ఎలా ప్రశ్నిస్తారు? ఎలా వాదిస్తారు? ఎవరైనా, ఎలా, సమాధానాలు కోరుకోరుకుంటారు? ప్రజాస్వా మ్యానికి చరిత్ర అంటే భయం లేదు. దాని బలమే చరిత్ర. దాని నోరుమూయించలేరు.

**(అనువాదం: కె. ఉషారాణి)**

# ఉప ఎన్నికల ఫలితాలు: బిజెపి వ్యతిరేక సంకేతాలు

ఎస్వీయార్

**2024** పార్లమెంటు ఎన్నికలకు ముందు అయిదు రాష్ట్రాల శాసన సభలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం జమిలి ఎన్నికల పల్లవి ఎత్తుకుంది కాబట్టి ఈ అయిదు రాష్ట్రాలకు ఈ ఏడాది ఎన్నికలు జరుగుతాయా లేక వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలతో పాటు నిర్వహిస్తారా అన్న విషయం సందిగ్ధంలో ఉంది. నిజానికి సార్వత్రిక ఎన్నికలకు ముందు సెమీఫైనల్స్ లాగా జరగబోయే ఈ అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటమి చెందినా, లేక అనుకున్న ఫలితాలు రాకపోయినా బిజెపి వచ్చే ఎన్నికలను ఎదుర్కోవడం కష్ట మవుతుంది గనుకనే అది ఈ సమయంలో జమిలి ఎన్నికల ఆలోచన చేస్తున్నదని కూడా భావిస్తున్నారు.

అయిదు రాష్ట్రాల ఎన్నికలు ఎలా ఉన్నా ఇటీవల ఆరు రాష్ట్రాల్లో 7 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలు మాత్రం బిజెపికీ, దాని విధానాలకూ ప్రజల నుండి ఎదురవుతున్న ప్రతిఘటనకు అద్దం పడుతున్నాయని రాజకీయ పండితులు భావిస్తున్నారు. ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళ, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లలో ఒక్కో అసెంబ్లీ స్థానానికీ, త్రిపురలో రెండు స్థానాలకూ ఉప ఎన్నికలు జరిగాయి. త్రిపురలో ఎన్నికలను పూర్తి స్థాయిలో తొత్తడం చేయడం ద్వారా గెలిచిన రెండు స్థానాలను మినహాయిస్తే వాస్తవంగా బిజెపి గెలిచింది ఉత్తరాఖండ్‌లోని ఒక్క స్థానం మాత్రమే. అదికూడా ఎన్నో ప్రయత్నాలు చేసికూడా బాగా తగ్గిన మెజారిటీతో గెలుపొందింది. మిగిలిన నాలుగు రాష్ట్రాల్లోని నాలుగు స్థానాల్లో ఓడిపోవడమే కాదు, ఉత్తర ప్రదేశ్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లో దానికి గట్టి ఎదురు దెబ్బలు తగిలాయి.

అసెంబ్లీ స్థానాలతో పాటు మహారాష్ట్రలోని రెండు పార్లమెంటు స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉండగా ఓటమి భయంతో అధికార బిజెపి దాన్ని వాయిదా వేసేట్లు చేసిందని భావిస్తున్నారు.

మిగిలిన రాష్ట్రాల్లో కన్నా ఉత్తర ప్రదేశ్‌లో బిజెపి ఓటమి పార్టీ నాయకత్వానికి మింగుడు పడకుండా ఉంది. ఎందుకంటే 'బుల్డోజర్ బాబా'గా పేరు గడించిన ముఖ్యమంత్రి యోగీ ఆధిత్యనాథ్ చట్టాలను తుంగలో తొక్కి కఠిన నిర్ణయాలతో గట్టి పరిపాలన చేస్తున్నాడన్న పేరు తెచ్చుకోడానికి ఇటీవలి కాలంలో నిరంకుశ చర్యలకు దిగడమే కాదు, ఈ బుల్డోజర్ రాజకీయాలను ఇతర బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా అమలు చేయడం ప్రారంభించారు. ఉదాహరణకు ఆగస్టులో నుహ్ మతఘర్షణల తరువాత హర్యానాలోని బిజెపి ప్రభుత్వం బుల్డోజర్లతో ముస్లింల ఇళ్లనూ, షాపులనూ కూలగొట్టడం ప్రారంభించింది. మధ్య ప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం ఆగస్టులో శ్రీరామ నవమి సందర్భంగా జరిగిన హింసా కాండ తరువాత బుల్డోజర్లకు పని పెట్టింది.

ఇలాంటి పరిస్థితుల్లో ఉత్తర ప్రదేశ్‌లోని ఘోసి అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో బిజెపి ఓటమి దాని బుల్డోజర్ రాజకీయాలకు ప్రజల తిరస్కారంగా ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి. బిజెపీ నాయకత్వంలోని ఎన్డీఏకీ ప్రతిపక్ష 'ఇండియా' కూటమికీ మధ్య దాదాపు ముఖాముఖి జరిగిన ఈ ఉప ఎన్నికలో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి సుధాకర్ సింగ్ 42,759 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. సుధాకర్ సింగ్‌కు 1,24,427 ఓట్లు పోలవగా బిజెపి అభ్యర్థి దారా సింగ్ చౌహాన్‌కు 81,668 ఓట్లు వచ్చాయి. మిగిలిన అభ్యర్థులకు నామమాత్రపు ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థికి మద్దతుగా తన అభ్యర్థిని పోటీలో నిలపలేదు. చివరికి ఇండియా కూటమిలో భాగస్వామి కాని బిఎస్‌పి కూడా అభ్యర్థిని నిలపక పోవడంతో ఇక్కడ ముఖాముఖి పోటీ నెలకొంది. 'నోటా'కు ఓటు వేయాలని బిఎస్‌పి పిలుపు నిచ్చింది. కానీ నోటాకు వచ్చిన 1725 ఓట్లను చూస్తే ఆ పిలుపును ఓటర్లు పట్టించుకోలేదని అర్థమవుతుంది.

2018లో ఉత్తర ప్రదేశ్‌లోని కైరానా లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికకూ, ఇప్పుడు ఘోసి ఉప అసెంబ్లీ ఉప ఎన్నికకూ మధ్య సారూప్యతను రాజకీయ పండితులు చూస్తున్నారు. అప్పుడు కూడా సమాజ్‌వాదీ పార్టీ–కాంగ్రెస్–ఆర్ఎల్‌డిలు కలిసి తబస్సుమ్‌ను నిలబెట్టాయి. బిజెపి తరపున పోటీ చేసిన ప్రముఖ రాజకీయ నాయకుడు హుకుమ్ సింగ్ కుమార్తె మృణాల్ సింగ్‌ను తబస్సుమ్ ఓడించారు. అప్పుడు కూడా బిఎస్‌పి అభ్యర్థిని పోటీ పెట్టక పోవడంతో బిజెపికీ ప్రతిపక్ష అభ్యర్థికీ మధ్య ముఖాముఖి పోటీ నెలకొంది.

ప్రజలు ఎన్డీఎ మీద నమ్మకం కోల్పోయారు, ఇండియా మీద విశ్వాసం ఉంచారు అని ఉత్తర ప్రదేశ్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అఖిలేష్ ప్రసాద్ సింగ్ పేర్కొన్నారు. "ముఖాముఖి పోటీ జరిగితే కచ్చితంగా సానుకూలత ఉంటుంది, ఇప్పుడొచ్చిన ఫలితం ఐక్యతకు లభించిన విజయం" అని ఆయన అన్నారు. ఇంతే కాదు నిరుద్యోగం వంటి సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి వ్యతిరేకంగా వచ్చిన తీర్పు ఇది అని ఆయన పేర్కొన్నారు. "యుపిలో జరిగిన ఈ ఉప ఎన్నికలో బిజెపి పూర్తి శక్తిని కేంద్రీకరించి పనిచేసింది. ముఖ్యమంత్రితోపాటు బిజెపి నాయకులంతా కాళ్లకు బలపాలు కట్టుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అయినా ఓడిపోయారు"అని ఆయన చెప్పారు. బిజెపి ప్రజల అసలు సమస్యలను పక్కన పెట్టేస్తున్నదన్న చైతన్యం ప్రజల్లో వస్తోంది అని ప్రసాద్ సింగ్ అన్నారు.

**" పశ్చిమ బెంగాల్‌లో బిజెపి సిట్టింగ్ స్థానాన్ని కోల్పోవడంతో ఆ పార్టీ నాయకులు కంగుతిన్నారు. ఉప ఎన్నిక జరిగిన ధుప్ గురి గత ఎన్నికల్లో బిజెపి గెలుపొందిన 77 స్థానాల్లో ఒకటి. ఆ పార్టీ ఎమ్ఎల్ఏ బిష్ణు పద రే మరణించ డంతో ఇక్కడ ఉప ఎన్నిక అవసర మైంది. త్రుణమూల్, వామపక్షాలు, బిజెపికీ మధ్య త్రిముఖ పోటీలో బిజెపి అభ్యర్థి తపసీ రాయ్ 4.309 ఓట్ల తేడాతో త్రుణమూల్ అభ్యర్థి నిర్మల్ చంత్ర రాయ్ చేతిలో ఓడిపోయారు. 2021 ఎన్నిక ల్లో ఈ స్థానంలో బిజెపి 4,355 ఓట్ల మెజారిటీతో గెలుపొందింది."**

ఈ ఉప ఎన్నికలో బిజెపి పోటీకి పెట్టిన దారా సింగ్ చౌహాన్‌ను 'ఆయారామ్ గయారామ్' చౌహాన్ అంటారు. ఈయన రెండు సార్లు రాజ్యసభ సభ్యునిగా ఎన్నికయ్యారు. మొదట 1996లో ఎన్నికయ్యారు. తరువాత సమాజ్ వాదీ పార్టీలో చేరి 2000 సంవత్సరంలో మరోమారు ఎన్నికయ్యారు. తరువాత 2007లో తిరిగి బిఎస్‌పిలో చేరి 2009 ఎన్నికల్లో లోక్ సభ స్థానానికి ఎన్నికయ్యారు. 2014లో బిజెపి అధికారంలోకి రావడంతోనే ఆయన ఆ పార్టీలో చేరిపోయారు. 2017లో యోగి ఆధిత్యనాథ్ మంత్రివర్గంలో మంత్రిగా చేరారు. తరువాత 2002 ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సమాజ్ వాదీ పార్టీలో చేరారు. కానీ అక్కడ కూడా ఒక్క ఏడాది కూడా ఉండకుండా 2023లో మళ్లీ బిజెపి గూటికి వచ్చారు.

ఉత్తరాఖండ్‌లో బిజెపికి బలమైన స్థానమైన బాగేశ్వర్‌ను పార్టీ నిలబెట్టుకున్నప్పటికీ దాని మెజారిటీ బాగా దిగజారిపోయింది. ఇక్కడ బిజెపి సీనియర్ నాయకుడు చందన్ రామ్‌దాస్ 2007 నుండి 2003 మధ్య నాలుగు సార్లు గెలుపొందారు. ఆయన చనిపోవడంతో బిజెపి ఆయన భార్య పార్వతీ దాస్‌ను పోటీకి పెట్టింది. సానుభూతి ఓట్లతో గెలుస్తామనుకున్నప్పటికీ గతంలో ఆ పార్టీకి వచ్చిన 12,000 మెజారిటీ ఇప్పుడు 2,000కు పడిపోయింది.

పశ్చిమ బెంగాల్‌లో బిజెపి సిట్టింగ్ స్థానాన్ని కోల్పోవడంతో ఆ పార్టీ నాయకులు కంగుతిన్నారు. ఉప ఎన్నిక జరిగిన ధుప్‌గురి అసెంబ్లీ స్థానం గత ఎన్నికల్లో బిజెపి గెలుపొందిన 77 స్థానాల్లో ఒకటి. ఆ పార్టీ ఎమ్ఎల్ఏ బిష్ణు పద రే మరణించడంతో ఇక్కడ ఉప ఎన్నిక అవసరమైంది. త్రుణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు, బిజెపికీ మధ్య జరిగిన త్రిముఖ పోటీలో బిజెపి అభ్యర్థి తపసీ రాయ్ 4.309 ఓట్ల తేడాతో త్రుణమూల్ అభ్యర్థి నిర్మల్ చంత్ర రాయ్ చేతిలో ఓడిపోయారు. 2021 ఎన్నికల్లో ఈ స్థానంలో బిజెపి 4,355 ఓట్ల మెజారిటీతో గెలుపొందింది. ఆయన ఈ ఏడాది ప్రారంభంలో చనిపోవడంతో ఉప ఎన్నిక అవసరమైంది. ఈ ఎన్నికలో బిజెపి 2021లో జమ్ము-కాశ్మీర్ ఉగ్రవాద దాడిలో చనిపోయిన సిఆర్‌పిఎఫ్ జవాను భార్యను సానుభూతి ఓట్ల కోసం పోటీకి పెట్టింది.

ధుప్‌గురి స్థానం ఉత్తర బెంగాల్‌లో ఉంది. ఇక్కడ గత లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం ఎనిమిది స్థానాలకు గాను ఆరు స్థానాలను బిజెపి గెలుచుకున్నది. ఇటీవలి కాలంలో ఉత్తర బెంగాల్‌లో బిజెపి పట్టుకోల్పోతున్నదన్నది. ఈ ఉప ఎన్నిక ఫలితం దీనికి మరో నిదర్శనంగా నిలుస్తుంది. "ఇది చారిత్రక విజయం.... (దేశ వ్యాపితంగా) 7 స్థానాల్లో ఉప ఎన్నికలు జరిగితే ఇండియా ఎక్కువ స్థానాలు గెలుపొందింది" అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు.

గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో గణనీయమైన స్థానాలు సాధించిన బిజెపి క్రమంగా అక్కడ పట్టు కోల్పోతూ వస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లోని మొత్తం 42 స్థానాలకు గాను 16 స్థానాల్లో బిజెపి గెలుపొందింది. 2021 శాసన సభ ఎన్నికల్లో మొత్తం 292 స్థానాలకు గాను 77 స్థానాల్లో ఆ పార్టీ గెలిచింది. తరువాత ఆ పార్టీ బలం తగ్గుతూ వస్తోంది. గత ఎన్నికల్లో దెబ్బతిన్న వామపక్షాలు ఇటీవలి స్థానిక ఎన్నికల్లో గణనీయమైన ఓట్లు సాధించి బలం పుంజుకున్నాయి. 2018లో అనేక మంది బిజెపి నాయకులు త్రుణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ ఆరుగురు శాసన సభ్యులు బిజెపిని వదిలి త్రుణమూల్ కాంగ్రెస్‌లో చేరారు.

జార్ఖండ్‌లోని దుమ్రి శాసన సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఇండియా కూటమి భాగాస్వామి అయిన జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) అభ్యర్థి బేబీ దేవి గెలుపొందారు. బేబీ భర్త, సీనియర్ జార్ఖండ్ మంత్రి అయిన జగర్నాథ్ మెహతో మృతితో ఇక్కడ ఉప ఎన్నిక అవసరమైంది. మామూలుగా అయితే ఇక్కడ అధికారంలో ఉన్న జెఎంఎం తన సీటును నిలుపుకుంది కాబట్టి పెద్ద ప్రాముఖ్యత లేదనిపిస్తుంది. కానీ జెఎంఎం అధినేత, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మీద కేంద్ర ప్రభుత్వం ఇడి కేసులు పెట్టి వేధిస్తున్న వేళ దానికి ఈ విజయం పెద్ద టానిక్‌లాగా పనిచేస్తుంది. అంతే కాదు ఇక్కడ జెఎంఎంను ఓడించడంద్వారా సోరెన్‌కూ, దాని ప్రభుత్వానికీ ప్రజల మద్దతు లేదని ప్రచారం చేయడానికి బిజెపి శతవిధాలా ప్రయత్నించింది. గత ఎన్నికల్లో ఆల్ ఝార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ పార్టీ, బిజెపి వేరుగా పోటీ చేసి 36 వేలు చొప్పున ఓట్లు సాధించాయి. ఎంఐఎం తరఫున పోటీ చేసిన అబ్దుల్ మోబిన్ రిజ్వి 24 వేల పైచిలుకు ఓట్లు సాధించాడు. కానీ ఈ సారి బిజెపి పోటీచేయకుండా ఎజెఎస్‌యు పార్టీ అభ్యర్థి యశోదా దేవికి మద్దతిచ్చింది. దాంతో ఇక్కడ పోటీ దాదాపు ముఖాముఖిగా జరిగింది. జెఎంఎం అభ్యర్థి దేబీ దేవి 17,153 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

త్రిపురలోని రెండు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలను బిజెపి భారీ రిగ్గింగుతో ఒక ఫార్సుగా మార్చేసింది. బాక్సానగర్, ధన్‌పూర్ స్థానాలు రెండింటా బిజెపి ప్రభుత్వం పోలీసులను ఉపయోగించుకుని బాహాటంగా రిగ్గింగుకు పాల్పడి గెలుపొందింది. సిపిఐ(ఎం)కు చెందిన ఓటర్లను భయభ్రాంతులను చేసి పోలింగ్ కేంద్రాల వద్దకు రాకుండా అడ్డుకున్నది. 90 శాతం ముస్లిం మైనారిటీలు ఉన్న బాక్సనగర్ నియోజక వర్గంలో బిజెపి గతంలో ఏనాడూ గెలవలేదు. 2023 రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ఈ స్థానంలో సిపిఐ(ఎం) 4,849 ఓట్ల మెజారిటీతో బిజెపిపై గెలుపొందింది. ఈసారి ఉప ఎన్నికలో బిజెపి అభ్యర్థి 30,237 ఓట్ల మెజారిటీతో గెలుపొందడం చూస్తే కచ్చితంగా ఇక్కడ రిగ్గింగు జరినట్లు తేటతెల్లమవుతుంది. ఇక్కడ బిజెపి అభ్యర్థి తాఫజ్జల్ హుస్సేన్‌కు 34,146 ఓట్లు రాగా సిపిఐ(ఎం) అభ్యర్థి మీజాన్ హుస్సేన్‌కు 3,909 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆరుమాసాల క్రితం ఓడిపోయిన బిజెపి అభ్యర్థికి ఇప్పుడు దాదాపు 90 శాతం

ఓట్లు రావడం, అప్పుడు సుమారు 5 వేల మెజారిటీతో గెలిచిన అభ్యర్థికి ఇప్పుడు 10 శాతం ఓట్లు మాత్రమే రావడం రిగ్గింగు కాక మరేమిటి? అని సిపిఐ(ఎం), వామపక్షాలు ఎన్నికల కమిషన్‌ను నిలదీశాయి. అయినా దాని నుండి ఎటువంటి స్పందన రాలేదు. ధన్‌పూర్‌లో కూడా బిజెపి ఇదే పద్ధతిలో రిగ్గింగుకు పాల్పడి గెలుచుకుంది. ఇక్కడ బిజెపి అభ్యర్థికి ఏకంగా 70 శాతం ఓట్లు వచ్చాయి.

త్రిపురలో ఈ రెండు ఉప ఎన్నికల ఫలితాలే అక్కడ భారీగా రిగ్గింగు జరిగిందన్న దానికి నిదర్శనంగా నిలుస్తాయని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. "బాక్సనగర్ నియోజకవర్గంలో బిజెపి 89 శాతం ఓట్లతోనూ, ధన్‌పూర్‌లో 71 శాతం ఓట్లతోనూ గెలుపొందింది. ఇది రాష్ట్ర ఎన్నికల చరిత్రలోనే ఎరుగని విషయం. ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో సిపిఐ(ఎం) చేతిలో ఓడిపోయిన బిజెపికి ఇంతలోనే 89 శాతం ఓట్లు రావడం అంటే రిగ్గింగు ద్వారా మినహా మరో మార్గంలో రావు" అని పార్టీ పేర్కొంది. ఈ ఎన్నికలను రద్దు చేసి, సరికొత్తగా ఎన్నికలు నిర్వహించాలని పార్టీ డిమాండ్ చేసింది.

కేరళలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఊమెన్ చాందీ మృతి చెందడం వల్ల ఖాళీ ఏర్పడ్డ పుతుపల్లి నియోజకవర్గంలో ఆయన కుమారుడు చాందీ ఊమెన్ సానుభూతి వెల్లువలో 36 వేల పైచిలుకు మెజారిటీతో సిపిఐ(ఎం) అభ్యర్థి జైక్ సి థామస్ మీద గెలుపొందారు. సీనియర్ చాందీ చనిపోయిన నెల రోజులకే ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది.

మహారాష్ట్రలో ఇటీవలి కాలంలో పార్టీలను చీల్చి, శాసన సభ్యులను గుండుగుత్తగా కొనుగోలు చేసిన బిజెపి ఓటమి భయంతో అక్కడ రెండు పార్లమెంటు స్థానాలకు జరగాల్సిన ఉప ఎన్నికలను ఏకంగా వాయిదా వేయించింది. ఈ రాష్ట్రంలో గత మార్చి నెలలో కాంగ్రెస్ సభ్యుడు, మేలో బిజెపి సభ్యుడు మృతి చెందడంతో రెండు లోక్‌సభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డాయి. మామూలుగా అయితే ఈ రెండు స్థానాలకు దేశవ్యాపితంగా అసెంబ్లీ స్థానాలతో పాటు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ ఎన్నికల కమిషన్ విచిత్రంగా వీటికి ఎన్నికలు నిర్వహించలేదు. గత ఫిబ్రవరిలో పునేలోని కస్బాపేట్ శాసన సభ స్థానినికి జరిగిన ఉప ఎన్నికలో బిజెపి ఘోరంగా ఓడిపోయి కాంగ్రెస్ అభ్యర్థి రవీంద్ర ధంగేకర్ గెలుపొందారు. దాంతో ఈ రెండు లోక్ సభ స్థానాల్లో కూడా

"మహారాష్ట్రలో ఇటీవలి కాలంలో పార్టీలను చీల్చి, ఎంఎల్ఎలను కొనుగోలు చేసిన బిజెపి ఓటమి భయంతో అక్కడ రెండు పార్లమెంటు స్థానాలకు జరగాల్సిన ఉప ఎన్నికలను ఏకంగా వాయిదా వేయించింది. ఈ రాష్ట్రంలో గత మార్చి నెలలో కాంగ్రెస్ సభ్యుడు, మేలో బిజెపి సభ్యుడు మృతి చెందడంతో రెండు లోక్‌సభ స్థానాలకు ఖాళీలు ఏర్పడ్డాయి. మామూలుగా అయితే ఈ రెండు స్థానాలకు దేశవ్యాపితంగా అసెంబ్లీ స్థానాలతో పాటు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ ఎన్నికల కమిషన్ విచిత్రంగా వీటికి ఎన్నికలు నిర్వహించలేదు."



యుపిలో ఘోసి అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలతో సమాజవాదీ పార్టీ కార్యకర్తల సంబరాలు

ఓటమి తప్పదనుకున్న బిజెపి ఉప ఎన్నికలను తప్పించుకోడానికి ఎత్తుగడ వేసిందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. బిజెపికి అనుకూలంగా ఎన్నికల సంఘం ఈ రెండు స్థానాల విషయంలో నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తున్నదని భావిస్తున్నారు.

పునే లోక్‌సభ స్థానంలో బిజెపికి గట్టి పట్టు ఉన్నది. 2014, 2019లో ఇక్కడ బిజెపి గెలుపొందింది. గత ఎన్నికల్లో గెలుపొందిన బిజెపి సభ్యుడు గిరిష్ బాపట్ సుదీర్ఘ అనారోగ్యంతో మార్చి 29న మరణించారు. మామూలుగా అయితే ఇక్కడ ఉప ఎన్నిక జరగాలి. కానీ గత ఫిబ్రవరిలో పునేలోని కస్బా పేట్ శాసన సభ స్థానంలో ఓటమి తరువాత బిజెపి రిస్కు తీసుకోవడం అనవసరమనుకుంది. కస్బా పేట్ ఎంఎల్ఎ అయిన ముక్త తిలక్ 2022 డిసెంబర్ 22న మరణించారు. 2023 ఫిబ్రవరి 26న ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది. 1990 నుండి 2019 వరకు బిజెపి గెలుపొందుతూ వస్తున్న ఈ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలవడంతో బిజెపి కంగు తిన్నది. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఉన్న ఒకే ఒక ఎంపీ బాలు ధానోర్కర్ మే 30న మరణించారు. దాంతో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రపూర్ స్థానానికి ఎన్నిక జరగాల్సి ఉండె. సాధారణ ఎన్నికలకు ఏడాది లోపు గడువు ఉంటే ఉప ఎన్నిక నిర్వహించాలా వద్దా అనే విచక్షణ ఎన్నికల కమిషన్‌కు ఉంటుంది. ఈ విచక్షణాధికారాన్ని ఉపయోగించుకుని ఎన్నికల సంఘం రెండు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలకు వెళ్లకుండా నిలువరించింది. కానీ దీని వెనుక బిజెపి రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయని పరిశీలకులు చెబుతున్నారు.

మొత్తం మీద చూసినప్పుడు దేశవ్యాపితంగా జరిగిన ఈ ఉప ఎన్నికల ఫలితాలు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి హెచ్చరికలు జారీచేస్తున్నాయని రాజకీయ పండితులు భావిస్తున్నారు.

❋

అంతర్జాతీయం

# సుదూర కలగా మిగిలిన 'అనీమియా ముక్త్ భారత్'

అనూషా పాల్

ప్రపంచంలో అత్యంత విస్తారంగా వ్యాపించి ఉన్న జన్యుపరమైన వ్యాధి సికిల్ సెల్ అనీమియా (ఎర్ర రక్త కణాలను దెబ్బతీసే రక్త హీనత). ఈ వ్యాధి భారతదేశంలో అత్యధికంగా వ్యాపించి ఉంది. ఇది మలేరియా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తీవ్రత ఉంటుంది.

2020 నాటికి రక్తహీనతను నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం 2018లో "అనీమియా ముక్త్ భారత్" కార్యక్రమాన్ని ప్రకటించింది. ఇందులో హిమోగ్లోబినోపతి (వారసత్వంగా సంక్రమించే రక్త కణాల అధిక ఉత్పత్తి రుగ్మత), సికిల్ సెల్ అనీమియా (ఎస్‌సిఎ) వంటి రక్తహీతన అంశాలు కూడా ఉన్నాయి. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమైన తర్వాత, 2047 నాటికి రక్త హీనత వ్యాధిని నిర్మూలించడానికి "మిషన్ మోడ్"లో పని చేస్తామని ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో మరో ప్రకటనతో ముందుకు వచ్చింది.

సికిల్ సెల్ అనీమియా (ఎస్‌సిఎ) నివారణ, నిర్వహణ కోసం ప్రామాణిక చికిత్స సిఫార్సులు లేకుండా అలాగే క్రమబద్ధమైన కార్యాచరణ వ్యవస్థ లేకుండా, ప్రభుత్వం 2047 నాటికి ఈ పరిస్థితిని ఎలా నిర్మూలిస్తుంది? వాస్తవానికి 2016లోనే దీని అమల్లో అనేక అంతరాలు చోటు చేసుకుంది. ఎస్‌సిఎ తో సహా అనేక రక్త రుగ్మతలు, రక్తహీనత వ్యాధులను నివారించడానికీ, నియంత్రించ డానికీ మంత్రిత్వ శాఖ ఒక మార్గదర్శకాన్ని విడుదల చేసింది. కానీ దీని మీద అనేక రాష్ట్రాల ఆరోగ్య శాఖలు పెద్దగా దృష్టి పెట్టలేదు.

**సికిల్ సెల్ అనీమియా అంటే ఏమిటి?**

1910లో పశ్చిమ దేశాల వైద్యులు డాక్టర్ జేమ్స్ హెరిక్ స్ప్రెయిన్, సికిల్ సెల్ అనీమియాను గుర్తించారు. రక్తహీనత కలిగిన విద్యార్థిలో ఆయన ఒక ప్రత్యేకమైన ఎర్ర రక్త కణాన్ని గమనించారు. ఇవి ప్రత్యేకమైనవి. ఇవి ఒక కొడవలి ఆకారంలో C అక్షరాన్ని పోలి ఉంటాయి, భారతదేశంలో, తొలిసారిగా ఎస్‌సిఎ కేసు 1952లో ఎత్తైన నీలగిరి ప్రాంతంలో హెచ్ లెమాన్, మేరీ కట్‌బుష్ అనే పరిశోధకులు, గిరిజనులపై అధ్యయనం చేస్తున్నప్పుడు నిర్ధారణ అయ్యింది.

ఎస్‌సిఎ అనేది ప్రపంచంలో అత్యంత విస్తారంగా ఉన్న జన్యు వ్యాధి, భారతదేశంలో అత్యధిక ప్రాబల్యం ఉంది. ఇది మలేరియా ఉన్న ప్రాంతాలలో ఎక్కువగా ఉంటుంది. రెండూ కలిసినప్పుడు సికెల్ సెల్ పరిణామం చెంది ఉత్పత్తి అవుతుంది. ఇది గిరిజన జనాభా ఉన్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఒక నిర్దిష్ట సామాజిక సమూహంతో ఇతర వ్యక్తులు వివాహం చేసుకున్నా లేదా సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్నా ఈ వ్యాధి అధికంగా సంక్రమిస్తుంది.

ఎస్‌సిఎ అనేది బీటా-గ్లోబిన్‌ను ఉత్పత్తి చేసే జన్యువులోని ఒక దశ నుండి మరో దశకు పరివర్తన చెందడం వల్ల కలిగే జన్యుపరమైన రుగ్మత. దీని ఫలితంగా హిమోగ్లోబిన్ సికిల్ వస్తుంది. ఈ పరివర్తన దశ ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలో మారడానికి కారణమవుతుంది. ఫలితంగా శరీర నొప్పులు, రక్తం గడ్డకట్టడం, శ్వాస ఆడకపోవడం, రక్తహీనత, కామెర్లు, న్యుమోనియా, ఇన్ఫెక్షన్లు వంటి లక్షణాలు తరచుగా కనిపిస్తాయి. ఈ పరిస్థితి ఉన్న వ్యక్తుల సగటు జీవితకాలం 42-48 సంవత్సరాలు. ఈ ఇన్ఫెక్షన్ బారిన పడిన పిల్లలు 50 శాతం మంది ఐదేళ్లలోపే మరణిస్తున్నారు.

**2024 నాటికి ఈ పరిస్థితిని నిర్మూలించడం సాధ్యమేనా?**

ఎస్‌సిఎ ఒక జన్యుపరమైన రుగ్మత కాబట్టి, 2 కోట్ల మందిలో వ్యాపించి ఉన్న ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం కష్టం. అలా జరగాలంటే, గణనీయమైన సాంకేతిక పురోగతి అవసరం. జీన్ థెరపీ, స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్లు మాత్రమే వీటికి చికిత్సలు. ఇవి అత్యంత ఖరీదైనవి. అయితే ఇవి ఇంకా పరిశోధన, అభివృద్ధి దశల్లోనే ఉన్నాయి. స్టెమ్ సెల్ మార్పిడితో, సికిల్ సెల్ అనీమియా-బాధిత బోన్ మ్యారో దాత నుండి ఆరోగ్యకరమైన బోన్ మ్యారో కోసం మార్చుకుంటారు. జన్యు చికిత్సతో వ్యాధిని నయం చేయడానికి హిమోగ్లోబిన్ జన్యువులోని డిఎన్ఎను మారుస్తారు. ప్రపంచవ్యాప్త క్లినికల్ ట్రయల్స్‌లో ఇప్పుడు ఈ రెండు చికిత్సలను పరీక్షిస్తున్నారు.

అటువంటి బృహత్తర నిర్మూలన కార్యక్రమాన్ని రూపొందించడానికి, ప్రభుత్వం జాతీయ ఆరోగ్య పరిశోధనా కేంద్రాలు, ప్రయోగశాలలు, సైన్స్ అలాగే టెక్నాలజీకి తగినన్ని వనరులను కేటాయించాలి. మరీ ముఖ్యంగా, పీహెచ్‌సీల (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) నుంచి పరిశోధనా కేంద్రాల వరకు ప్రజారోగ్య రంగాన్ని మెరుగుపరచడానికి నిర్దిష్ట ప్రణాళికలు ఉండాలి. కానీ ఆరోగ్య పరిశోధన విభాగం, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మెడికల్ సెక్టార్‌లకు బడ్జెట్‌లో కోతలు పెడుతున్నారని గత ఏడాది బడ్జెట్‌లో స్పష్టమైంది. ఇటువంటి పరిస్థితుల్లో వ్యాధి నిర్మూలన లక్ష్యాలు సాధించడం ఎలా సాధ్యం.

పరిశోధనాభివృద్ధి నిధులు, ఆరోగ్య రంగం ఖర్చులతో పాటు, ఎస్‌సిఎ సహా ఇతర రక్త హీనత వ్యాధులకు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించేసింది. వికలాంగుల హక్కులు, ఆర్‌పిడి చట్టం 2016 అమలుతో సహా అనేక వైకల్య కార్యక్రమాల కోసం ఇచ్చే నిధులను కూడా కేంద్రం కుదించింది.

తల్లిదండ్రులను పరీక్షించడం, పిండంలోని సమస్యను నిర్ధారించడానికి ఖరీదైన విధానాలు అవసరం. ఈ వ్యాధి అధికంగా జన్యుపరంగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉండటం వల్ల, సంతానానికి వ్యాధి సంక్రమిస్తుందో లేదో గుర్తించడానికి గిరిజన ప్రాంతాలలో ప్రజలను పరీక్షించడం ఒక పెద్ద పని. దీని కోసం 2023-24 కేంద్ర బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేవు.

గిరిజన జనాభాను పరీక్షించడం, జన్యుపరమైన కౌన్సెలింగ్ అందించడంపై దృష్టి పెడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 200 జిల్లాల్లో అధిక బాధితులను, కొన్ని రాష్ట్రాల్లో 40 ఏళ్లలోపు వయస్సున్న ఏడు కోట్ల మంది వ్యక్తులను పరీక్షించేందుకు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు పేర్కొన్నాయి. అయితే, ఆరోగ్య మంత్రిత్వ శాఖ లక్ష్యంలో మాత్రం కేవలం 2022-23 లోఎస్‌సిఎ కోసం కోటి మందిని పరీక్షించాలన్న ఒక్క లక్ష్యం మాత్రమే ఉంది.

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) సుమారు కోటి మంది వ్యక్తులను పరీక్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఏడవ మిషన్ స్టీరింగ్ గ్రూప్ సమావేశంలోని మినిట్స్ ప్రకారం ఇప్పటి వరకు కేవలం 10 లక్షల 54 వేల 954 మందిని మాత్రమే పరీక్షించారు. (ఈ వ్యాసం ప్రచురించబడే సమయానికి మరి కొన్ని సంఖ్యలు స్వల్పంగా చేరవచ్చు)

స్క్రీనింగ్ ఫలితాల ప్రకారం 40 ఏళ్లలోపు గిరిజన ప్రజలకు కార్డులు ఇస్తారు. వివిధ కేటగిరీలుగా విభజిస్తారు. కౌన్సెలింగ్ వల్ల జరిగే నష్టం ఏమిటంటే, ఇది కార్డును పొందిన వారికి ఇబ్బందికరంగా మారుతుంది. ఇందులో ముఖ్యంగా అమ్మాయిలు మరింత ఇబ్బందులకు గురవుతారు. సమాజం, ప్రజలు ఆమెను వెలేసే పరిస్థితి వస్తుంది. భారత దేశంలో ఎయిడ్స్ ఉన్న రోగులు సామాజిక కళంకాన్ని నివారించడానికి గోప్యమైన కౌన్సెలింగ్, చికిత్సను తీసుకుంటారు. కానీ ఎస్‌సిఎ ఉన్న ఎవరికీ అలాంటి గోప్యత ఉండబోదు.

వివాహానికి ముందు, గర్భధారణకు ముందు స్క్రీనింగ్ పరీక్షలు జరపాలని జాతీయ హెల్త్ మిషన్ మార్గదర్శకాలు సిఫార్సు చేస్తున్నాయి. వివాహానికి ముందు కౌన్సెలింగ్ సమయంలో ఎస్‌సిఎ వ్యాధి వారికి పుట్టబోయే బిడ్డను ఎలా ప్రభావితం చేస్తుందనే దాని గురించి భాగస్వాములకు తెలియజేస్తారు.

బహిరంగ కౌన్సెలింగ్ వల్ల ఎస్‌సిఎ రోగులు చాలా వివక్షకు గురవుతారు. కొంత మంది చాలా కళంకం చెందినట్లు భావిస్తారు. పరీక్షల్లో పాజిటివ్ అని తేలుతుందేమో అనే భయంతో చికిత్స పొందకుండా ఆలస్యం చేస్తారు. మరో ప్రధాన సమస్య లింగ వివక్ష. ఈ ఆరోగ్య సమస్యలు ఎక్కువగా మహిళలు నియంత్రించలేనివి. అంతేకాకుండా వ్యాధి సంక్రమించిన ప్రతి ఐదుగురిలో ఒక మహిళ

> "సమీప ఆరోగ్య కేంద్రాలకు దూరంగా మారుమూల, కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు నాటు వైద్యంపై ఆధారపడుతున్నారు. అటువంటి పరిస్థితుల్లో జీవిస్తున్న గిరిజనులు తమ జన్యు స్థితి గురించిన సమాచారాన్ని అప్‌లోడ్ చేయడానికి ఇంటర్నెట్‌ని ఆశ్రయిస్తారనేది ప్రభుత్వ ఊహ. వాస్తవానికి ఇది జరిగే పని కాదు. అటువంటి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో సేకరించవచ్చని భావించినప్పటికీ, అటువంటి డేటా భద్రత మరో ప్రశ్నగానే మిగిలిపోయింది."




తమ ఇళ్లలో గృహ హింసకు గురవుతున్నారు.

గిరిజనుల్లో ఎస్‌సిఎ గురించి సమాచారాన్ని సేకరించడానికి, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ప్రజలు తమంత తామే లాగిన్ అయి వివరాల్ని నమోదు చేసుకోవచ్చు. అయితే, వారిలో ఎంతమందికి పూర్తి అవగాహన ఉందో, ఎందమందికి ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉన్నాయో తెలీదు. ఈ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వ్యక్తుల సమాచారం వారున్న ప్రదేశం, లింగం, విద్య, భాష, వయస్సు సామర్థ్యం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. మొబైల్ నెట్‌వర్క్‌లు భారతదేశంలోని పట్టణ ప్రాంతాలకు విస్తరించినప్పటికీ ఇంకా 42,300 గ్రామాల్లో ఇవి లేవు.

సమీప ఆరోగ్య కేంద్రాలకు దూరంగా మారుమూల, కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు నాటు వైద్యంపై ఆధారపడుతున్నారు. అటువంటి పరిస్థితుల్లో జీవిస్తున్న గిరిజనులు తమ జన్యు స్థితి గురించిన సమాచారాన్ని అప్‌లోడ్ చేయడానికి ఇంటర్నెట్‌ని ఆశ్రయిస్తారనేది ప్రభుత్వ ఊహ. వాస్తవానికి ఇది జరిగే పని కాదు. అటువంటి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో సేకరించవచ్చని భావించినప్పటికీ, అటువంటి డేటా భద్రత మరో ప్రశ్నగానే మిగిలిపోయింది.

రక్త మార్పిడి అనేది సమర్థవంతమైన దీర్ఘకాలిక చికిత్స. తీవ్రమైన, దీర్ఘకాలిక సమస్యలకు రక్తమార్పిడి అనేది ఒక ముఖ్యమైన చికిత్స. అయితే కొంతమంది రోగులు మాత్రమే సంరక్షితమైన రక్తాన్ని అందించగలరు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన ప్రకారం, సికిల్ సెల్ రోగులందరికీ (పురుషులు, స్త్రీలు) ఉచిత రక్తమార్పిడిని అందిస్తామని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది, అయితే ఇది ప్రశ్నగా మిగిలింది.

ప్రపంచంలోనే అతిపెద్ద స్థాయిలో రక్తం అవసరం కలిగి ఉన్న భారతదేశం సురక్షితమైన నమ్మదగిన రక్త సరఫరాకు ఎలా హామీ ఇస్తుంది?

చికిత్సకు సంబంధించిన మరో నియమం ఏమిటంటే, నేషనల్ హెల్త్ మిషన్ కింద రాష్ట్ర ప్రతిపాదనకు అనుగుణంగా హైడ్రాక్సీ యూరియా క్యాప్సూల్‌ను ప్రభుత్వం అందివ్వాలి. ప్రభుత్వం క్యాప్సూల్స్‌ను ఉచితంగా పంపిణీ చేస్తుందా లేదా సబ్సిడీ రేటుతో అందిస్తుందా అనేది అస్పష్టంగా ఉంది.

1990లో హైడ్రాక్సీ యూరియా క్యాప్సూల్‌ని వాడినప్పటి నుండి వ్యాధి లక్షణాలు, మరణాలు గణనీయంగా తగ్గాయి. ఇది తీవ్రమైన, దీర్ఘకాలిక సమస్యల నుండి ప్రయోజనం చేకూరుస్తుందని రుజువైంది. ఎస్‌సిఎ వ్యాధి ఉన్న వ్యక్తి ప్రతిరోజూ కనీసం ఒక క్యాప్సూల్ తీసుకోవాలి. కొన్ని సందర్భాల్లో హైడ్రాక్సీ యూరియా క్యాప్సూల్‌ను నెలలో రోజుకు రెండు సార్లు వేసుకోవాలని వైద్యులు సిఫారసులు చేస్తారు. అంటే, నెలలో మొత్తంగా 30-60 క్యాప్సూల్స్ వేసుకోవాల్సి ఉంటుంది. 10 క్యాప్సూల్స్ ఉన్న ఒక స్ట్రిప్ ధర రూ.

> **"ఈ వ్యాధి వల్ల శరీరంలో జరిగే ప్రక్రియ కారణంగా వచ్చే అసాధారణ మార్పుల్ని తట్టుకోవా లంటే పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలి. ఎస్‌సిఎ వ్యాధి ఉన్నవారు రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలలో లోపాన్ని నివారించడానికి అధికంగా ఉండే పోషకాల్ని తీసుకోవాలి. ఎందుకంటే వారి జీవక్రియ అధిక మొత్తంలో పని చేసి తరచూ అలసిపోతుంటుంది. అందుకే ఈ రోగులకిచ్చే ఆహారంలో పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు పప్పుధాన్యాలు సాధారణ ఆహారంలో భాగంగా సిఫార్సు చేస్తారు."**

130–180 ఉంది. అందువల్ల, క్యాప్సూల్ ధర నెలకు రూ. 1,080. అయితే, ప్రస్తుతం కేరళ, తమిళనాడు మాత్రమే హైడ్రాక్సీ యూరియా క్యాప్సూల్‌ను ఉచితంగా ప్రజలకు సరఫరా చేస్తున్నారు.

వ్యాధి (పాథోఫిజియాలజీ) వల్ల శరీరంలో జరిగే ప్రక్రియ కారణంగా వచ్చే అసాధారణ మార్పుల్ని తట్టుకోవాలంటే పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలి. ఎస్‌సిఎ వ్యాధి ఉన్నవారు రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలలో లోపాన్ని నివారించడానికి అధిక మొత్తంలో ఉండే పోషక విలువల్ని తీసుకోవాలి. ఎందుకంటే వారి జీవక్రియ అధిక మొత్తంలో పని చేసి తరచూ అలసిపోతుంటుంది. అందుకే, ఎస్‌సిఎ రోగులకు సిఫార్సు చేయబడిన ఆహారంలో పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు పప్పుధాన్యాలు సాధారణ ఆహారంలో భాగంగా సిఫార్సు చేస్తారు.

అదనపు మల్టీ విటమిన్‌లు, అమైనో ఆమ్లాలు, ఫోలిక్ యాసిడ్‌లు తీసుకుంటే పోషకాహార లోపాలను నివారించడంలో సహాయపడుతుంది. వ్యాధికి గురైన వ్యక్తిని ప్రమాద స్థితికి వెళ్లనివ్వకుండా ఈ మందులు కాపాడతాయి. తరచు ఇన్ఫెక్షన్, రోగాల భారిన పడకుండా ఆసుపత్రిపాలు కాకుండా ఉండాలంటే, ఎస్‌సిఎ రోగులు టీకాలు, సమతుల్య ఆహారం, ఐరన్ లేని మల్టీవిటమిన్ మందులను తీసుకోవాలి.

బియ్యం, గోధుమలు, ఎడిబుల్ ఆయిల్స్, ఉప్పు, పాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. ఎస్‌సిఎ, తలసేమియా, తీవ్రమైన అంటువ్యాధులు, తీవ్రమైన పోషకాహార లోపం, మలేరియా, మధుమేహం లేదా క్షయవ్యాధి, కొన్ని దశలు ఉన్నవారు ఇనుముతో కూడిన ఆహారాన్ని తినకూడదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల ద్వారా ఇనుముతో కూడిన బియ్యాన్ని అందజేస్తోంది.

ముఖ్యంగా పేద వర్గాలు, ప్రత్యేకించి గిరిజన ప్రాంతానికి ఇనుముతో కూడిన బలవర్ధకమైన బియ్యం అత్యవసరంగా మారింది. ఎందుకంటే వారు బహిరంగ మార్కెట్ నుండి సాధారణ (నాన్–ఫోర్టిఫైడ్) బియ్యాన్ని కొనుగోలు చేయలేరు.

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం, తలసేమియా – ఎస్‌సిఎ రోగులకు బలవర్ధకమైన బియ్యం లేబుల్‌పై తప్పనిసరిగా హెచ్చరించాలి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల ప్రకారం, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఫుడ్ ఏజెన్సీలు, ఫోర్టిఫైడ్ ఫుడ్స్ యొక్క వాణిజ్య ఉత్పత్తిదారులు తప్పనిసరిగా "+F" లోగోను ఎస్‌సిఎ తలసేమియా వంటి రక్త వ్యాధులు ఉన్నవారికి ఆరోగ్య హెచ్చరిక కోసం ప్రదర్శించాలి.

కానీ, వాస్తవానికి, అవసరమైన లేబులింగ్ లేకుండానే బలవర్ధకమైన బియ్యం సంచులు అమ్ముతున్నారు. అవే కనుగోలు చేస్తున్నారు. ధాన్యాన్ని రాయితీ ధరలకు విక్రయించే వినియోగదారులకూ, న్యాయమైన ధరల దుకాణాల యజమానులకూ ఆరోగ్య ప్రమాదాల గురించి ఎటువంటి సమాచారం లేదు. అటువంటి వినియోగదారులకు నాన్ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందించే ప్రయత్నం ప్రభుత్వం ఇంతవరకు చేయలేదు.

సికిల్ సెల్ వ్యాధి ఉన్న వ్యక్తులు శరీరానికి అనుకూలించే ఆహారంతోనే తగినంత పోషకాహారం, రోగనిరోధక పనితీరును పొందవచ్చు, వారి అనారోగ్యం, అలాగే మరణాల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. 2023–24 బడ్జెట్‌లో ఆహార సబ్సిడీల కోసం నిధులను తగ్గించడంతో పాటు, దాని నిర్మూలన క్రమంలో ఎస్‌సిఎ వ్యాధి ఉన్నవారికి అదనపు పోషకాహార సహాయాన్ని చేర్చడంలో కూడా ప్రభుత్వం విఫలమైంది.

అతి తక్కువ నిధులతో ఉన్న మన ఈ ప్రజారోగ్య వ్యవస్థలో ఈ పరిస్థితి ఉన్నవారిని వివాహం లేదా సంభోగం పూర్తిగా వదులుకోవాలని చెప్పడం లేదా రోగిలోని క్రిమిని అంతం చేయడం రెండే మార్గాలు న్నాయి.

ఈ వ్యాధి ఇప్పటికే తీవ్రంగా అణచివేతకు గురవుతున్న గిరిజన ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్నందున, ప్రస్తుత మితవాద ప్రభుత్వం ఈ వ్యాధిని సాకుగా చూపి ఆ ప్రాంతాలను నిర్వీర్యం చేసే ప్రమాదం కనిపిస్తోంది. మధ్యప్రదేశ్‌లోని పాలక భారతీయ జనతా పార్టీ, ఝబువా జిల్లాలో అట్టడుగు గిరిజన వర్గాల మధ్య సామూహిక వివాహాలు నిషేధించడం, గర్భనిరోధక మాత్రలు, కండోమ్‌లతో కూడిన కిట్‌లను పంపిణీ చేయడం వంటి చర్యలు ఆ దిశగా చేస్తున్న కొన్ని ప్రయత్నాలు మాత్రమేనని గమనించవచ్చు. డిండోరి జిల్లాలో ఎస్‌సిఎ వ్యాధి కోసం స్క్రీనింగ్ చేస్తున్నట్లు నటిస్తూ గర్భ పరీక్షలను నిర్వహించింది. ఇది కూడా ప్రమాదాన్ని సూచిస్తోంది.

(అనువాదం : విష్ణు వర్ధని)


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**




చిలీ అధ్యక్ష భవనంపైకి కాల్పులు జరుపుతున్న కుట్రదారుల తరపు సైన్యం

# అలెండీ... బ్రతికే ఉన్నాడు

(2వ పేజీ తరువాయి)

ఈ తరహా దుశ్చర్యలకు పేరెన్నికగన్న సిఐఎను రంగంలోకి దించింది. అప్పటికే దేశాధ్యక్షుడిగా ఎన్నో ప్రజానుకూల నిర్ణయాలను తీసుకున్న అలెండీ పేదల మూలుగులు పీల్చి పిప్పి చేస్తున్న రాగి గనులపై దృష్టి సారించారు. పెట్టుబడి దారుల చేతుల్లో ఉన్న ఆ గనులను జాతీయం చేయాలని నిర్ణయించాడు. ఈ నిర్ణ యం చిలీ పెట్టుబడిదారుల్లో కలకలం రేపింది. వారి తరపున ఎన్నికైన శాసనసభ్యులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు.

రాగి గనుల యజమానుల చేతుల్లోనే చిలీ ఆర్థిక వ్యవస్థ కేంద్రీకృతమై ఉంది. లారీల వంటి రవాణా సాధనాలు వారి చేతుల్లోనే ఉన్నాయి. దీనిని అవకాశంగా తీసుకుని లారీల సమ్మెను ప్రారంభించారు. అప్పటికే బరిలోకి దిగిన సిఐఎ పావులను శరవేగంగా కదిల్చింది. సైన్యాన్ని రెచ్చగొట్టింది. 1973 సెప్టెంబర్ 11న జనరల్ పినోచెట్ నేతృత్వంలో సైన్యం తిరుగుబాటు ప్రకటించింది. సామాన్య ప్రజానీకం ప్రతిఘటించినా ఫలితం లేకుండా పోయింది. అధ్యక్ష భవనంలోకి ప్రవేశించిన సైన్యం ఒక్కొక్క గదిని ధ్వంసం చేసింది. తిరుగుబాటు దారుల నుండి అధ్యక్ష భవనాన్ని కాపాడటానికి చేతిలో తుపాకి పట్టుకుని అలెండీ ప్రత్యక్షంగా పోరాటంలోకి దిగాడు. ఆ పోరాటంలోనే తుది శ్వాస విడిచాడు. చనిపోవడానికి కొన్ని నిమిషాల ముందు దేశ ప్రజల నుద్దేశించి చేసిన రేడియో ప్రసంగంలో ప్రజా ప్రభుత్వం సాధించిన విజయాలను కాపాడుకోవాలని, సామ్రాజ్య వాదుల కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చాడు.

**ఆ తరువాత...!**

తిరుగుబాటు తరువాత ఏర్పడిన అమెరికా తొత్తు ప్రభుత్వం చిలీని కార్పొరేట్ల ప్రయోగశాలగా మార్చింది. నూతన సరళీకరణ విధానాలను మొట్టమొదటిసారిగా అమలు చేసింది. ఫలితం పేద, మధ్య తరగతి ప్రజల జీవితం దుర్భరంగా మారింది. మధ్యతరగతి ప్రజానీకం తమ జీవనాన్ని కొనసాగించడానికి రుణాలపై ఆధారపడాల్సివచ్చింది. రుణభారం పెరగడమే కానీ, తగ్గే పరిస్థితి లేకుండా పోయింది. గృహరుణం, విద్యారుణం వంటివి పెనుభారంగా మారాయి. విద్యారుణం యువత బతుకులను కల్లోలం చేసింది. దీంతో ఈ అదృశ్య భారాన్ని తొలగించాలన్న డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా నిరసనలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వాలు ఈ సమస్యను పరిష్కరించలేక పోయాయి.

2019లో చిలీ వ్యాప్తంగా సామాజిక విస్ఫోటనం బద్దలైంది. లక్షలాది మంది ప్రజలు రోడ్ల మీదకు వచ్చారు. 2021లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష వాది గాబ్రియెల్ బోరింక్ ఫాంట్ గెలుపొం దారు. చిలీ చరిత్రలోనే అత్యధిక ఓట్లను సాధిం చిన నాయకుడిగా ఆయన చరిత్ర సృష్టించారు. బోరింక్ ప్రభుత్వంలో కమ్యూనిస్టులు కూడా భాగస్వాములయ్యారు. ప్రజలందరికి సమాన అవకాశాలు కల్పించే కొత్త రాజ్యాంగ రూపకల్పనకు సంబంధించిన కృషి ప్రారంభమైంది. దీంతో సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ శక్తులు ప్రభుత్వంలోని కమ్యూనిస్టులపై పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేశారు. మీడియా వారి చేతుల్లోనే కేంద్రీకృతం కావడంతో ప్రజలకు మరో సమాచారం అందేది కాదు. ఫలితంగా ఈ ఏడాది మే నెలలో రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల్లో మితవాదులు మళ్లీ పై చేయి సాధించారు. అయితే, లిబరల్, లెఫ్ట్ పార్టీల్లో కమ్యూనిస్టు పార్టీకి అధిక ఓట్లు వచ్చాయి. ఆ వెంటనే బోరిక్ ప్రభుత్వంలో కమ్యూనిస్టులను అణగదొక్కి, నయా-ఉదారవాద విధానాలను మరింతగా అమలు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే చిలీ ప్రజానీకం ఈ కుట్రను అర్థం చేసుకుంది. అలెండీ స్ఫూర్తితో ప్రగతిశీల విధానాలకు మద్దతు తెలుపుతూ రోడ్ల మీదకు రావడం ప్రారంభించింది. అయితే, 1973 తిరుగుబాటు సమయంలో ఉన్న వారిలో కేవలం 30 శాతం మంది మాత్రమే ప్రస్తుతం జీవించి ఉన్నారు. వారు మాత్రమే సామ్రాజ్యవాదం ప్రజల జీవితాల్లో సృష్టించిన విధ్వంసాన్ని ప్రత్యక్షంగా చూశారు. మిగిలిన వారు, నయా-ఉదారవాద భ్రమల్లో పుట్టి పెరిగిన వారే! వీరిలో అత్య ధికులు ఆ భ్రమలను వదిలించుకుని అలెండీ జెండాను చేతపట్టి ఉద్యమాల్లోకి ఉరుకుతున్నారు. మరణించిన 50 ఏళ్ళ తరువాత కూడా అలెండీ సామ్రాజ్య వాదులకు సింహస్వప్నంగా నిలిచారు. ఒక ప్రజా యోధుడికి ఇంతకన్నా ఏం కావాలి? ❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 19, issue: 5 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# భారత్‌లో 78.6 శాతం ప్రయివేట్ విద్యాసంస్థలే



ప్రపంచంలో 14 శాతం ప్రైవేటు పాఠశాల విద్య వుంటే మన పేద దేశంలో 43 శాతం పిల్లలు ప్రైవేటు బడుల్లోనే చదువుతున్నారు. క్రమంగా ఇది కార్పొరేటీకరణకు దారి తీస్తోంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చదువుల భారంతో చిన్నాభిన్నమవుతోంది.

2022 లెక్కల ప్రకారం భారత దేశంలో 1043 విశ్వ విద్యాలయాలు, విడిగా నడిచే 11,779 విద్యా సంస్థలు, 42, 343 కళాశాలలు ఉన్నాయి. దేశంలో మొత్తం విద్యా సంస్థల్లో అనెయిడెడ్ ప్రయివేటు విద్యాసంస్థల శాతం 2001లో 42.6 నుండి 2020 నాటికి 78.6 శాతానికి పెరిగింది. దేశంలోని విద్యా సంస్థల్లో సగానికన్నా పైగా ప్రయివేటు రంగంలో ఉన్నాయి.

ప్రభుత్వాలు రానురాను ప్రజలకు విద్యను అందించే బాధ్యతనుండి తపించుకుని ప్రయివేటు రంగానికి విద్యారంగాన్ని అప్పగించడం వల్ల ఈ రంగంలో అనేక రుగ్మతలు ఏర్పడుతున్నాయి. మొదటిది, విద్య సామాన్యులకు విపరీతమైన భారం అవుతోంది. ప్రయివేటు విద్యా సంస్థలు ఫీజులను వివపరీతంగా పెంచేస్తుండడంతో విద్య ముఖ్యంగా ఉన్నత విద్య పేదలు, మధ్యతరగతికి మరింత దూరం అవుతోంది. దాంతో సమాజంలో అసమానతలు మరింత పెరగడానికి విద్యారంగం కూడా దోహదపడుతోంది.

అత్యధిక ప్రయివేటు విద్యాసంస్థలు నైపుణ్యం లేని, అనుభవం లేని టీచర్లను తీసుకుంటుండం వల్ల విద్య నాణ్యత తగ్గిపోతోంది. అనేక సందర్భాల్లో ప్రయివేటు సంస్థలు అర్హత ఆధారంగా కాకుండా కులం, మతం, ప్రాంతం ఆధారంగా కూడా టీచర్లను నియమిస్తున్నాయి. దాంతో విద్యార్థుల్లో సరైన క్రమశిక్షణ, సామాజిక స్పృహ లోపిస్తున్నాయి.

విద్య వ్యాపారంగా మారిపోవడంతో లాభమే విద్యాసంస్థల ధ్యేయంగా మారింది. దాంతో విద్యాసంస్థల్లో సదుపాయాలు తగ్గిపోతున్నాయి. మంచినీళ్లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, లాబరేటరీలు, లైబ్రరీలు వంటి సదుపాయాలు మృగ్యమవుతున్నాయి.

అన్నిటికీ మించి ప్రయివేటు విద్యాసంస్థల్లో పరీక్షల్లో మార్కుల సంపాదనే పరమావధిగా మారడంతో బట్టీ పట్టించడం, విద్యార్థులపై విపరీతమైన ఒత్తిడి పెట్టడంతో వారి చదువు పరీక్షలు రాయడానికి మినహా జీవితంలో సృజనాత్మకంగా ఎదగడానికి పనికి రావడంలేదు. చదువుల ఒత్తిడితో ప్రయివేటు విద్యా సంస్థల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం రోజురోజుకూ పెరుగిపోతున్నది.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ..........................................

వీధి ..........................................

గ్రామం ..........................................

మండలం లేదా పట్టణం ..........................................

జిల్లా ..........................................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.